సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 261

మంగళవారం 12-12-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం'



వరుణుడు కరుణిస్తేనే...

నేడు భారత్, దక్షిణాఫ్రికాల మధ్య రెండో టి20 మ్యాచ్. -12లో



టాటా పవర్, ఐవోసీ జట్టు

దేశవ్యాప్తంగా 500 ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ఇరు సంస్థల నిర్ణయం -13లో



రాలిపోని ఆత్మవిశ్వాసం..

అలోపేసియా వ్యాధి కారణంగా జుట్టు మొత్తం ఊడినా కుంగిపోకుండా హెయిర్‌లెస్ మోడల్‌గా రాణిస్తున్న కేతకీ జానీపై కథనం.

- వివరాలు 11లో



సోరెన్‌కు ఈడీ మళ్లీ సమన్లు

జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు సోమవారం మరోసారి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సమన్లు జారీ చేసింది.

- వివరాలు 6లో



70,000 వాలా...

సెన్సెక్స్ 44ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో తొలిసారి 70,000 పాయింట్ల సరికొత్త మైలురాయిని తాకింది.

- వివరాలు 13లో



ఎంపీ సీఎంగా మోహన్ యాదవ్

మధ్యప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా ఓబీసీ వర్గం నేత మోహన్ యాదవ్ పేరును బీజేపీ ఖరారు చేసింది.

- వివరాలు 6లో

ఆర్టికల్ 370 రద్దు సబబే



జమ్మూకశ్మీర్‌పై సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం చరిత్రాత్మక తీర్పు

- మోదీ ప్రభుత్వ నిర్ణయం సమర్థనీయమేనని స్పష్టీకరణ
- 370 తాత్కాలిక ఏర్పాటు: సీజేఐ
- లద్దాఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేయడమూ సబబే
- కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలి
- అసెంబ్లీకి వచ్చే సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు నిర్వహించాలి
- మెజారిటీ తీర్పులో జస్టిస్ డి.వై.చంద్రచూడ్
- కశ్మీర్లో హక్కుల హననంపై దర్యాప్తుకు కమిషన్: జస్టిస్ కౌల్
- గట్టి కారణాలుంటేనే కేంద్రపాలిత ప్రాంతాలు: జస్టిస్ ఖన్నా
- ఆర్టికల్ 370 రద్దు రాజ్యాంగ బద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల కొట్టివేత

➤ ఆర్టికల్ 370పై సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన ఈ ఆర్టికల్‌ను రద్దు చేయడం సబబేనని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ సారథ్యంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది. 370 రద్దును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టేస్తూ ఏకగ్రీవంగా మూడు తీర్పులు వెలువరించింది. ఆర్టికల్ 370 తాత్కాలిక ఏర్పాటేనని, దాని రద్దుకు రాష్ట్రపతికి పూర్తి అధికారాలున్నాయని స్పష్టం చేసింది. లద్దాఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడాన్ని సమర్థించింది. జమ్మూ కశ్మీర్‌కు తక్షణం రాష్ట్ర హోదాను పునరుద్ధరించి సెప్టెంబర్ 30లోగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని కేంద్రాన్ని ఆదేశించింది. కశ్మీర్లో మానవ హక్కుల హననంపై స్వతంత్ర కమిషన్ ఆధ్వర్యంలో నిష్పాక్షిక దర్యాప్తు జరగాలంటూ జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ విడి తీర్పు వెలువరించారు. కేంద్రపాలిత ప్రాంతాల ఏర్పాటుకు సహేతుక కారణాలు ఉండి తీరాల్సిందేనని జస్టిస్ సంజీవ్ ఖన్నా తీర్పులో పేర్కొన్నారు. ఈ తీర్పు చరిత్రాత్మకమంటూ మోదీ ప్రస్తుతించారు. ఆరెస్సెస్, బీజేపీ ఈ తీర్పును స్వాగతించగా కాంగ్రెస్, ఇతర విపక్షాలు భిన్నంగా స్పందించాయి. - 6లో

> ఆర్టికల్ 1 ప్రకారమే కాకుండా ఆర్టికల్ 370ని బట్టి చూసినా జమ్మూ కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమే. అలాంటప్పుడు దానికి ప్రత్యేక సార్వభౌమాధికారమంటూ ఏమీ ఉండబోదు. హక్కుల విషయంలోనూ మిగతా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో అది సమానమే. అంతే తప్ప ప్రత్యేకతేమీ ఉండబోదు.
>
> - సుప్రీం చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్

ఏమిటీ ఆర్టికల్ 370?

జమ్మూకశ్మీర్‌కు సంబంధించి చోటుచేసుకున్న కీలక పరిణామాలపై కథనం

నేటి నుంచే రైతుబంధు నిధుల విడుదల..

- రైతుల ఖాతాల్లో జమచేసే విధానం గతంలో మాదిరిగానే....
- రూ. 2 లక్షల రుణమాఫీపై కార్యాచరణ రూపొందించండి
- ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రైతుల బ్యాంకుఖాతాల్లో రైతుబంధు నిధులు జమ చేసే ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యవసాయశాఖపై సోమవారం ఆయన డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ తెలంగాణ సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ కార్యదర్శి శేషాద్రి, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు తదితర అధికారులు పాల్గొన్నారు. 3 గంటల పాటు జరిగిన ఈ సమీక్ష సమావేశంలో వ్యవసాయశాఖ, మిగతా 2వ పేజీలో ▶

వారానికి రెండ్రోజులు

- ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు
- ప్రజాదర్బార్ ప్రజావాణిగా మార్పు

ప్రజాదర్బార్‌ను ఇకనుంచి ప్రజావాణిగా పిలవాలని సీఎం ఆదేశించారు. దీనిని ప్రతీ మంగళ, శుక్రవారాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తామన్నారు. ప్రజావాణికి ఉదయం 10లోగా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌కు చేరుకున్న వారికి అవకాశం ఇవ్వాలని సూచించారు. వికలాంగులు, మహిళలకు ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేయాలని, తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించాలని సీఎం ఆదేశించారు. తొలి ప్రజాదర్బార్ శుక్ర వారం నిర్వహించగా, ఆ తర్వాత రెండు రోజులు శని ఆదివారాలు సెలవు కావడంతో ప్రజాదర్బార్ నిర్వహించలేదు, సోమ వారం ప్రజాదర్బార్ ఉన్నా, సీఎం రేవంత్‌రెడ్డి కాకుండా ఐటీ మంత్రి శ్రీధర్ బాబు నిర్వహించారు, ఇకపై దీనికి ఎవరెవరు హాజరవుతారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. సీఎం ప్రజావాణికి హాజరై విజ్ఞప్తులు స్వీకరిస్తే అవి త్వరితగతిన పరిష్కారం అవుతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

న్యూస్‌రీల్

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి రాజీనామా



తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను గవర్నర్ తమిళిసైకి సమర్పించగా ఆమె ఆమోదించారు. తదుపరి చర్యలు తీసుకోవాలని సీఎస్‌ను ఆదేశించారు.

- వివరాలు 14లో

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై త్వరలోనే శ్వేతపత్రం



రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై త్వరలోనే శ్వేతపత్రం విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి చెప్పారు. 2014 ముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, ప్రస్తుత పరిస్థితులపై శ్వేతపత్రాన్ని సరైన సమయంలో విడుదల చేస్తామన్నారు.

- వివరాలు 3లో

28న మరికొన్ని గ్యారంటీలు ప్రారంభిస్తాం



కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం డిసెంబర్ 28న మరికొన్ని గ్యారంటీలను ప్రారంభిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోమవారం ఢిల్లీలో మీడియాకు తెలిపారు.

- వివరాలు 2లో

ఉద్యోగాలు.. ఇళ్లు.. భూ వివాదాలు



ప్రజాదర్బార్‌లో చాలామంది తమకు ఉద్యోగాలు ఇవ్వాలని, భూ సమస్యలు పరిష్కరించాలని, ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సోమవారం ప్రజాదర్బార్‌లో మంత్రి శ్రీధర్‌బాబు వినతులు స్వీకరించారు.

- వివరాలు 3లో



కీలక అధికారుల బదిలీ!

- పాలనా యంత్రాంగంలో మార్పుచేర్పులకు కొత్త సర్కారు కసరత్తు
- దీర్ఘకాలంగా ప్రాధాన్య పోస్టుల్లో ఉన్నవారికి స్థానచలనం..
- సీసీఎల్ఏ, రెవెన్యూ, పురపాలక, పరిశ్రమలు, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖలకు కొత్త అధికారులు?.. చాలా కాలం నుంచి గుర్తింపు లేని పోస్టుల్లో ఉన్న వారికి సమర్థత ఆధారంగా పోస్టింగ్‌లు
- పదవీ విరమణ చేసిన పలువురు ఐఏఎస్‌లకు ఉద్వాసన తప్పదనే అంచనాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పాలనా యంత్రాంగంలో భారీస్థాయిలో మార్పులు చేపట్టేందుకు కొత్త సర్కారు రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. ప్రత్యేక ప్రధాన కార్యదర్శుల నుంచి జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్ల వరకు అఖిల భారత సర్వీసు అధికారుల బదిలీల కోసం కసరత్తు జరుగుతున్నట్టు ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. ముఖ్యమంత్రి, మంత్రులు బాధ్యతలు స్వీకరించిన వెంటనే సమీక్షా సమావేశాలు నిర్వహించడం వెనుక ఉద్దేశం కూడా ఇదేనని పేర్కొంటున్నాయి. ప్రాథమికంగా సమీక్షించి, ఆయా శాఖల్లో ఏం జరుగుతోందన్న అంశాలను అవగాహన చేసుకున్నాక.. ప్రక్షాళన మొదలుపెట్టనున్నట్టు వివరిస్తున్నాయి.

కొందరు అధికారులపై ఫోకస్

కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పలువురు అధికారులు బీఆర్ఎస్ సర్కారుకు తొత్తులుగా పనిచేస్తున్నారంటూ విమర్శలు గుప్పించింది. హైదరాబాద్ పరిసర ప్రాంత జిల్లాల కలెక్టర్ల పనితీరుపై ఆరోపణలు చేసింది. ఈ నేపథ్యంలో.. ప్రస్తుతం రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న నవీన్ మిట్టల్, పురపాలక శాఖ మిగతా 5వ పేజీలో ▶

సామాజిక న్యాయంతో కొత్త సమన్వయకర్తలు

ఏపీలో 11 నియోజకవర్గాలకు కొత్త వారిని నియమించిన సీఎం జగన్

- మంగళగిరిలో ఆళ్ల స్థానంలో సమన్వయకర్తగా గంజి చిరంజీవి
- గాజువాకలో దేవన్‌రెడ్డి స్థానంలో బీసీ వర్గానికి చెందిన వరికూటి రామచంద్రరావు

మెరుగైన ఫలితాల కోసమే మార్పులు

11 నియోజకవర్గాలకు కొత్త సమన్వయకర్తల నియామకంపై మంత్రి బొత్స, ప్రభుత్వ సలహాదారు సజ్జల

- వివరాలు 10లో

కాళేశ్వరంపై విచారణకు ఆదేశిస్తాం: మంత్రి ఉత్తమ్



- ప్రాజెక్టు పరిస్థితిపై లిఖిత పూర్వక వివరణ సమర్పించాలని ఆదేశించాం
- బ్యారేజీలు డిజైన్ చేసిన, నిర్మించిన వారిని బాధ్యులుగా చేస్తాం
- పెండింగ్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారిస్తాం
- ప్రాణహితపై తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణంపై కేబినెట్‌లో చర్చించి నిర్ణయం
- 14న శాఖ బాధ్యతలు చేపడతా
- నీటి పారుదల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడి - 3లో

బీజేపీ టార్గెట్ 8!



- ఎంపీ టికెట్లకు కమలదళంలో అప్పుడే పోటీ
- ఎనిమిది సీట్లపై పార్టీ అధిష్టానం గురి
- ఓటింగ్ శాతం పెంచుకునేందుకు కసరత్తు

సాక్షి, హైదరాబాద్ : బీజేపీలో అప్పుడే ఎంపీ టికెట్ల ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన నేతలు మరోమారు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు లేకుండా సొంతంగా పోటీచేసిన బీజేపీ 4 సెగ్మెంట్‌లలో గెలిచి అందరినీ ఆశ్చర్యపరిచింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ఒక ఎమ్మెల్యే సీటు గెలిచి 7% ఓట్లు సాధించిన పార్టీ, మరుసటి ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 18 శాతానికి ఓటింగ్‌ను పెంచుకుంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 8 స్థానాల్లో గెలుపొందడమే కాకుండా 18 శాతం ఓటింగ్‌ను నిలుపుకుంది. 19 అసెంబ్లీ సెగ్మెంట్‌లలో బీజేపీ అభ్యర్థులు రెండోస్థానంలో నిలవగా, 49 స్థానాల్లో డిపాజిట్లు దక్కించుకున్నారు. త్వరలో మిగతా 5వ పేజీలో ▶

క్లుప్తంగా...

18 నుంచి 23 వరకు నగరంలో రాష్ట్రపతి విడిది



సాక్షి, హైదరాబాద్: శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ నెల 18న నగరానికి రానున్నారు. ఆరు రోజులపాటు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ముర్ము బస చేయనున్నారు. ఈ నెల 23 వరకు రాష్ట్రపతి శీతాకాల విడిది కొనసాగే అవకాశం ఉన్నట్టు రాష్ట్రపతి నిలయం అధికారి ఒకరు 'సాక్షి'కి తెలిపారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే రాష్ట్రపతి నిలయంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భారీ భద్రతాచర్యలు చేపడుతున్నారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ఈ నెల 25 వరకు సాధారణ పౌరుల రాష్ట్రపతి నిలయ సందర్శనకు అనుమతిలేదని అధికారులు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

వడియారం జంక్షన్ వద్ద అండర్‌పాస్‌ను నిర్మించండి

- కేంద్రమంత్రి గడ్కరీని కోరిన ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ రహదారి 44పై మెదక్ నుంచి తూప్రాన్ వైపు వెళ్లే వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగినందున వడియారం జంక్షన్ వద్ద వెహిక్యులర్ అండర్‌పాస్ నిర్మాణాన్ని చేపట్టాలని బీఆర్‌ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీలో కేంద్ర రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి వినతిపత్రాన్ని అందించారు. అంతేగాక నార్సింగి గ్రామంలో రహదారికి ఇరువైపులా బస్టాండ్ నిర్మాణం, వల్లూర్ గ్రామం వద్ద రహదారికి ఒకవైపు బస్టాండ్ నిర్మాణం, నార్సింగి నుంచి వల్లభాపూర్ వరకు సర్వీస్ రోడ్డు నిర్మాణం, నార్సింగి గ్రామంలో కల్వర్టు నిర్మాణంతో పాటు సర్వీస్ రోడ్డు విస్తరణ చేపట్టాలని కోరారు. కాగా మాసాయిపేట- చెట్లతిమ్మాయిపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఆర్‌యూబీ నిర్మాణం, వడ్డెర వాడ ప్రారంభం నుంచి చెట్లతిమ్మాయిపల్లి లింక్ రోడ్డు వరకు సర్వీస్ రోడ్డు విస్తరణ, చందాయిపేట్ క్రాస్‌రోడ్డు నుంచి హనుమాన్ దేవాలయం వరకు అలాగే, మాసాయిపేట నుంచి గోయెల్ పెట్రోల్ పంప్ వరకు సర్వీస్ రోడ్డు విస్తరణ చేపట్టాలని ప్రభాకర్‌రెడ్డి కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్‌కు అధికారం శాశ్వతంకాదు: వినోద్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్‌కు అధికారం శాశ్వతంకాదనే విషయాన్ని ఆ పార్టీ నాయకులు గుర్తుంచుకోవాలని బీఆర్ ఎస్ సీనియర్ నేత, కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, గువ్వల బాలరాజుతో కలిసి ఆయన సోమవారం ఇక్కడి తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. అధికారపక్షం మారినంత మాత్రాన శిలాఫలకాలు తొలగించడం సబబుకాదని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులను కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిందని, అది ప్రజల ఆస్తి అని అన్నారు. శిలాఫలకాలు ధ్వంసం చేసినవారిపై కేసులు నమోదు చేసి, వాటి స్థానంలో వెంటనే కొత్తవి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మంచి చేస్తే అభినందిస్తామని, చెడు చేస్తే నిలదీస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ గత చరిత్రను, దివంగత ప్రధాని ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఆ పార్టీకి ప్రజలు ఇచ్చిన తీర్పును మర్చిపోవద్దని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని సూచించారు. రేవంత్‌రెడ్డి సీఎం పదవితోపాటు టీపీసీసీ అధ్యక్షుడి బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారని, కాంగ్రెస్ కార్యకర్తలను అదుపులో పెట్టాల్సిన బాధ్యత ఆయనపైనే ఉందని అన్నారు.

..నిధుల విడుదల

▶ మొదటి పేజీ తరువాయి

సంబంధిత విభాగాల పనితీరు, రైతు సంక్షేమ కార్యక్ర మాల అమలుపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఏ ఒక్క రైతుకు ఇబ్బంది కలగకుండా పంట పెట్టుబడిసాయం అందించాలన్నారు. రైతుబంధు నిధులను రైతుల ఖాతాల్లో జమచేసే విధానం గతంలో ఉన్న మాదిరిగానే కొనసాగించాలని ఆయన స్పష్టం చేశారు. 68.99 లక్షల మంది రైతులకు రైతుబంధు సాయం అందనుంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎకరాకు ఏటా పెట్టుబడి సాయం కింద రూ.10వేలు అందజేస్తుండగా, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఎకరాకు ఏటా రూ.15 వేలు అందజేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చింది. గతంలో మాదిరిగానే నిధులు జమ అవుతాయని చెప్పిన నేపథ్యంలో కాంగ్రెస్ హామీ ఈ దఫా అమలయ్యే అవకాశంపై స్పష్టత లేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రెండు లక్షల మేరకు రుణమాఫీ చేసేందుకు తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఉన్నతాధికారులను సీఎం ఆదేశించారు.



సోమవారం సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో మాజీ సీఎం కేసీఆర్‌ను పరామర్శిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినీ నటుడు చిరంజీవి

మళ్లీ ఇందిరమ్మ ఇళ్లు

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్లను నిర్మించేందుకు సిద్ధమవుతున్న ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, తిరిగి గృహనిర్మాణ శాఖను పునరుద్ధరించబోతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదల కోసం లక్షల సంఖ్యలో ఇళ్లను నిర్మించారు. ఆ సమయంలో రాష్ట్ర గృహ నిర్మాణశాఖ దేశవ్యాప్త దృష్టిని ఆకర్షించింది. తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. అవినీతి ఆరోపణలు చేస్తూ సీఐడీతో దర్యాప్తు చేయించింది.చివరకు గృహ నిర్మాణ శాఖే లేకుండా చేసింది. రోడ్లు భవనాల శాఖలో ఓ విభాగంగా మార్చేసింది. అందులోని సిబ్బంది వివిధ శాఖలకు బదిలీ అయ్యారు. కాగా త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి గృహ నిర్మాణాలకు సంబంధించి సమీక్ష నిర్వహించనున్నట్టు సమాచారం అందటంతో, ఆగమేఘాల మీద అధికారులు నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆ శాఖను పునరుద్ధరించే దిశగా ఏర్పాట్లు జరుగుతున్నాయనే చర్చ జరుగుతోంది.

వైఎస్ హయాంలో 14 లక్షల ఇళ్లు

డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో తెలంగాణ పరిధిలో ఏకంగా 14 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మితమయ్యాయి. 2004–2009 మధ్యలో ఈ ఇళ్లు రూపొందగా, ఆ తర్వాత 2014 వరకు కేవలం నాలుగున్నర లక్షలు మాత్రమే నిర్మితమయ్యాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత, ఇందిరమ్మ తరహా ఇళ్ల నిర్మాణాన్ని నిలిపేసి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకాన్ని ప్రారంభించింది. అయితే తొమ్మిదేళ్లలో లక్షన్నర ఇళ్లను కూడా పూర్తి చేయలేకపోయింది. తర్వాత గృహలక్ష్మి పేరుతో ఇందిరమ్మ తరహా ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినా, దరఖాస్తులు స్వీకరించే సమయానికి ఎన్నికలు రావటంతో అది కాస్తా ఆగిపోయింది. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మళ్లీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభం కానుంది. గృహలక్ష్మి పథకంలో లబ్ధిదారులకు రూ.3 లక్షలు చొప్పున ఇచ్చేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాట్లు చేయగా, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటి యూనిట్ కాస్ట్‌ను రూ.5 లక్షలుగా ఖరారు చేసింది.



కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాహాలు

- గృహ నిర్మాణ శాఖను పునరుద్ధరించే అవకాశం!
- త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ సమీక్ష
- నివేదికలు సిద్ధం చేస్తున్న అధికారులు

అదనంగా సిబ్బంది కావాల్సిందేనా..?

గృహనిర్మాణ శాఖలో 1983–87 మధ్య సిబ్బంది నియామకం జరిగింది. ఆ తర్వాత కొన్ని బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ మాత్రమే జరిగింది. కాలక్రమంలో చాలామంది పదవీ విరమణ చేశారు. అయితే రిటైర్మెంట్ వయసు పెంపు కారణంగా మొత్తం మీద 500 మంది వరకు ఉండగా, శాఖను రద్దు చేయటంతో 450 మంది వివిధ శాఖలకు బదిలీ అయ్యారు. దీంతో కేవలం 50 మంది మాత్రమే ఉన్నారు. ఇందిరమ్మ ఇళ్లను కొనసాగించాలంటే పాత సిబ్బంది తిరిగి రావటమే కాకుండా, అదనపు సిబ్బంది కావాల్సి ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో రిటైర్డ్ అధికారుల సేవలను వినియోగించుకుంటే మంచిదన్న సూచనలు అందుతున్నాయి.

ఆ దరఖాస్తులేం చేస్తారు?

గత ప్రభుత్వం చివరలో ప్రారంభించిన గృహలక్ష్మి పథకం కోసం 14 లక్షల దరఖాస్తులు అందాయి. వాటిల్లో అర్హమైనవి 11 లక్షల వరకు ఉన్నట్టు గుర్తించారు. ఈలోపు ఎన్నికల నోటిఫికేషన్ రావడం, బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోవడంతో ఇప్పుడా పథకమే లేకుండా పోనుంది. దీంతో ఆ దరఖాస్తులను ఏం చేస్తారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

28న మరికొన్ని గ్యారంటీలు

రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెల్లడి

- ఢిల్లీలో కేంద్రమంత్రి గడ్కరీతో భేటీ
- స్పీకర్‌ను కలిసి ఎంపీ పదవికి రాజీనామా

సాక్షి, న్యూఢిల్లీ/నల్లగొండ: అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రెండు గ్యారంటీలను అమలు చేశామని, కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం డిసెంబర్ 28న మరికొన్ని గ్యారంటీలను ప్రారంభిస్తామని తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. వంద రోజుల్లో అన్ని గ్యారంటీలను అమలులోకి తెస్తామన్నారు. ఐదేళ్లలో రాష్ట్రంలో ప్రజాపాలన, ఇందిరమ్మ పాలన తీసుకురావడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. సోమవారం ఢిల్లీలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. భేటీలో ఆ శాఖ ఈఎన్‌సీ గణపతిరెడ్డి, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు. అనంతరం కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్-విజయవాడ రహదారిని ఆరులేన్లుగా విస్తరించేందుకు చర్యలు చేపట్టాలని, తెలంగాణలోని 14 రహదారులను స్టేట్ హైవేలుగా మార్చాలని కేంద్రమంత్రిని కోరానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున చేసిన విజ్ఞప్తులకు గడ్కరీ సానుకూలంగా స్పందించారని వివరించారు. కేంద్రంతో తరచూ సంప్రదిస్తూ రాష్ట్రానికి వీలైనన్ని ఎక్కువ నిధులు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తానని కోమటిరెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం రోడ్ల గుంతలను మట్టితో పూడ్చిందని, తమ ప్రభుత్వంలో అలా జరగకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఎవరిపైనా తాము కక్ష సాధింపులకు దిగబోమని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది ఢిల్లీలో కొత్త తెలంగాణ భవన్ నిర్మిస్తామన్నారు. ఈ విషయంపై మంగళవారం అధికారులతో సమీక్ష జరుపుతానని కోమటిరెడ్డి తెలిపారు. కాగా, మంత్రి కోమటిరెడ్డి తన ఎంపీ పదవికి రాజీనామా చేశారు. సోమవారం సాయంత్రం లోక్‌సభ స్పీకర్ ఓంప్రకాశ్ బిర్లాను కలిసి రాజీనామాపత్రాన్ని అందజేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నల్లగొండ నియోజకవర్గం నుంచి ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రిగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భువనగిరి ఎంపీ స్థానానికి ఆయన రాజీనామా చేశారు.



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

షాద్‌నగర్‌లో నకిలీ 'గ్యారంటీ కార్డులు'

- ఒక్కొక్కటి రూ.250 చొప్పున విక్రయం
- పోలీసులకు కాంగ్రెస్ నేతల ఫిర్యాదు



షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీలకు సంబంధించిన.. నకిలీ కార్డులు షాద్‌నగర్‌లో వెలుగుచూశాయి. వీటిని ముద్రించిన కొంతమంది దళారులు అమాయకులకు విక్రయిస్తున్నారు. ఆ కార్డులపై రూ.500కే సిలిండర్, మహిళలకు రూ.2,500, చేయూత పథకం కింద నెలకు రూ.4 వేల పెన్షన్, రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా పథకాలను ముద్రించారు. హస్తం గుర్తు, సోనియాగాంధీ, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఫొటోలతో పాటు క్యూఆర్ కోడ్, లబ్ధిదారుల పేరుతో కార్డులు ప్రింట్ చేయించారు. ఇది ఉన్న వారికే పథకాలు వర్తిస్తాయని నమ్మిస్తున్నారు. ఒక్కో కార్డుకు రూ.250 చొప్పున వసూలు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పార్టీ నేత రఘు మాట్లాడుతూ.. గుర్తు తెలియని వ్యక్తులు నకిలీ కార్డులను ముద్రించి మార్కెట్లో విక్రయిస్తున్నారని, ఎవరూ వీటిని తీసుకోవద్దని సూచించారు. కొత్త ప్రభుత్వాన్ని అభాసుపాలు చేసేందుకే ఇలాంటి కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం అందజేసే కార్డులను మీసేవ కేంద్రాల ద్వారా ఇస్తారన్నారు.

డ్రగ్స్ అంటేనే వణుకు పుట్టాలి

మాదక ద్రవ్యాల రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపాలి

- డ్రగ్స్ ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలి: సీఎం రేవంత్‌రెడ్డి
- సినీతారల డ్రగ్స్ కేసు వివరాలపై ప్రత్యేకంగా ఆరా
- రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరోకు పూర్తిస్థాయి డైరెక్టర్‌ను నియమిస్తామని వెల్లడి



సమీక్షలో పాల్గొన్న సీఎం రేవంత్, డీజీపీ రవిగుప్తా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో డ్రగ్స్ నియంత్రణ అంశంపై కొత్త ప్రభుత్వం ఫోకస్ చేసింది. రాష్ట్రంలో మాదక ద్రవ్యాలను ఉపయోగించాలంటే భయపడే పరిస్థితి రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. డ్రగ్స్ రవాణా, వినియోగాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలని.. రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాల నియంత్రణ అంశంపై సోమవారం సచివాలయంలో రేవంత్ సమీక్షించారు. ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవి గుప్తా, ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ శివధర్‌రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సీవీ ఆనంద్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మాదక ద్రవ్యాలను వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

గ్రేహౌండ్స్ మాదిరిగా నార్కోటిక్స్ బ్యూరో..

రాష్ట్రంలో ప్రస్తుతమున్న యాంటీ నార్కోటిక్స్ బ్యూరోకు పూర్తిస్థాయి డైరెక్టర్‌ను నియమించాలని.. ఆ విభాగాన్ని బలోపేతం చేయాలని రేవంత్ ఆదేశించారు. ఈ విభాగానికి కావాల్సిన నిధులు, వనరులు, ఇతర సౌకర్యాలను సమకూర్చాలని సూచించారు. డ్రగ్స్ విక్రయాలు, వినియోగాన్ని నిరోధించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న గ్రేహౌండ్స్, ఆక్టోపస్‌ల మాదిరిగా టీఎస్ నాబ్‌ను తీర్చిదిద్దాలని సూచించారు.

ఎట్టి పరిస్థితుల్లోనూ తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎక్సైజ్, ప్రొహిబిషన్, ఔషధ నియంత్రణ మండలి, పోలీస్ శాఖలకు చెందిన వివిధ విభాగాల ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

సినీతారల డ్రగ్స్ కేసు ఏమైంది?

గతంలో సంచలనం సృష్టించిన సినీ తారల డ్రగ్స్ కేసుపై సీఎం రేవంత్ ప్రత్యేకంగా ఆరా తీసినట్టు తెలిసింది. ఆ కేసు గురించిన కీలక అంశాలను అధికారుల నుంచి వివరంగా తెలుసుకున్నట్టు సమాచారం. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ పలుమార్లు సినీ తారల డ్రగ్స్ కేసు అంశాన్ని ప్రస్తావిస్తూ.. బీఆర్‌ఎస్ సర్కారుపై విమర్శలు గుప్పించారు. ఈ వ్యవహారంపై స్వయంగా కోర్టును సైతం ఆశ్రయించారు. ఈ క్రమంలో సోమవారం జరిగిన నార్కోటిక్స్ సమీక్షలో సీఎం హోదాలో డ్రగ్స్ కేసు వివరాలను ఆయన తెలుసుకున్నారు. సినీతారల కేసులో ఏం జరిగింది? ఇప్పుడా కేసు స్టేటస్ ఏమిటి? దర్యాప్తు ఎలా జరిగింది? నిందితుల నుంచి సేకరించిన ఎలక్ట్రానిక్ డివైజ్‌లను, ఇతర కీలక వస్తువులను ఫోరెన్సిక్ పరిశీలనకు ఎందుకు పంపలేదంటూ ప్రశ్నలు గుప్పించినట్టు సమాచారం. ఈ కేసులో ప్రతి ఒక్కరి విచారణ సందర్భంగా చేసిన వీడియో రికార్డింగ్‌లు, వారి కాల్‌డేటా, ఎలక్ట్రానిక్ డివైజ్‌లు, ఇతర ఆధారాలను కోర్టుకు సమర్పించామని.. చార్జిషీట్ కూడా నమోదు చేశామని అధికారులు వివరించినట్టు తెలిసింది.

కేసీఆర్‌ను పరామర్శించిన బాబు, భట్టి, చిరంజీవి

కేసీఆర్ త్వరగా కోలుకోవాలని గవర్నర్ తమిళిసై ఆకాంక్ష

సాక్షి, హైదరాబాద్: నగరంలోని యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను పలువురు ప్రముఖులు కలిసి పరామర్శించారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలువురు ఆస్పత్రికి వచ్చి కేసీఆర్‌ను, ఆయన కుటుంబసభ్యులను కలిసి వెళ్లారు. ఏపీ మాజీ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు హాస్పిటల్‌కు వచ్చి చికిత్స పొందుతున్న కేసీఆర్‌ను కలిసి సర్జరీ గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ఆయన మాజీ మంత్రి కేటీఆర్, ఇతర కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్‌తో మాట్లాడాలనిపించి వచ్చినట్లు చెప్పారు. కోలుకోవడానికి ఆరువారాల సమయం పడుతుందని వైద్యులు చెప్పారని బాబు తెలిపారు. కేసీఆర్‌ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పరామర్శించారు. చికిత్స పొందుతున్న కేసీఆర్‌ను కలిసి మాట్లాడిన భట్టి వైద్యులను అడిగి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. సర్జరీ విజయవంతమైందని వైద్యులు చెప్పినట్లు భట్టి వెల్లడించారు. ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు కేసీఆర్‌ను పరామర్శించిన వారిలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కేసీఆర్‌ను పరామర్శించిన చిరంజీవి

కేసీఆర్‌ను సినీనటుడు చిరంజీవి పరామర్శించారు. ఆయనను మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత స్వయంగా కేసీఆర్ దగ్గరికి తీసుకెళ్లారు. కేసీఆర్‌తో కరచాలనం చేసిన చిరంజీవి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సినీనటుడు ప్రకాశ్‌రాజ్ ఆస్పత్రికి వెళ్లి కేసీఆర్‌ను కలిశారు. అనంతరం కేటీఆర్‌ను కలిసి కేసీఆర్ ఆరోగ్యపరిస్థితి గురించి ఆరాతీశారు.

కేటీఆర్‌కు ఫోన్ చేసిన గవర్నర్ తమిళిసై

కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మాజీ మంత్రి కేటీ రామారావుకు ఫోన్ చేసి ఆరా తీశారు. కేసీఆర్‌కు జరిగిన ప్రమాదం, శస్త్ర చికిత్స అనంతరం కోలుకుంటున్న తీరు గురించి కేటీఆర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని గవర్నర్ ఆకాంక్షించారు. ఈ నెల 9న ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారోత్సవానికి రాజ్‌భవన్‌లో హాజరైన మాజీ మంత్రి టి. హరీశ్‌రావును కూడా కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని ఆమె అడిగి తెలుసుకున్నారు.

పరామర్శల వెల్లువ

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ మంత్రి తలసాని, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు, ఎంపీలు రంజిత్‌రెడ్డి, మాలోత్ కవిత, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, మల్లారెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు, బీఆర్‌ఎస్ నేత చల్మెడ లక్ష్మీనరసింహారావు తదితరులు కూడా కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకొని కుటుంబసభ్యులను పరామర్శించారు. సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీమంత్రి కె.జానారెడ్డి యశోద ఆస్పత్రికి వెళ్లినప్పటికీ, కేసీఆర్ నిద్రలో ఉండటంతో కుటుంబసభ్యులను మాత్రమే కలిసివచ్చారు.

14న శాసనసభ స్పీకర్ ఎన్నిక

13న నామినేషన్ల స్వీకరణ • అసెంబ్లీ సెక్రటేరియట్ నోటిఫికేషన్ విడుదల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ స్పీకర్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 14న ఉదయం 10.30 గంటలకు సభాపతి ఎన్నికను నిర్వహించనున్నారు. స్పీకర్ పదవికి పోటీ పడే వారి నుంచి ఈ నెల 13న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ మేరకు అసెంబ్లీ సెక్రటేరియట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. కొత్త శాసనసభ శనివారం కొలువుదీరిన విషయం తెలిసిందే. నూతన సభ్యులతో ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ ప్రమాణ స్వీకారం చేయించారు. కాగా, స్పీకర్‌గా వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ పేరును ఇప్పటికే అధికార కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అయితే స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవం కావాలంటే ఒక్కరే నామినేషన్ వేయాల్సి ఉంటుంది.

ప్రసాద్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశం ఉంది. ఇతర సభ్యులు ఎవరైనా పోటీలో ఉంటే బ్యాలెట్ ద్వారా స్పీకర్‌ను ఎన్నుకోవాల్సి ఉంటుంది. స్పీకర్ ఎన్నిక ప్రొటెం స్పీకర్ ఆధ్వర్యంలో జరగనుంది.

పని వేళల తర్వాత ఎవ్వరూ రావొద్దు

ప్రభుత్వ ఆఫీసుల భద్రతపై పోలీస్ ఫోకస్

- కొన్ని శాఖల్లో ఫైళ్ల తరలింపు అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న ఉన్నతాధికారులు
- రాత్రి వేళల్లో గస్తీ పెంచాలని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: గత వారం రోజులుగా నగరంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైల్స్ చోరీ, అనధికారికంగా ఫైళ్ల తరలింపు యత్నాలు జరుగుతున్నట్టు వార్తలు వస్తుండడంతో పోలీస్ ఉన్నతాధికారులు ఫోకస్ పెంచారు. ఇకపై ఇలాంటివి పునరావృతం కాకుండా అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద భద్రత కట్టుదిట్టం చేస్తున్నారు. ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండే ప్రభుత్వ కార్యాలయాల వద్ద పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. పనివేళలు ముగిసిన తర్వాత అనుమతి లేనిదే ఎవ్వరినీ ప్రభుత్వ కార్యాలయాల్లోకి అనుమతించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ల సిబ్బందిని అప్రమత్తం చేసినట్టు ఓ ఉన్నతాధికారి తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఉన్న ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందిని సైతం అప్రమత్తం చేయాలని సూచించారు.

వరుస ఘటనలతో అలర్ట్

ఇటీవల విజయనగర్ కాలనీలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఆ శాఖలో గతంలో ఓఎస్డీగా పనిచేసిన ఓ అధికారి అనధికారికంగా కార్యాలయంలోకి వచ్చి ఫైళ్లను చించివేయడం, హిమాయత్‌నగర్‌లోని పర్యాటకశాఖ కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగి పలు ఫైళ్లు అనుమానాస్పదంగా దగ్ధం కావడం, తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ కార్యాలయంలో కొందరు వ్యక్తులు ఆటోలో ఫైళ్లు తరలించే ప్రయత్నం చేయడంతో సెక్యూరిటీ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద భద్రత విధుల్లో ఉండే సెక్యూరిటీగార్డుల వద్ద స్థానిక పోలీస్‌స్టేషన్ నంబరుతోపాటు అత్యవసర సమయాల్లో సమాచారం అందించాల్సిన పోలీస్ సిబ్బంది ఫోన్‌నంబర్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

రెగ్యులర్ స్పీకర్ వచ్చాకే ఎమ్మెల్యేల ప్రమాణం

రాష్ట్రంలో 100 శాతం ఓటింగ్ పెరిగిన పార్టీ మాదే: కిషన్‌రెడ్డి

- రూ. 351 కోట్లు దొరకడంపై రాహుల్ మాట్లాడటం లేదని విమర్శ



సాక్షి, న్యూఢిల్లీ: శాసనసభకు రెగ్యులర్ స్పీకర్ వచ్చాకే తమ పార్టీ ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేస్తారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. శాసనసభ నియమ, నిబంధనలకు విరుద్ధంగా ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్‌కు ప్రొటెం స్పీకర్‌గా అవకాశం ఇవ్వడం వల్లే బీజేపీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బహిష్కరించిందని వెల్లడించారు. తెలంగాణలో 100 శాతం ఓటింగ్ పెరిగిన ఏకైక పార్టీ బీజేపీయే అని, అన్నింటికీ మించి.. ఔట్ గోయింగ్, ఇన్‌కమింగ్ సీఎం అభ్యర్థులను ఓడించి బీజేపీ చరిత్ర సృష్టించిందన్నారు. సోమవారం ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించారు. కశ్మీరీ యువత చేతుల్లో కంప్యూటర్లు పెట్టి వారిలో మార్పు తీసుకురావాలన్న మోదీ సంకల్పాన్ని సుప్రీంకోర్టు సమర్థించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నామన్నారు. జార్ఖండ్ కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహూ దగ్గర రూ.351 కోట్లు అక్రమ సంపాదన దొరికితే అగ్రనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. రాహుల్ కనుసైగల్లో.. వచ్చే పార్లమెంటు ఎన్నికలకోసం ఈ డబ్బు పోగుచేస్తున్న విషయం వాస్తవం కాదా? అని నిలదీశారు. సోషల్ మీడియాలో తాను పవన్ కల్యాణ్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసినట్లు జరుగుతున్న దుష్ప్రచారాన్ని కిషన్‌రెడ్డి ఖండించారు. ఈ సందర్భంగా.. అయ్యప్ప భక్తులకు శబరిమలలో మౌలిక వసతులు కల్పించడం, తొక్కిసలాటలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కేరళ సీఎంను కిషన్‌రెడ్డి కోరారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై
త్వరలోనే శ్వేతపత్రం

- బీఆర్ఎస్ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి
- ప్రజా దర్బార్లు రాష్ట్రమంతటా నిర్వహిస్తాం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

మధిర: బీఆర్ఎస్ పాలనలో వనరులు దుర్వినియోగం కావడమే కాకుండా పాలన అస్తవ్యస్తమై సంపద దోపిడీకి గురైందని, సంస్థలు, వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని డిప్యూటీ సీఎం, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మధిరలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై త్వరలోనే శ్వేతపత్రం విడుదల చేస్తామని చెప్పారు. 2014 ముందు రాష్ట్రంలో ఉన్న ఆర్థిక పరిస్థితులు, ప్రస్తుత పరిస్థితులపై శ్వేతపత్రం సిద్ధం చేసి సరైన సమయంలో, సరైన వేదికపై విడుదల చేస్తామని తెలిపారు. వ్యవస్థీకృతమైన సమాజాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసి 70ఏళ్ల వెనుక ఉన్న ఆర్థిక అసమానతలు కలిగిన ఫ్యూడల్ సమాజాన్ని నిర్మించిందని విమర్శించారు. రాష్ట్ర చీఫ్ సెక్రటరీ, డీజీపీ మొదలుకుని గ్రామస్థాయి అధికారి వరకు ప్రతీ వ్యవస్థ, ప్రతీ కార్యాలయం ప్రజల కోసమే ఉందనే నమ్మకాన్ని ప్రజలకు కల్పించడమే ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ముందున్న కర్తవ్యమని తెలిపారు. ప్రజా దర్బార్లు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతాయని, ప్రజలు అందజేసే వినతులపై సమాధానం ఇచ్చేందుకు ప్రత్యేకంగా అధికారులను నియమిస్తామని భట్టి తెలిపారు.

నన్ను చంపేందుకు కుట్ర: ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్: ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తనను చంపేందుకు కుట్ర పన్నుతున్నారని ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో అక్రమ క్వారీ తవ్వకాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, దీనిపై సీబీఐ ఎంక్వైరీ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్మూర్ నియోజకవర్గంలో సహజ సిద్ధమైన వనరులు కాపాడేందుకు తాను కృషిచేస్తానన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా క్వారీ నిర్వహిస్తున్న యజమానులు ప్రభుత్వానికి పన్నులు చెల్లించాలని రాకేశ్‌రెడ్డి అన్నారు. తనకు ఎవరితోనూ వ్యక్తిగత విభేదాలు లేవని పేర్కొన్నారు.

కాళేశ్వరంపై విచారణకు ఆదేశిస్తాం

- నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి
- బ్యారేజీలు డిజైన్‌చేసిన, నిర్మించిన వారిని బాధ్యులుగా చేస్తాం
- 14న శాఖ బాధ్యతలు చేపడతా


ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి ఉత్తమ్. చిత్రంలో ఈఎన్‌సీ మురళీధర్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్లు, నిర్మాణంలో లోపాలపై రాష్ట్ర మంత్రివర్గం ఆదేశాల మేరకు విచారణకు ఆదేశిస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ కుంగడంతో పాటు అన్నారం బ్యారేజీలో బుంగలు ఏర్పడిన నేపథ్యంలో.. వాటిని డిజైన్ చేసిన, నిర్మించిన వారిని బాధ్యులుగా చేసి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలపై సవివరంగా లిఖితపూర్వక వివరణ సమర్పించాల్సిందిగా నీటిపారుదల శాఖను ఆదేశించినట్టు తెలిపారు. రాష్ట్ర నీటిపారుదల మంత్రిగా నియమితులైన తర్వాత తొలిసారిగా సోమవారం జలసౌధకు వచ్చిన మంత్రి.. శాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టులతో పాటు గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టుల పురోగతిపై ఈఎన్‌సీ సి.మురళీధర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరణ ఇచ్చారు. సమీక్ష అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు.

ప్రతి ప్రాజెక్టుపై సమగ్ర నివేదికకు ఆదేశం

నీటిపారుదల శాఖలో భారీ అవినీతి జరిగిందని, ప్రాజెక్టుల నిర్మాణంలో గోప్యత పాటిస్తున్నారని, రహస్య జీవోలు ఇచ్చారంటూ అనేక ఆరోపణలున్నాయని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఇకపై శాఖ పనితీరు పారదర్శకంగా ఉండాలని, సమర్థతను పెంచుకోవాలని అధికారులకు స్పష్టం చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణ వ్యయం, ప్రతిపాదిత ఆయకట్టు వంటి అంశాలపై సరైన అధ్యయనాలు లేకుండానే సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారని విమర్శించారు. కాళేశ్వరం ఎత్తిపోతలకు రూ.లక్ష కోట్లను ఖర్చు చేసినా, ఆయకట్టుకు నామమాత్రంగానే సాగునీరు లభిస్తోందన్నారు. ప్రాజెక్టు కింద ప్రతిపాదించిన 32 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలపై నివేదిక సమర్పించాల్సిందిగా ఆదేశించినట్లు తెలిపారు. ప్రతి ప్రాజెక్టు కింద స్థిరీకరించిన కొత్త ఆయకట్టు, ప్రాజెక్టుల నిర్వహణకు కానున్న విద్యుత్ చార్జీల వ్యయం ఇతర అంశాలపై సమగ్ర నివేదిక కోరామన్నారు.

ప్రాణహిత–చేవెళ్ల చేపడతాం

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన పెండింగ్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం పక్కన పెట్టిన ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును మళ్లీ చేపడతామని చెప్పారు. ప్రాణహితపై తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మించాలనే అంశంపై రాష్ట్ర మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు అవకాశం ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను సత్వరంగా పూర్తి చేస్తామని చెప్పారు. సీఎంతో పాటు, మంత్రివర్గంలో చర్చించి ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల బిల్లులు విడుదల చేస్తామన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కోసం ప్రయత్నిస్తామని చెప్పారు. మంత్రిగా ఈ నెల 14న బాధ్యతలు స్వీకరిస్తానని ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. సమీక్షలో ఈఎన్‌సీలు బి.నాగేందర్ రావు, హరిరామ్, అనిల్ కుమార్, సీఈలు హమీద్‌ఖాన్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్ గైర్హాజరు

జలసౌధలో జరిగిన సమీక్షకు ఆ శాఖ ఇన్‌చార్జి కార్యదర్శి స్మితా సబర్వాల్ గైర్హాజరు కావడం చర్చనీయాంశమైంది. మధ్యాహ్నం 3 గంటలకు మంత్రి జలసౌధకు వస్తున్నారనే విషయాన్ని ఆమెకు తెలియజేసినట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. బీఆర్ఎస్ ప్రభుత్వంలో స్మిత కీలకంగా వ్యవహరించిన విషయం తెలిసిందే.

ఉద్యోగాలు.. ఇళ్లు.. భూ వివాదాలు

ప్రజా దర్బార్‌లో ప్రధానంగా ఇవే సమస్యలు

- విజ్ఞాపన పత్రాలతో తరలివచ్చిన ప్రజలు
- జెన్‌కో ఏఈ పరీక్ష వాయిదా కోరిన అభ్యర్థులు
- అర్హులందరికీ న్యాయం చేస్తాం: మంత్రి శ్రీధర్‌బాబు


మంత్రి శ్రీధర్‌బాబుకు సమస్య చెబుతున్న వృద్ధురాలు

సాక్షి, హైదరాబాద్: ప్రజాదర్బార్ (ప్రజావాణి)లో ప్రధానంగా చాలామంది తమకు ఉద్యోగాలు ఇవ్వాలని, భూ సమస్యలు పరిష్కరించాలని, ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నారు. సోమవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు విజ్ఞాపన పత్రాలతో ప్రజలు భారీగా తరలివచ్చారు. ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, ప్రభుత్వం అందరికీ న్యాయం చేస్తుందని భరోసానిచ్చారు. దరఖాస్తుదారులు తమ విజ్ఞాపన పత్రంలో సమస్యతోపాటు అడ్రస్, ఫోన్ నంబర్‌ను రాయాలని సూచించారు. తద్వారా దరఖాస్తుదారుల సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు వీలవుతుందన్నారు.

జెన్‌కో పరీక్ష వాయిదాపై సీఎంతో మాట్లాడతా: మంత్రి శ్రీధర్‌బాబు

ఈ నెల 17న నిర్వహించనున్న జెన్‌కో ఏఈ పరీక్షను వాయిదా వేయాలని అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. అదే రోజు రెండు, మూడు పరీక్షలు ఉన్నట్లు అభ్యర్థులు వివరించారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లనున్నట్లు మంత్రి తెలిపారు. సంబంధిత అధికారులతో చర్చించి పరీక్ష వాయిదాపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. తమకు ఇచ్చే గౌరవ వేతనాన్ని ప్రతి నెలా రెగ్యులర్ గా ఇవ్వాలని మధ్యాహ్న భోజన వంట కార్మికులు విజ్ఞాపన పత్రం అందజేశారు. జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, ఆయుష్ విభాగం డైరెక్టర్ హరిచందన, సీనియర్ ఐఏఎస్ అధికారి ముషారఫ్ అలీ, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రి పాల్గొన్నారు.

ఇప్పటివరకు 4,471 వినతులు

సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 8వ తేదీన మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ప్రారంభించిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన లభిస్తోంది. ప్రజలు వివిధ రకాల సమస్యలపై వినతి పత్రాలను సమర్పించేందుకు ప్రజా భవన్ కు పెద్ద ఎత్తున చేరుకుంటున్నారు. ఈ కార్యక్రమం ప్రారంభించిన నాటి నుంచి సోమవారం వరకు మొత్తం 4,471 వినతి పత్రాలు అందాయి. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, పింఛన్లకు సంబంధించిన వినతి పత్రాలే ఎక్కువగా ఉన్నాయి. సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో 1,143 వినతి పత్రాలు అందినట్లు ప్రజా భవన్ అధికార వర్గాలు తెలిపాయి.

మేడారం జాతరకు జాతీయ హోదా కోసం కృషి

- ఫిబ్రవరిలో జరిగే సమ్మక్క–సారక్క జాతరకు పక్కాగా ఏర్పాట్లు
- వచ్చే వారం ఏటూరునాగారంలో సమావేశం
- గిరిజన సంక్షేమ శాఖ అధికారుల సమీక్షలో మంత్రి సీతక్క


సమీక్షలో మంత్రి సీతక్క తదితరులు

సాక్షి, హైదరాబాద్: మేడారం సమ్మక్క–సారక్క జాతరకు జాతీయ పండుగ హోదా దక్కేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చెప్పారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి మరోసారి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆమె ఆదేశించారు. జాతీయ పండుగ హోదాతో రాష్ట్ర ప్రభుత్వమిచ్చే నిధులకు కేంద్ర నిధులు తోడైతే జాతరను మరింత ఘనంగా నిర్వహించుకునే అవకాశం ఉంటుందన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించే జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమ్మక్క–సారక్క జాతర ఏర్పాట్లపై సోమవారం డీఎస్ఎస్ భవన్‌లో గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. కోయ గిరిజన ఇలవేల్పుల సమ్మేళనం ఈసారి జాతర సమయంలో జరిగేటట్లు చూడాలని, తద్వారా భక్తులకు గిరిజన సాంస్కృతిక వైభవం గురించి బాగా తెలుస్తుందని మంత్రి సూచించారు. జాతర ఏర్పాట్లపై వచ్చే వారం ఏటూరునాగారంలోని ఐటీడీఏలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

పల్లె ప్రజలకు మరింత చేరువ కావాలి

పంచాయతీ రాజ్ శాఖ ద్వారా జరిగే కార్యక్రమాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు నిత్యం ఎంతో ఉపయోగ పడేవనీ, వాటిని మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరువయ్యేలాగా అధికారులు పనిచేయాలని ఆశాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సూచించారు. సోమవారం రాజేంద్రనగర్ టి.ఎస్.ఐ.ఆర్.డి.లో శాఖ ఉన్నతాధికారులతో సమావేశమైన మంత్రి శాఖ పనితీరును సమీక్షించారు. పీఆర్ ఆర్‌డీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, స్పెషల్ కమిషనర్ ప్రదీప్ కుమార్ శెట్టి, ఇంజనీర్ ఇన్ చీఫ్ సంజీవ రావు, స్త్రీనిధి ఎండీ విద్యాసాగర్ రెడ్డి ఆయా విభాగాల వారీగా చేపడతున్న కార్యక్రమాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

కొత్త సర్కార్‌కు సహకరించాలని రేవంత్ కోరారు

- ప్రజాభిమానం చూరగొనేలా పనిచేయాలని చెప్పా
- సీఎం తనను కలవడంపై మాజీమంత్రి జానారెడ్డి



సాక్షి, హైదరాబాద్: కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వానికి తనవంతు సహకారం అందిస్తానని మాజీమంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత కుందూరు జానారెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ సోమవారం జానారెడ్డి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సుమారు గంటసేపు వివిధ అంశాలపై చర్చించుకున్నారు. అనంతరం జానారెడ్డి మీడియాతో మాట్లాడుతూ నూతన ప్రభుత్వానికి అందరూ సహకరించాలని కోరారు. ఎన్నికల హామీలను నెరవేర్చాలని, ప్రజాభిమానం చూరగొనేలా పనిచేయాలని సీఎం రేవంత్‌కు చెప్పానన్నారు. ప్రభుత్వంలో తన పాత్ర ఏమీ ఉండదని, సలహాలు, సూచనలు కావాలంటే ఇస్తానని స్పష్టం చేశారు. తన కుమారుడు, ఎమ్మెల్యే జయవీర్ కు పదవి ఇవ్వాలని అడగలేదని, ప్రస్తుతం అతడు జూనియర్ అని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఆస్పత్రిలో ఉండటం బాధాకరమని, కలిసేందుకు వెళ్లినా ఆయన నిద్రలో ఉండటంతో సాధ్యంకాలేదని తెలిపారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని, ఆయన సలహాలు, సూచనలు ప్రభుత్వానికి ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆదేశిస్తే వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసే విషయం ఆలోచిస్తానని జానారెడ్డి తెలిపారు.

సీఎం రేవంత్‌కు పీసీసీఎఫ్, ఇతర అధికారుల శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్) ఆర్.ఎం.డోబ్రియాల్ నేతృత్వంలో అటవీశాఖ సీనియర్ అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో సీఎంను కలిసిన వారిలో వివిధ విభాగాల పీసీసీఎఫ్‌లు ఎలూసింగ్ మేరు, సువర్ణ, ఎం.సీ. పర్గెయిన్‌లతో పాటు ఇతర అధికారులు సునీతా భగవత్, షఫీయుల్లా, ప్రియాంకవర్గీస్, సోనిబాలదేవి, రామలింగం, రాంబాబు, హైదరాబాద్ చీఫ్ కన్జర్వేటర్ సైదులు, డీఎఫ్ఓ ఎం.జోజి తదితరులున్నారు. అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈనెల 14 లేదా 15న సచివాలయంలోని తన చాంబర్‌లో అటవీశాఖ మంత్రిగా సురేఖ బాధ్యతలు తీసుకునే అవకాశాలున్నాయని ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి.

సీతక్కకు పీఆర్ సర్వీసెస్ అసోసియేషన్ శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రిగా ప్రమాణం స్వీకారం చేసిన ధనసరి అనసూయ సీతక్కకు పంచాయతీరాజ్ సర్వీసెస్ అసోసియేషన్ పరిధిలోని వివిధ సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. పీఆర్ సర్వీసెస్ అసోసియేషన్‌లో భాగంగా ఉన్న సీఈవోల సంఘం మొదలు పంచాయతీ కార్యదర్శుల సంఘాల దాకా అన్ని విభాగాల వారు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ ఎమ్మెస్–3లో సీతక్కను కలిసిన వారిలో సీఈవో/డిప్యూటీ సీఈవోలు, డీపీవో/డీఎల్‌పీవోలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులున్నారు.

‘కోవిడ్’ కొనుగోళ్లపై నివేదిక ఇవ్వండి

అధికారులతో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష



సాక్షి, హైదరాబాద్: కరోనా సమయంలో వైద్య,ఆరోగ్యశాఖలో నిధులు గోల్‌మాల్ అయినట్టు ఆరోపణలు రావడంతో ఆ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దీనిపై ఆరా తీశారు. తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీఎస్ఎంఎస్ఐడీసీ) అధికారులతో సోమవారం సమీక్ష చేశారు. కరోనా కాలంలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టారు? వేటికి ఎంతెంత ఖర్చు చేశారు? తదితర వివరాలతో సమగ్రమైన నివేదిక కావాలని మంత్రి కోరినట్టు తెలిసింది. కొత్త పడకలు, ఔషధాలు, వైద్య పరికరాల కొనుగోలుపై వివరాలన్నీ ఇవ్వాలని ఆయన ఆదేశించారు. అంతేకాదు రెమిడెసివీర్ వంటి అధిక ధర కలిగిన మందులు పక్కదారి పట్టినట్టు కూడా అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. దీనిపైనా ఆయన చర్చించారు. మరోవైపు నిమ్స్ ఆస్పత్రిపైనా మంత్రి ప్రత్యేకంగా సమీక్ష చేశారు. నిమ్స్ అదనపు బ్లాక్ నిర్మాణ పనులు, రోగులకు అందుతున్న వైద్య సేవలపైనా చర్చించారు. రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖలో గత పదేళ్లలో ఎంతెంత నిధులు ఖర్చు చేశారు? అన్నదానిపైన సమగ్ర వివరాలు ఇవ్వాలని, ప్రభుత్వం విడుదల చేసే శ్వేతపత్రంలో ఈ వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు.

సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న అధికారులపై వేటు?

వైద్య, ఆరోగ్యశాఖలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న అనేకమంది విభాగాధిపతులపై వేటు వేయాలని పలు వినతులు వస్తున్నాయి. ఇప్పటికే అనేకమంది ఉద్యోగులు, సంఘాలు కూడా దీనిపై మంత్రికి విన్నవిస్తున్నారు. వైద్య విద్యా సంచాలకులు (డీఎంఈ), టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, ఎంఎన్‌జే ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ జయలత సహా పలువురు విభాగాధిపతులను తప్పించాలని ఇప్పటికే వినతులు వచ్చాయి. కొందరు అధికారులకు అర్హత లేకున్నా ఆయా పోస్టుల్లో కొనసాగుతున్నారన్న ఆరోపణలూ వచ్చాయి. దీనిపై మంత్రి దామోదర రాజనర్సింహ కూడా పలువురితో చర్చించినట్టు తెలిసింది. ఉద్యోగులతో కఠినంగా ఉన్న అధికారులపై వేటు తప్పదన్న చర్చ జరుగుతోంది. సుదీర్ఘకాలాన్ని పరిగణనలోకి తీసుకుంటే, విభాగాధిపతులను అందర్నీ మార్చాల్సి ఉంటుందని, అలా చేస్తే వైద్య, ఆరోగ్యశాఖ కొత్తవారితో నడపడం సాధ్యం కాదని కూడా మంత్రికి కొందరు సలహాలిచ్చినట్టు తెలిసింది. దీంతో తీవ్రమైన విమర్శలు ఎదుర్కొంటున్న అధికారులపై వేటు వేయాల్సిందేనని ఆయన నిర్ణయించుకున్నట్టు తెలిసింది. కాగా, ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు సోమవారం మంత్రిని కలిసి తన సేవల గురించి విన్నవించుకున్నారు. ముఖ్యంగా కరోనా కాలంలో రేయింబవళ్లు పనిచేశానని ఆయన చెప్పినట్టు సమాచారం.

కొత్త రకం పంటలను పరిచయం చేయాలి

- వాణిజ్య పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించండి
- అధికారులకు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా కొత్తరకం పంటలను రైతులకు పరిచయం చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. వాణిజ్య పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించి, ఆ పంటలను పండించేవిధంగా వాళ్లను మానసికంగా సంసిద్ధం చేయాలని సూచించారు. ఈ మేరకు సోమవారం ఆయన వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయశాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత సచివాలయంలోని ఆ శాఖ కార్యదర్శి చాంబర్‌లో అధికారులతో సమావేశమయ్యారు.

సీఎం ముందుచూపునకు ఇదే నిదర్శనం

తుమ్మల మాట్లాడుతూ, 'నా వృత్తి వ్యవసాయం. నేనున్న వృత్తికి సంబంధిన శాఖనే నాకు కేటాయించడం సీఎం ముందు చూపునకు నిదర్శనం. వ్యవసాయానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తించడం వల్లే ఆయన నాకు ఈ శాఖను కేటాయించారు''అని పేర్కొన్నారు. రైతు బాగు పడితే మిగిలిన అన్ని రంగాలు బాగు పడతాయన్నారు. అన్ని రకాల పంటలకు తెలంగాణ నేల అనుకూలంగా ఉంటుందనీ, బహుశా దేశంలోని ఏ రాష్ట్రానికీ ఈ ప్రత్యేకత లేదని చెప్పారు. సీజన్ల వారీగా ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకొని, అందుకు తగ్గట్టుగా రైతులను వ్యవసాయానికి సమాయత్తం చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని అధిక పంట దిగుబడిని సాధించడమే కాకుండా, ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం విశేషంగా కృషి చేయాలని స్పష్టం చేశారు. మామిడి, జామ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి ఆ పంటల సాగుకు సాయపడాలన్నారు. పామాయిల్ పంట సాగును పెంచాలనీ, అందులో అంతర పంటగా పుచ్చకాయలు పండించే విధంగా ప్రోత్సహించాలని మంత్రి తుమ్మల సూచించారు.



చట్టం యొక్క కవచం కింద న్యాయం పేరుతో జరిగే దౌర్జన్యాన్ని మించిన దారుణమైన దౌర్జన్యం మరొకటి లేదు.
– మాంటెస్క్యూ

సాక్షి
మంగళవారం, 12 డిసెంబర్ 2023

సుదీర్ఘ వివాదానికి తెర

జమ్మూ–కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తినిచ్చే రాజ్యాంగంలోని 370వ అధికరణను రద్దు చేస్తూ రాష్ట్రపతి జారీచేసిన నోటిఫికేషన్ రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు అయిదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం సోమవారం వెలువరించిన తీర్పుపై సహజంగానే అటు హర్షామోదాలతోపాటు ఇటు అసంతృప్తి, అసమ్మతి కూడా వ్యక్తమయ్యాయి. సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ చరిత్రాత్మకమైనదిగా అభివర్ణించగా, కశ్మీర్‌కు చెందిన వివిధ పార్టీలు నిరాశ వ్యక్తంచేశాయి. దశాబ్దాలుగా ఈ అధికరణ చుట్టూ సాగుతున్న వివాదానికి తాజా తీర్పు ముగింపు పలికింది. 370వ అధికరణ రద్దు సహా అన్ని విషయాల్లోనూ ధర్మాసనంలోని న్యాయమూర్తులందరూ ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్‌లు కలిసి ఒక తీర్పు వెలువరించగా దానితో ఏకీభవిస్తూనే జస్టిస్ ఎస్‌కే కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నాలు రెండు వేర్వేరు తీర్పులిచ్చారు.

ప్రభుత్వాల విధాన నిర్ణయాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావటం సహజమే. కశ్మీర్ వంటి భావోద్వేగాలతో ముడిపడివుండే అంశంలో వీటి తీవ్రత కాస్త అధికంగానే ఉంటుంది. అందువల్లే సుప్రీంకోర్టు నిర్ణయం ఎలా ఉంటుందన్న ఆసక్తి అందరిలోనూ ఉంది. కశ్మీర్‌లో ఉగ్రవాదం వేళ్లూనడానికీ, భద్రతాబలగాలపై దాడులకూ మూలం 370వ అధికరణలో ఉందన్నది జనసంఘ్‌గా ఉన్నప్పటి నుంచీ బీజేపీ నిశ్చితాభిప్రాయం. దానికితోడు పాకిస్తాన్, చైనా సరిహద్దుల సమీపంలో ఉండటంవల్ల కశ్మీర్ ఘటనలు దేశ పౌరులందరినీ కలవరపరుస్తుంటాయి. అయితే అధికరణ రద్దుపై స్థానికులు ఏమనుకుంటున్నారన్నది స్పష్టంగా తెలియదు. అక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరిగి పదేళ్లవుతోంది. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కశ్మీర్ ప్రాంతంలోని మూడు స్థానాలనూ నేషనల్ కాన్ఫరెన్స్ గెలుచుకోగా, జమ్మూ ప్రాంతంలోని మూడు స్థానాలు బీజేపీకి లభించాయి. 2019 ఆగస్టు 5న రాష్ట్ర పతి నోటిఫికేషన్ జారీకి నాలుగు రోజుల ముందు నుంచీ కశ్మీర్‌కు భద్రతా బలగాల తరలింపు, విద్యా సంస్థలకు సెలవులు, శ్రీనగర్‌లో నిరవధిక కర్ఫ్యూ, అమర్‌నాథ్ యాత్ర నిలుపుదల వంటి నిర్ణయాలు తీసుకున్నారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడే ముందు సైతం కశ్మీర్‌లో ప్రధాన పార్టీల నేతలంతా తమను గృహనిర్బంధం చేశారని ఆరోపించారు. ఇదంతా గమనిస్తే కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి అత్యంత సున్నితమైన సమస్య అని అర్థమవుతుంది.

జమ్మూ–కశ్మీర్ పాలకుడు హరిసింగ్ ఆ ప్రాంతాన్ని 1947లో భారత్‌లో విలీనం చేసినప్పుడిచ్చిన హామీకి అనుగుణంగా 1949లో రాజ్యాంగ నిర్ణాయక సభ 370వ అధికరణాన్ని రాజ్యాంగంలో చేర్చింది. ఆ అధికరణ ప్రకారం విదేశీ వ్యవహారాలు, ఆర్థికం, కమ్యూనికేషన్లు, రక్షణ మినహా ఇతర అంశాలు జమ్మూ–కశ్మీర్ అసెంబ్లీ ఆమోదిస్తే తప్ప ఆ రాష్ట్రంలో అమలు కావు. అయితే ఒకసారంటూ దేశంలో విలీనమయ్యాక ఇక 'అంతర్గత సార్వభౌమత్వం' అనేదే ఉండదని తాజా తీర్పుల్లో సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. 370వ అధికరణ తాత్కాలిక స్వభావంతో కూడుకున్నదని... తాత్కాలిక, మధ్యంతర అధికరణలున్న రాజ్యాంగంలోని 21వ భాగంలో చేర్చటమే ఇందుకు నిదర్శమని జస్టిస్ చంద్రచూడ్ ఆధ్వర్యంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం భాష్యం చెప్పగా... నెమ్మదిగా జమ్మూ–కశ్మీర్‌ను కూడా ఇతర రాష్ట్రాలతో సమానం చేయటమే దాని ఉద్దేశమని విడిగా ఇచ్చిన తీర్పులో జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ అభిప్రాయపడ్డారు. ఈ రెండు అభిప్రాయాలతోనూ విడిగా తీర్పునిచ్చిన మరో న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఏకీభవించారు. ఈ అధికరణ స్వభావం ఏమిటన్న అంశాన్ని 2016లో సుప్రీంకోర్టు పరిశీలించింది. అది తాత్కాలికమైనదన్న వాదనను అప్పట్లో తోసిపుచ్చింది. అందుకు అదే అధికరణలోని సబ్ క్లాజ్ 3ని ఉదాహరించింది. రాష్ట్ర రాజ్యాంగసభ సిఫార్సుతో రాష్ట్రపతి నోటిఫికేషన్ విడుదల చేసినప్పుడే 370 రద్దవుతుందని ఆ క్లాజ్ సారాంశం. 1957 తర్వాత రాజ్యాంగసభ ఉనికిలో లేదు గనుక ఇక దాని రద్దు అసాధ్యమని అప్పట్లో సుప్రీంకోర్టు భావించింది. అయితే రాజ్యాంగసభ రద్దుతో సబ్ క్లాజ్ 3 నిరర్థకమైపోయిందని, ఆ అధికారం రాష్ట్ర అసెంబ్లీకి దఖలు పడిందని తాజా తీర్పుల్లో న్యాయమూర్తులు భావించారు. రాష్ట్ర అసెంబ్లీ రద్దయింది గనుక గవర్నర్ సిఫార్సు సరిపోతుందని వారు అభిప్రాయపడ్డారు. కశ్మీర్‌లో ఎన్నికలు జరిపించాలని పిటిషనర్లు ఎవరూ కోరకపోయినా ఆ విషయాన్ని న్యాయమూర్తులు పరిగణనలోకి తీసు కున్నారు. వచ్చే ఏడాది సెప్టెంబర్ 30లోగా ఆ ప్రక్రియ పూర్తి కావాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించారు. అంటే లోక్‌సభ ఎన్నికలు పూర్తయ్యాకే అక్కడ అసెంబ్లీ ఎన్నికలుంటాయి.

రాజ్యాంగ నిర్ణాయక సభలో కూలంకషంగా చర్చించిన తర్వాతే వివిధ అధికరణలు రాజ్యాంగంలో చేరాయి. ఆ అధికరణలు చేర్చటంలోని అంతర్గత ఉద్దేశాలను అర్థం చేసుకోవటానికి ఆ చర్చలు దోహదపడతాయి. అయితే దేశ కాలమాన పరిస్థితుల్లో వచ్చే మార్పులు న్యాయమూర్తుల దృక్పథాలను నిర్దేశిస్తాయి. ఆ అధికరణలకు కొత్త చేర్పులు తీసుకొస్తాయి. వాటి పరిధి విశాలమవుతుంది. లేదా వాటి రద్దు సబబే అనిపించవచ్చు. ఏదేమైనా కేంద్రం ఈ నిర్ణయానికి ముందు అక్కడి ప్రజానీకాన్ని, మాజీ సీఎంలు ఫరూక్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ తదితరులను కూడా సంప్రదిస్తే బాగుండేది. వీరంతా భారత్‌లో కశ్మీర్ విడదీయరాని భాగమని దృఢంగా విశ్వసిస్తున్నవారు. వర్తమాన పరిస్థితుల్లో సత్వర నిర్ణయం అవసరమని కేంద్రం భావించివుండొచ్చు. ఇప్పటికైనా ఆ ప్రాంతప్రజల అపోహలు తొలగించే కృషి మొదలుకావాలి. కశ్మీర్ అభివృద్ధి సాకారం కావాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
కార్తీక మాసం, **తిథి:** అమావాస్య తె.5.13 వరకు (తెల్లవారితే బుధవారం), తదుపరి మార్గశిర శుక్ల పాడ్యమి, **నక్షత్రం:** అనూరాధ ప.12.03 వరకు తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** సా.5.36 నుండి 7.14 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.34 నుండి 9.22 వరకు, తదుపరి రా.10.37 నుండి 11.25 వరకు, **అమృతఘడియలు:** రా.3.11 నుండి 4.46 వరకు.

సూర్యోదయం : 6.24
సూర్యాస్తమయం: 5.23
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

ఐక్యతకు బలం చేకూర్చిన తీర్పు!

అభిప్రాయం



నరేంద్ర మోదీ
భారత ప్రధాని

ఆర్టికల్ '370, 35ఎ'ల రద్దుపై భారత సర్వోన్నత న్యాయస్థానం డిసెంబరు 11న ఇచ్చిన చరిత్రాత్మక తీర్పు దేశ సార్వభౌమాధికారం, సమగ్రతలను నిర్ద్వంద్వంగా సమర్థించింది. ఈ మేరకు 2019 ఆగస్టు 5 నాటి నిర్ణయం రాజ్యాంగ సమగ్రతను మరింత పటిష్ఠం చేసేదే తప్ప దెబ్బ తీసేది ఎంతమాత్రం కాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అంతే కాకుండా ఆర్టికల్ 370 కి స్వాభావిక శాశ్వతత్వం లేదనే వాస్తవాన్ని కూడా కోర్టు గుర్తించింది. సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తాజా తీర్పుతో 'ఒకే భారతం–శ్రేష్ఠ భారతం' స్ఫూర్తి మరింత బలోపేతమైంది. ఐక్యతా బంధం, సుపరిపాలనపై ఉమ్మడి నిబద్ధతకు నిర్వచనం ఇదేనని గుర్తు చేసిన ఈ తీర్పు ప్రతి భారతీయుడూ గర్వించదగినది.

జమ్ము, కశ్మీర్, లద్దాఖ్ ప్రాంతాలు ప్రకృతి సౌందర్యానికి నిలయాలు. నిర్మలమైన లోయలు, గంభీర పర్వతాలతో కూడిన ప్రాకృతిక వైభవం అనాదిగా కవులు, కళాకారులను ఉత్తేజితం చేయడమే కాకుండా సాహసికుల హృదయాలను కూడా దోచుకుంది. ఆకాశాన్నంటే హిమాలయ సోయగం నడుమ సౌందర్య–అద్భుతాల సంగమంగా ఈ ప్రదేశం అలరారేది. కానీ, ఈ స్వర్గం ఏడు దశాబ్దాలపాటు అత్యంత దారుణ హింస, అస్థిరతలకు ఆలవాలమై ప్రకృతి ప్రేమికులకు, సౌందర్య ఆరాధకులకు నరకంగా పరిణమించింది.

దురదృష్టవశాత్తూ శతాబ్దాల పాటు సాగిన వలసపాలన వల్ల... ముఖ్యంగా మానసిక, ఆర్థిక అణచివేత ఫలితంగా మనం ఒక రకమైన అస్తవ్యస్త సమాజంగా మారిపోయాం. అనేక ప్రాథమిక అంశాలపై సుస్పష్ట వైఖరి కొరవడి, ద్వంద్వత్వాన్ని అనుమతించడంతో అది మనల్ని మరింత గందరగోళంలోకి నెట్టింది. ఈ దురదృష్టకర పరిణామాలకు జమ్మూ కశ్మీర్ ప్రధాన బాధితురాలుగా మిగిలింది. స్వాతంత్ర్యం సిద్ధించిన వేళ జాతీయ సమైక్యత దిశగా నవ్యారంభాన్ని ఎంచుకునే అవకాశం మనకు దక్కింది. కానీ, మనం దీర్ఘకాలిక జాతీయ ప్రయోజనాలకు బదులు అస్తవ్యస్త సమాజ విధానాల కొనసాగింపునకే నిర్ణయించుకున్నాం.

నా జీవితంలో చిన్న వయసు నుంచే జమ్మూ–కశ్మీర్ సమస్యతో నేను ఒకవిధంగా ముడిపడి ఉన్నాను. కానీ, దీన్ని కేవలం రాజకీయ సమస్యగా కాకుండా సామాజిక ఆకాంక్షలు తీర్చే అంశంగా పరిగణించే సైద్ధాంతిక చట్రంలో నేనొకడిని. ఈ నేపథ్యంలో జమ్మూ కశ్మీర్‌లో జరిగిందంతా అక్కడి ప్రజానీకానికి, మనదేశానికి ఘోర ద్రోహమని నేను దృఢంగా విశ్వసించాను. అందుకే ప్రజలకు వాటిల్లిన అన్యాయాన్ని సరిదిద్దడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని బలమైన సంకల్పం పూనాను. ఆ మేరకు జమ్మూ–కశ్మీర్ ప్రజల కష్టాలు తీర్చేందుకు అవిరళంగా శ్రమించాలని నిశ్చయించుకున్నాను. ఆ క్రమంలో ఆర్టికల్ 370, 35(ఎ) ప్రధాన అవరోధాలు అయ్యాయి. అవి దుర్భేద్యమైన అడ్డుగోడల్లా తోచాయి. మరోవైపు బాధితులంతా పేదలు, అణగారిన వర్గాలవారు. ఈ పరిస్థితుల నడుమ ఈ రెండు రాజ్యాంగ నిబంధనల వల్ల భారతీయులందరికీ లభించే హక్కులు, ప్రగతి కశ్మీర్ ప్రజలకు దక్కవన్నవి సుస్పష్టం. ఫలితంగా ఒకే దేశంలోని పౌరుల మధ్య అగాధం ఏర్పడింది. పర్యవసానంగా జమ్మూ కశ్మీర్ ప్రజల బాధలు తెలిసి, అక్కడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని భావించిన ఇతర పౌరులు కూడా నిస్సహాయులుగా మిగిలిపోయారు.

ఈ సమస్యను కొన్ని దశాబ్దాలుగా నిశితంగా పరిశీలించిన ఓ కార్యకర్తగా దాని లోతుపాతులు, సంక్లిష్టతలపై నాకు క్షుణ్ణమైన అవగాహన ఉంది. ఏదేమైనా ఒక విషయంలో మాత్రం నాకు తిరుగులేని స్పష్టత ఉంది. అదేమిటంటే– జమ్మూ–కశ్మీర్ ప్రజలు ప్రగతిని కోరుకుంటున్నారు. తమ శక్తి సామర్థ్యాలు, నైపుణ్యాలతో దేశాభివృద్ధికి తోడ్పడాలని కూడా ఆకాంక్షిస్తున్నారు. తమ భవిష్యత్తరానికి మెరుగైన జీవన నాణ్యతను, హింస–అనిశ్చితి రహిత జీవనాన్ని కూడా ప్రగాఢంగా వాంఛిస్తున్నారు. ఇలాంటి పరిణామాల మధ్యన జమ్మూ–కశ్మీర్ ప్రజలకు సేవలందించడంలో మూడు ప్రధానాంశాలకు మేం ప్రాధాన్యమిచ్చాం. ఆ మేరకు పౌరుల సమస్యలను అవగతం చేసుకోవడం, చేయూత ద్వారా విశ్వాసం పెంచడం, ముమ్మార్లులా అభివృద్ధి ప్రాథమ్యం కల్పించడంపై నిశితంగా దృష్టి సారించాం.



దేశంలో మేం 2014లో అధికారంలోకి రాగానే... జమ్మూ–కశ్మీర్ ప్రగతి పయనాన్ని మరింత వేగిరపరచేందుకు మా ప్రభుత్వంలోని మంత్రులు తరచూ అక్కడికి వెళ్లి ప్రజలతో నేరుగా సంభాషించాలని మేం నిర్ణయించుకున్నాం. దీంతో అక్కడ సుహృద్భావం పెంపొందించడంలో ఈ పర్యటనలు కీలకపాత్ర పోషించాయి. ఈ మేరకు 2014 మే నెల నుంచి 2019 మార్చి వరకు 150 దఫాలకు పైగా మంత్రులు పర్యటించడం మునుపెన్నడూ లేని రికార్డు. ఇక ప్రత్యేక ప్యాకేజీతో జమ్మూ–కశ్మీర్ అభివృద్ధి అవసరాలు తీర్చే దిశగా 2015లో ఒక ముఖ్యమైన ముందడుగు పడింది. ఇందులో మౌలిక సదుపాయాల నిర్మాణం, ఉద్యోగ–ఉపాధికల్పన, పర్యాటకానికి ప్రోత్సాహం, హస్త కళల పరిశ్రమకు మద్దతు వంటి కార్యక్రమాలున్నాయి.

జమ్మూ–కశ్మీర్‌లో యువత కలలను రగిలించగల శక్తి క్రీడలకు ఉందన్న వాస్తవాన్ని గుర్తించి దాన్ని సద్వినియోగం చేసుకున్నాం. ఈ మేరకు వివిధ క్రీడా కార్యక్రమాలు నిర్వహించాం. వారి ఆకాంక్షలు–భవిష్యత్తుపై ఈ క్రీడల పరివర్తనాత్మక ప్రభావాన్ని మేం ప్రత్యక్షంగా చూశాం. క్రీడా వేదికల మెరుగుతో పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి శిక్షకులను అందుబాటులో ఉంచాం. స్థానిక ఫుట్‌బాల్ క్లబ్బుల ఏర్పాటును ప్రోత్సహించడం మేం చేపట్టిన అత్యంత ప్రత్యేక చర్యలలో ఒకటి. దీని ఫలితాలు అత్యద్భుతం. వీటిద్వారా ఎందరో యువతీయువకులు పటిష్ఠ శిక్షణతో ప్రతిభావంతులైన క్రీడాకారులుగా వెలుగులోకి వచ్చారు. వీరిలో అఫ్షాన్ ఆషిఖ్ పేరు నాకింకా గుర్తుంది. ఎందుకంటే– 2014 డిసెంబరు నాటికి శ్రీనగర్‌లో రాళ్లు విసిరే అల్లరిమూకలో ఆమె ఒకరుగా ఉండేది. అయితే, సముచిత చర్యలు, ప్రోత్సాహంతో ఆ యువతి ఫుట్‌బాల్ వైపు మళ్లి జాతీయ స్థాయిలో పేరుప్రతిష్ఠలు సంపాదించింది. ఆ తర్వాత యువతరంతో సుదృఢ భారతం కార్యక్రమం సందర్భంగా ఓసారి నేను ఆమెతో సంభాషించినట్లు నాకిప్పటికీ గుర్తుంది.

ఈ ప్రాంత సర్వతోముఖాభివృద్ధిలో పంచాయితీ ఎన్నికలు ఒక మేలిమలుపు. మరోసారి మేం అధికారంలో కొనసాగడం లేదా మా సిద్ధాంతాలకు కట్టుబాటు... అనే వాటిలో ఏదో ఒకటి ఎంచుకోవాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నాం. మాకు ఇదేమంత కఠినమైనది కాదు. అధికారం వదులుకున్నా, సిద్ధాంతాలను నిలబెట్టుకున్నాం. ఆ మేరకు జమ్మూ ప్రజల ఆకాంక్షలు, కశ్మీర్ ప్రగతికే అత్యంత ప్రాధాన్యమిచ్చాం. పంచాయతీ ఎన్నికలు విజయవంతంగా పూర్తి కావడం అక్కడి ప్రజల ప్రజాస్వామిక స్వభావాన్ని స్పష్టం చేసింది. గ్రామాల నుంచి వచ్చిన సర్పంచులతో సంభాషించాలని నా మనస్సుకు తోచింది. ఈ సందర్భంగా ఇతరత్రా సమస్యలపై మాట్లాడటంతో పాటు నేను వారికొక అభ్యర్థన చేశాను. ఇకపై ఎట్టి పరిస్థితుల్లోనూ పాఠశాలలను తగులబెట్ట రాదని, ఈ వాగ్దానానికి కట్టుబడి ఉండాలని స్పష్టం చేశాను. ఆ తర్వాత వారు తమ హామీని నిలబెట్టుకోవడం నన్నెంతో ఆనందింపజేసింది. పాఠశాలలు తగుల బడితే అందరి కన్నా ఎక్కువగా బాధపడేది పసివాళ్లే!

ఈ నేపథ్యంలో ఆగస్టు 5వ తేదీ ఒక చరిత్రాత్మక దినంగా ప్రతి భారతీయుడి హృదయంలో నాటుకుపోయింది. ఆ రోజున ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ మన పార్లమెంటు చారిత్రక నిర్ణయం తీసుకుంది. అప్పటి నుంచి జమ్ము, కశ్మీర్, లద్దాఖ్‌లలో పెనుమార్పులు వచ్చాయి. చివరకు 2023 డిసెంబరులో న్యాయస్థానం తీర్పు దాన్ని బలపరచింది. ఈ మూడు ప్రదేశాల్లో అభివృద్ధిని చూశాక నాలుగేళ్ల కిందటి పార్లమెంటు నిర్ణయంపై ప్రజాకోర్టు తీర్పును సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ప్రతిధ్వనింపజేసింది. రాజకీయాల స్థాయిలో గత 4 ఏళ్లుగా క్షేత్రస్థాయిన ప్రజా స్వామ్యంపై సరికొత్త విశ్వాసం పునరుద్ధరించబడింది. అంతకు ముందు సమాజంలోని మహిళలు, గిరిజనులు, ఎస్సీ/ఎస్టీ, అణగారిన వర్గాలకు దక్కాల్సిన ప్రయోజనాలు అందేవి కావు. అదే సమయంలో లద్దాఖ్ ఆకాంక్షలు పూర్తిగా విస్మరణకు గురయ్యాయి. అయితే, 2019 ఆగస్టు 5న ఈ పరిస్థితి సమూలంగా మారిపోయింది. ఇప్పుడు కేంద్ర చట్టాలన్నీ ఎలాంటి భయపక్షపాతాలూ లేకుండా అమలవుతున్నాయి. ప్రాతినిధ్యం మరింత పెరిగింది. మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ అమలులోకి వచ్చింది. అందరూ విస్మరించిన శరణార్థి సమాజాలు అభివృద్ధి ఫలాలను ఆస్వాదించడం ప్రారంభించాయి.

కీలకమైన కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు సంతృప్త స్థాయికి చేరింది. మౌలిక సదుపాయాల కల్పన, పర్యాటక రంగానికి చేయూతతో కశ్మీర్ అందాలు ప్రతి ఒక్కరికీ మళ్లీ స్వాగతం పలుకుతున్నాయి. ఈ ఘనత సహజంగానే జమ్మూ–కశ్మీర్ ప్రజల దృఢ సంకల్పానికి దక్కుతుంది. ఈ మేరకు తాము ప్రగతి కాముకులం మాత్రమేనని, ఈ సానుకూల మార్పునకు చోదకులు కావడానికి సిద్ధంగా ఉన్నామని వారు పలుమార్లు నిరూపించుకున్నారు. గతంలో జమ్ము, కశ్మీర్, లద్దాఖ్‌ల పరిస్థితి ఒక ప్రశ్నార్థకంలా ఉండేది. కానీ, ఇప్పుడది ''రికార్డు వృద్ధి, రికార్డు ప్రగతి, రికార్డు స్థాయిలో పర్యాటక ప్రవాహం''తో ఆశ్చర్యార్థకానికి ప్రతీకగా మారింది.

జమ్ము, కశ్మీర్, లద్దాఖ్‌లలో ప్రతి బిడ్డ నేడు స్వచ్ఛమైన నేపథ్యంతో జన్మిస్తున్నాడు. అక్కడ అతను లేదా ఆమె శక్తిమంతమైన ఆకాంక్షలతో కూడిన భవిష్యత్తును నిర్మించుకోవచ్చు. ప్రజల స్వప్నాలు నేడు గతానికి బందీలు కావు. భవిష్యత్తుకు బంగారుబాట పరిచే అవకాశాలు. అన్నింటికీ మించి భ్రమలు, నిరాశా నిస్పృహల స్థానంలో ఇప్పుడు అభివృద్ధి, ప్రజాస్వామ్యం, ఆత్మగౌరవం పరిఢవిల్లుతున్నాయి!

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

జవాబేదీ?!



సుప్రీంకోర్టు తీర్పు, ప్రభుత్వ వాదనలు... రెండూ కూడా ఒక ముఖ్యమైన ప్రశ్నకు సమాధానం ఇవ్వడంలో విఫలం అయ్యాయి. ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూకశ్మీర్ ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తిని హఠాత్తుగా తొలగించి, రాత్రికి రాత్రి ఆ రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా మార్చవలసిన అవసరం ఏమొచ్చిందన్నదే ఆ ప్రశ్న!

– సాగరికా ఘోష్, పాత్రికేయురాలు

అన్యాయం



పార్లమెంటులో మాట్లాడే అవకాశం కూడా ఇవ్వకుండా మూజువాణీ ఓటు ద్వారా మహువా మొయిత్రాను అధికారికంగా లోక్‌సభ నుంచి బహిష్కరించారు. భద్రతా సిబ్బంది ఆమెను బయటికి ఈడ్చుకెళ్లారు. ఆ సమయంలో... లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్‌భూషణ్ మాత్రం గర్వంగా పార్లమెంటులో కూర్చొనే ఉన్నారు. మహిళా సాధికారతా... నువ్వెక్కడ?!

– రాధికా చౌదరి, పొలిటికల్ కామెంటేటర్

అంతటా మనవాళ్లే



మన విద్యాసంస్థల పూర్వ విద్యార్థులు ప్రతిభకు రిజర్వాయర్లు. వివిధ రంగాలలో జాతీయంగా, అంతర్జాతీయంగా గట్టి పట్టును కలిగి ఉన్నవారు. పూర్వ విద్యార్థుల సంఘాలతో కలిసి మీరంతా ఒక సమాఖ్యను ఏర్పరచుకోవాలని నేను కోరుతున్నాను. (ఐఐటి–ఐఎస్ఎమ్, ధన్‌బాద్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ).

– జగదీప్ ధన్‌ఖడ్, భారత ఉపరాష్ట్రపతి

విక్రమార్కుడు



ప్రసిద్ధ న్యాయవాది కపిల్ సిబల్ కోర్టుకు హాజరై.. 1) అయోధ్యలో రామ మందిరానికి వ్యతిరేకంగా, 2) ట్రిపుల్ తలాఖ్ నిషేధానికి వ్యతిరేకంగా, 3) అలహాబాద్ హైకోర్టు ప్రాంగణం నుండి మసీదు అక్రమ తొలగింపునకు వ్యతిరేకంగా, 4) జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దుకు వ్యతిరేకంగా... హోరాహోరీగా పోరాడారు. కానీ ఒక్క కేసులోనూ ఆయన గెలవలేకపోయారు.

– అన్షుల్ సక్సేనా, సామాజికాంశాల వ్యాఖ్యాత

అభిప్రాయం

యుద్ధాన్ని ఎందుకు విరమించారు?

ఈ నెల 6న పార్లమెంట్‌లో ఆమోదం పొందిన రెండు బిల్లులను ప్రవేశపెట్టిన సందర్భంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ... 'జమ్మూ–కశ్మీర్ శాసనసభలో పీఓకేకు 24 స్థానాలూ, కశ్మీరీ నిర్వాసితులకు 2, పీఓకే నిర్వాసితులకు ఒకటి కేటాయించాం. తొలి ప్రధాని నెహ్రూ తప్పులు కశ్మీర్ ఉగ్ర–వేర్పాటువాదాలకూ, పీఓకే పుట్టుకకూ కారణం. మన సైన్యం పాక్ సేనను తరుముతూ 3 రోజుల్లో కశ్మీర్‌ను స్వాధీనం చేసుకోనుండగా యుద్ధం విరమించారు. అనవసరంగా, హడావిడిగా కశ్మీర్ అంశాన్ని ఐక్యరాజ్యసమితి (ఐరాస)కి చేర్చారు. 70 ఏళ్ళుగా హక్కులు పోయి అన్యాయానికి గురైన కశ్మీరీలకు న్యాయం చేకూర్చడమే ఈ బిల్లుల ఉద్దేశం' అన్నారు. దీంతో అనుపమ్ ఖేర్ లాంటి వలస కశ్మీరీ పండితులు, వైదికవాదులు కశ్మీరీ ప్రజాప్రతినిధులు కాగలరు. 'కశ్మీర్ ఫైల్స్' సినిమా ప్రయోజనమూ నెరవేరగలదు.

అమిత్ షా మాట్లాడిన మాటల్లో ఒక్కటీ నిజం కాదు. నిజానికి నెహ్రూ వల్లనే కశ్మీర్ ఇండియాలో కలిసింది. దాన్ని ఇండియాలో కలిపేందుకు షేఖ్ అబ్దుల్లాను ఒప్పించారు. నెహ్రూ మంత్రివర్గ నిర్ణయం ప్రకారం హోం మంత్రి పటేల్ విన్నపానికి 566 సంస్థానాల్లో 563 ఇండియాలో కలిశాయి. జమ్ము–కశ్మీర్, హైదరాబాద్, జునాగఢ్ మిగిలాయి. పాక్ సరిహద్దు జమ్మూ–కశ్మీర్, సముద్ర సరిహద్దులోని జునాగఢ్‌లను పాక్‌కు ఇచ్చి, దేశం మధ్యలోనున్న హైదరాబాద్‌ను ఇండియాలో కలపాలని పటేల్ ప్రతిపాదించారు. పాక్ ప్రధాని లియాఖత్ అలీ ఖాన్‌ను ఒప్పించడానికి ప్రయత్నించారు. ఈ విషయాన్ని పటేల్ కార్యదర్శి వి.శంకర్ చెప్పారు. తన చిరకాల వాంఛకు విరుద్ధమైన ఈ ప్రతిపాదనను నెహ్రూ ఆమోదించలేదు. కశ్మీర్ యుద్ధవిరమణ సమయంలో మన సైన్యం పూంఛ్, రాజౌరీ ప్రాంతాలను రక్షిస్తూ ఉంది. విరమణ ప్రకటించకుంటే ఈ ప్రాంతాలు పాక్ అధీనమయ్యేవి.

పఠాన్ లష్కర్ల గిరిజన చొరబాటు పేరుతో పాక్ సైన్యానికి భారత సేనకు మధ్య యుద్ధం జరిగింది. పాక్ ముందుగానే పాత రోడ్లను బాగుచేసి, కొత్త రోడ్లను నిర్మించి సైన్యాల తరలింపునకు ఏర్పాట్లు చేసుకోవడం వల్ల వేలాది సైనికులు కశ్మీర్‌లోకి ప్రవేశించారు. భారతీయ సైన్యం చేరడానికి సరైన రవాణా మార్గం లేక తక్కువ సైనికులే చేరారు. నానాటికీ పెరిగిన పాక్ సైన్యం మొత్తం కశ్మీర్‌ను ఆక్రమించే పరిస్థితి దాపురించింది. ఈలోపు ఇండియాను ప్రతివాదిని చేస్తూ పాక్ ఐరాసకు పోవచ్చు. 1947 డిసెంబర్ 8న నెహ్రూ చాకచక్యంగా ఈ అవకాశాన్ని కాల్పుల విరమణ ప్రకటించి అడ్డుకున్నారు. ఆ తర్వాత ఐరాసకు కశ్మీర్ సమస్యను తీసుకెళ్లారు. నెహ్రూ అనుమానించినట్లే అమెరికా పక్షపాతి అయిన ఐరాస భారత్‌కు న్యాయం చేయలేదు. ఇవేవీ గ్రహించకుండా మోదీ ప్రభుత్వం నెహ్రూ వ్యతిరేకతే ఎజెండాగా అవాస్తవాలు ప్రచారం చేయడం దురదృష్టకరం.

– సంగిరెడ్డి హనుమంత రెడ్డి,
ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

అభివృద్ధికి కీలకం... పాలన వికేంద్రీకరణ

ఏ రాష్ట్రమైనా సుసంపన్నం కావాలంటే పంచాయితీ రాజ్ వ్యవస్థలను పటిష్ఠపరచాలి. మొత్తంగా దేశం అభివృద్ధి పంచాయతీ రాజ్ వ్యవస్థ బలంపైనా, అది ఏ మేర పాలనను వికేంద్రీకరిస్తుంది అన్న అంశాల పైనా ఆధారపడి ఉంటుంది. స్వర్గీయ రాజీవ్ గాంధీ ప్రధాన మంత్రిగా ఉండగా పంచాయతీరాజ్ వ్యవస్థలోని ప్రాథమిక స్థాయి సంస్థలకు అధికారాలు ఇవ్వడం ఎంత ముఖ్యమో గుర్తించారు. స్థానిక సంస్థలకు అధికారాలు పంచడం కోసం రాజ్యాంగ సవరణకు సైతం వెనుకాడలేదు. ఫలితంగా 1993లో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా కొత్త పంచాయతీరాజ్ వ్యవస్థ రూపు దిద్దుకొంది. ఈ వ్యవస్థే గత 30 ఏళ్లుగా కేరళ, కర్ణాటకలతోపాటు అనేక రాష్ట్రాల్లో అద్భుత ఫలితాలను ఇచ్చింది.

మన తెలుగు రాష్ట్రాలు కూడా ఈ సంస్థల బలోపేతం, పాలన వికేంద్రీకరణ అంశాల్లో ముందు వరుసలోనే ఉన్నాయి.

తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం (2018) ప్రకారం ఒక పంచాయతీలో కనీసం నాలుగు నుంచి ఐదు వేల జనాభా ఉండాలి. కేరళ వంటి రాష్ట్రాల్లో ఒక్కో పంచాయతీలో 35–40 వేల జనాభా ఉంది. ఇటువంటి రాష్ట్రాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి అక్కడి చైతన్యవంతమైన పంచాయతీ వ్యవస్థ ముఖ్య కారణం. గ్రామ పంచాయతీ స్థాయిలోనే పాలన సమర్థంగా అందడం, మరికొన్ని ఇతర అంశాలు దీనికి కారణం. తెలంగాణలో స్థానిక సంస్థలపై పలు నిబంధనలు, అడ్డంకులు ఏర్పరచడం ద్వారా ప్రభుత్వం పరిపాలన వ్యవస్థను నీరుగార్చే ప్రయత్నం చేసింది. ఫలితంగా రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు అభివృద్ధికి తమ వంతు సహకారం అందించలేని స్థితికి చేరాయి. ఉదాహరణకు అవసరాలతో నిమిత్తం లేకుండా గ్రామ పంచాయతీలు ట్రాక్టర్ కొనుగోలు చేయమన్న ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయడం వల్ల చాలా పంచాయతీలపై అదనపు భారం పడింది. వనరుల లభ్యత అంతంత మాత్రంగానే ఉన్నప్పటికీ పంచాయతీలు బ్యాంకు రుణాల ద్వారా ట్రాక్టర్లు కొనుగోలు చేశాయి. గత ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలను బలహీన పరిచే పలు చర్యలు అమలయ్యాయి. రాజ్యాంగ ఉద్దేశాలకు భిన్నంగానూ ఈ చర్యలున్నాయి.



పరిమితమైన వనరులను దృష్టిలో పెట్టుకుంటే గ్రామాల్లో అన్ని రకాల అభివృద్ధి పనులూ చేపట్టడం సాధ్యం కాదు. ఫైనాన్స్ కమిషన్ నుంచి పంచాయతీలకు అందే నిధులు కూడా అంతంతమాత్రమే. ఎందుకంటే ఈ నిధులు తలసరి లెక్కలో విడుదల అవుతూంటాయి. పోనీ పంచాయతీలు సొంతంగా ఏవైనా వినూత్నమైన ఆదాయ వనరులను సమకూర్చుకోగలవా? ఇది కూడా వీలు కాని విషయమే. ఇలా చేసుకోగలిగితే ఆ గ్రామ పంచాయతీ చాలా చైతన్యవంతంగా పని చేస్తున్నట్లు లెక్క. కేరళలో కొన్ని గ్రామ పంచాయతీలు వినూత్నమైన పద్ధతుల ద్వారా కోట్ల రూపాయల ఆదాయం సంపాదిస్తూండటం ఇక్కడ చెప్పుకోవాల్సిన విషయం.

2030 నాటికి ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను అందుకునేందుకు భారత ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. గ్రామ పంచాయతీల బలోపేతం ద్వారా మాత్రమే ఇది సాధ్యమవుతుంది. ఆర్థిక సహకారం, పాలన పరంగా స్వాతంత్ర్యం కూడా అవసరమవుతాయి. వీటితోపాటు గ్రామ పంచాయతీల స్థాయిలో సామర్థ్యాలను పెంచుకోవాల్సి వస్తుంది. 'తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పంచాయత్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్' సంస్థకు జవజీవాలు కల్పించడం ద్వారా ఇవన్నీ జరగాలి. రాష్ట్రంలో సమర్థమైన, వికేంద్రీకృతమైన పరిపాలన సాగేందుకు కింది సూచనలను కూడా పరిగణనలోకి తీసుకోవచ్చు.

1. 2018 నాటి తెలంగాణ పంచాయత్ రాజ్ చట్టాన్ని సమీక్షించాలి. గ్రామ పంచాయతీలను బలోపేతం చేస్తూ ఈ చట్టాన్ని సంస్కరించాలి.

2. టీఎస్ఐపీఏఆర్‌డీని పునరుజ్జీవింపచేయాలి. తద్వారా పంచాయతీ రాజ్ వ్యవస్థలోని సంస్థల్లో నాయకత్వాన్ని బలోపేతం చేసే చర్యలు చేపట్టవచ్చు. మానవ వనరుల అభివృద్ధి కూడా సాధ్యమవుతుంది. '2022 నేషనల్ కెపాసిటీ బిల్డింగ్ ఫ్రేమ్‌వర్క్' ఇచ్చిన సలహా సూచనల సాయంతో ఈ పనులు చేపట్టాలి.

3. ప్రణాళిక రూపకల్పన, అమలులో గ్రామ పంచాయతీల్లోని ప్రజలందరూ భాగస్వాములయ్యేలా చూడాలి. ఇందుకు తగ్గట్టుగా గ్రామ పంచాయతీలకు అవసరమైన సాధన సంపత్తిని సమకూర్చాలి.

4. దాతృత్వ సంస్థల ద్వారా గ్రామ పంచాయతీలకు ఆర్థిక వనరులు సమకూరేలా వ్యవస్థలను ఏర్పాటు చేయాలి.

ఈ చర్యలు తీసుకోవడం ద్వారా తెలంగాణ రాష్ట్రం సామాజిక, ఆర్థిక అభివృద్ధి అంశాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధించగలదని నా విశ్వాసం.

– డా॥ డబ్ల్యూ. రాంపుల్లా రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, ఎస్ఐఆర్‌డీ మాజీ డైరెక్టర్ జనరల్

క్లుప్తంగా...

సీఎం రేవంత్‌కు పీఆర్టీయూ టీఎస్ అభినందనలు



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పీఆర్టీయూటీఎస్ నేతలు సోమవారం అభినందనలు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో సంఘం అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు మోహన్ రెడ్డి, పూల రవీందర్ సీఎంను కలిసినవారిలో ఉన్నారు. రేవంత్ నేతృత్వంలో విద్యాశాఖ పటిష్టమవుతుందన్న ఆశాభావం వ్యక్తంచేశారు.

'దస్త్రాల మాయంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి'

సాక్షి, హైదరాబాద్: పశుసంవర్ధకశాఖలో దస్త్రాలు మాయమయ్యాయని వస్తున్న వార్తలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ డిమాండ్ చేశారు. మంత్రి కిటికీ గ్రిల్స్ తొలగించి ఫైల్స్ ఎత్తుకెళ్లారనడం దారుణమని సోమవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆఫీసు తరలించే క్రమంలో ఎలుకల బాధకు కొన్ని ఫైల్స్ చింపేశామంటూ ఓఎస్డీ కల్యాణ్ చెప్పడం విడ్డూరమన్నారు. బీరువాలోని ఫైళ్లను ఎలుకలు కొట్టడమేంటని రవీందర్ ప్రశ్నించారు. ఒక వేళ అదే నిజమైతే ఆ మరుసటి రోజు కిటికీల గ్రిల్స్‌ను ఎందుకు తొలగించారని అడిగారు. గురువారమే కార్యాలయం షిఫ్ట్ చేస్తే అక్కడ ఇంకా కంప్యూటర్లు ఎందుకున్నాయని, సీసీ కెమెరాలు ఎందుకు ధ్వంసం అయ్యాయని రవీందర్ ప్రశ్నించారు. వీటిపై సమగ్ర దర్యాప్తు జరపాలని, నిజానిజాలను నిగ్గు తేల్చి ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఒక్కరోజే 34,998 బస్తాల ధాన్యం



తిరుమలగిరి మార్కెట్‌లో ధాన్యం రాశులు

తిరుమలగిరి (తుంగతుర్తి): సూర్యాపేట జిల్లా తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యం పోటెత్తింది. సోమవారం ఒక్కరోజే ఈ సీజన్‌లోనే అత్యధికంగా 34,998 బస్తాల ధాన్యం వచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ వెల్లడించారు. సన్న రకానికి గరిష్టంగా క్వింటాకు రూ.3,069, కనిష్టంగా రూ.1,500, దొడ్డు రకానికి గరిష్టంగా రూ.2,459, కనిష్టంగా రూ.1,759 ధర పలికింది. భారీగా ధాన్యం రావడం.. కాంటాలు, ఎగుమతులు, దిగుమతులు ఆలస్యం కానుండటంతో మంగళ, బుధవారాల్లో సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి తెలిపారు. ఈనెల 14న మార్కెట్ యథావిధిగా నడుస్తుందన్నారు.

సీఎల్ఏటీ ఫలితాల్లో శ్రీచైతన్య ప్రభంజనం

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఉన్న లా యూనివర్సిటీల్లో ఐదేళ్ల లా కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించిన కామన్ లా ఎంట్రన్స్ టెస్ట్ (సీఎల్ఏటీ)-2024 ఫలితాల్లో శ్రీచైతన్య ఐఏఎస్ అకాడమీ విద్యార్థులు అత్యధికంగా స్టేట్, ఆలిండియా ర్యాంకులు సాధించినట్లు విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో తమ విద్యార్థులు కె.వినోత్న స్టేట్ ఫస్ట్ ర్యాంక్, ఎస్.సాయిరాహుల్ స్టేట్ 3వ ర్యాంక్, షేక్ మహ్మద్ ఆసీఫ్ స్టేట్ 5వ ర్యాంక్, ఎ.హర్షవర్ధన సాయి స్టేట్ 10వ ర్యాంక్, కె.స్వరూప్ స్టేట్ 11వ ర్యాంక్ వంటి టాప్-50 లోపు ర్యాంకులతో పాటు వివిధ కేటగిరీల్లో 85వ ర్యాంక్, 123వ ర్యాంక్ వంటి బెస్ట్ ర్యాంక్స్‌ను సాధించి నల్సార్ వంటి టాప్ యూనివర్సిటీల్లో ప్రవేశాలు పొందే అవకాశాన్ని పొందారని వెల్లడించారు.

కొత్త రేషన్‌కార్డులు ఇస్తారా?

నేడు మంత్రి ఉత్తమ్ నేతృత్వంలో పౌరసరఫరాల శాఖ పనితీరుపై సమీక్ష



సాక్షి, హైదరాబాద్: ఆరోగ్యశ్రీ మొదలు రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు లబ్ధిదారులుగా ఉండాలంటే..రేషన్‌కార్డు తప్పనిసరి అయ్యింది. అధికారంలోకి వస్తే అర్హులైన వారందరికీ కొత్త రేషన్‌కార్డులు (ఆహారభద్రత కార్డులు) జారీ చేస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. మంగళవారం పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి హైదరాబాద్‌లోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసే సమీక్ష సమావేశంలో కొత్త రేషన్‌కార్డుల జారీకి సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే విషయంలో ఆసక్తి నెలకొంది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొత్త రేషన్‌కార్డుల కోసం ఎన్ని విజ్ఞప్తులు వచ్చినా, ఇప్పటికే రాష్ట్రంలో 90 లక్షలకు పైగా కార్డులు ఉన్నాయనే కారణంతో ఆ దిశగా దృష్టి పెట్టలేదు. హుజూరాబాద్ ఉప ఎన్నిక సందర్భంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల్లో 3 లక్షల కార్డులు జారీ చేశారు. అప్పటి నుంచి కొత్తగా దరఖాస్తులు ఆహ్వానించలేదు. ఉమ్మడి కుటుంబాల నుంచి వేరుపడిన వారు... ఈ పదేళ్లలో జన్మించిన పిల్లల పేర్లు కూడా కార్డుల్లో చేర్చలేదు. చనిపోయిన వారి పేర్లు మాత్రమే ఎప్పటికప్పుడు తొలగించారు.

రాష్ట్రంలో 90.14 లక్షల రేషన్‌కార్డులు: రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఆహారభద్రత కార్డులు 90.14 లక్షలు ఉన్నాయి. ఇందులో జాతీయ ఆహార భద్రత చట్టం(ఎన్ఎఫ్ఎస్ఏ) కింద 54.48 లక్షల కార్డులు ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆహారభద్రత కార్డులు 35.66 లక్షలు ఉన్నాయి. ఇవి కాకుండా అంత్యోదయ అన్నయోజన కింద 5.62 లక్షల కార్డులు, అన్నపూర్ణ పథకం కింద 5,211 కార్డులు ఉన్నాయి.ఈ కార్డుల పరిధిలో 2.83 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారు. రాష్ట్రంలో ఉన్న జనాభా, ప్రజల ఆర్థిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకుంటే ఈ కార్డుల లబ్ధిదారుల్లో 20 శాతం వరకు అనర్హులే ఉన్నట్టు గత ప్రభుత్వం గుర్తించింది. అయితే అనర్హుల నుంచి కార్డులను ఏరివేత ప్రక్రియ ప్రారంభిస్తే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందనే కారణంగా యథాతథ స్థితి కొనసాగించింది.

అనర్హులను తొలగిస్తారా...?

గతంలో తెలుపు, గులాబీ రేషన్‌కార్డులు ఉండేవి. 2014లో కేంద్ర ప్రభుత్వం గులాబీకార్డులను పూర్తిగా ఎత్తివేసి దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న (బీపీఎల్) వారికే ఆహారభద్రత కార్డులు జారీ చేసింది. కేంద్రం జారీ చేసిన రేషన్ కార్డులు పొందలేని వారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆహారభద్రత కార్డులు ఇచ్చింది. ఈ లెక్కన రాష్ట్రంలో 90.14 లక్షల కుటుంబాలకు రేషన్‌కార్డులు ఉండగా, లబ్ధిదారుల సంఖ్య దాదాపు 2.83 కోట్లు. రాష్ట్ర జనాభానే 4 కోట్లు అనుకుంటే సుమారు 3 కోట్ల మంది ఆహారభద్రత కార్డులకు అర్హులుగా ఉన్నారు. కొత్త రేషన్‌కార్డులు జారీ చేయాల్సి వస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి విధివిధానాలు రూపొందిస్తుందనేది చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుత రేషన్‌కార్డులలో అర్హులైన వారిని మాత్రమే కొనసాగించి, కొత్తగా బీపీఎల్ పరిధిలోకి వచ్చే వారికి కార్డులు జారీ చేస్తారా లేక ఉన్న వాటి జోలికి వెళ్లకుండా కొత్తగా అర్హులను గుర్తిస్తారా చూడాలి.

కీలక అధికారుల బదిలీ!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్, ఐటీ–పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, సింగరేణి సీఎండీ శ్రీధర్, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, నీటి పారుదల శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్‌లకు స్థానభ్రంశం తప్పదన్న అభిప్రాయం ప్రభుత్వ వర్గాల్లో వినిపిస్తోంది. నవీన్ మిట్టల్ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శితోపాటు సీసీఎల్ఏగా కూడా కొనసాగుతున్నారు. ఆయన స్థానంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు లేదా శశాంక్ గోయల్‌ను నియమించే అవకాశాలు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని తక్షణమే మార్చే ఉద్దేశం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆమెను మార్చే పక్షంలో రామకృష్ణారావుకు సీఎస్ బాధ్యతలు అప్పగించవచ్చని అంటున్నారు.

రిటైరైనా కొనసాగుతున్నవారికి ఉద్వాసన

పదవీ విరమణ చేసిన దేవాదాయ, పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌ను గత ప్రభుత్వం అదే పోస్టులో కొనసాగిస్తూ వచ్చింది. ఇప్పుడు ఆయనకు ఉద్వాసన పలికే అవకాశం ఉందని అంటున్నారు. మైనారిటీ సంక్షేమశాఖ కార్యదర్శిగా ఉన్న రిటైర్డ్ అధికారి సయ్యద్ ఒమర్ జలీల్, పశుసంవర్ధకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా తిరిగి నియమితులైన అదర్‌సిన్హా, కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా తిరిగి నియమితులైన రాణి కుముదిని తదితరులనూ తప్పించనున్నట్టు చెప్తున్నారు.

అప్రాధాన్య పోస్టుల్లో ఉన్న కీలక అధికారులకు..

గత సర్కారు అప్రాధాన్య పోస్టుల్లో కొనసాగించిన సీనియర్ ఐఏఎస్ అధికారుల జాబితాలో.. బుర్రా వెంకటేశ్వర్లు (వెనుకబడిన తరగతుల శాఖ కార్యదర్శి), అనితా రామచంద్రన్ (టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి), విజయేంద్ర (ప్రత్యేక కార్యదర్శి ఆర్‌అండ్‌బీ), రాహుల్ బొజ్జా (విపత్తుల నిర్వహణ కార్యదర్శి) తదితరులు ఉన్నారు. వీరికి ప్రాధాన్య పోస్టులు లభించే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. మరోవైపు గత ప్రభుత్వంలో ఓ వెలుగు వెలిగిన ఉన్నతాధికారులు కేంద్ర సర్వీసులకు వెళ్లడానికి అప్పుడే ప్రయత్నాలు మొదలెట్టినట్టు ప్రచారం జరుగుతోంది.

కలెక్టర్లకూ స్థాన చలనం

కలెక్టర్లలో సంగారెడ్డి కలెక్టర్ శరత్, భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా, రాజీవ్‌గాంధీ హన్మంతుతోపాటు పలువురు అధికారులకు స్థానభ్రంశం తప్పదని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. గతంలో రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా చేసి.. పీఎంవోకు డిప్యూటేషన్‌పై వెళ్లిన కాట ఆమ్రపాలి తిరిగి రాష్ట్ర సర్వీసులకు వచ్చారు. ఆమె పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్నారు. ఇక ఢిల్లీలోని తెలంగాణ భవన్ ఓఎస్డీగా ఉన్న సంజయ్ జాజు తిరిగి హైదరాబాద్‌కు వచ్చే అవకాశం ఉంది. వీరు కాకుండా మరో అరడజను మంది వరకు అధికారులు కేంద్ర ప్రభుత్వ సర్వీసులో ఉన్నారు. వారు ఐదేళ్లపాటు కేంద్ర సర్వీసుల్లో డెప్యుటేషన్ పూర్తి చేసుకున్నాకే రాష్ట్ర సర్వీసుకు వస్తారు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కోరితే రిలీవ్ చేసే అవకాశం ఉంటుంది.

'ఓటమితో కిషన్‌రెడ్డికి మతిస్థిమితం తప్పిందేమో?'



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్‌ను గెలిపించి ప్రజలు తలలు పట్టుకుంటున్నారని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలతో ఆయనకు మతి స్థిమితం తప్పిందన్న అనుమానం కలుగుతోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ విమర్శించారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, గత మూడేళ్లుగా మోదీ మొదలుకొని ప్రతి బీజేపీ నాయకుడు అధికారంలోకి వస్తామని ఎంత ఊదరగొట్టినా, తెలంగాణ ప్రజలు వారిని సింగిల్ డిజిట్‌కే పరిమితం చేశారన్నారు. ఎన్నికల ఫలితాలతో తన తలను ఎక్కడ పెట్టుకోవాలో కిషన్‌రెడ్డికి తెలియడం లేదని, ఆయన మాటలు విని ప్రజలు నవ్వుకుంటున్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఎన్నికల హామీలైన 6 గ్యారంటీలలో రెండు గ్యారంటీలను అమలు చేస్తూ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, ఆరోగ్య శ్రీ పరిమితిని 10 లక్షలకు పెంచి ప్రజలమన్న నలు పొందుతుంటే కిషన్‌రెడ్డి విమర్శించడం తగదన్నారు. బీజేపీకి ఉన్న 8 మంది శాసనసభ్యుల్లోనే శాసనసభాపక్ష నేతను నిర్ణయించుకోలేక తలలు పట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మజ్లిస్ నాయకులు కాంగ్రెస్ నాయకులను తిడుతున్నా, అసెంబ్లీ సంప్రదాయాలకు అనుగుణంగా అక్బరుద్దీన్ ఒవైసీని ప్రొటెమ్ స్పీకర్‌గా నియమించామని గుర్తు చేశారు.

11మందిని పొట్టన పెట్టుకుని?

- మాయలు, మంత్రాలు.. ఆనక హత్యలు
- ఓ నరహంతకుడి నేరచరిత్రను వెలికితీస్తున్న ఖాకీలు
- నాగర్‌కర్నూల్‌లో మాయగాడు సత్యనారాయణ బాగోతం
- నేడు వివరాలు వెల్లడిస్తామంటున్న పోలీసులు
- సత్యనారాయణ బాగోతాలపై గతంలోనే సాక్షి కథనం

సాక్షి, నాగర్‌కర్నూల్: మంత్రాలు, మాయలు చేసి గుప్తనిధులను వెలికితీస్తానంటూ అమాయకులను మోసం చేయడం.. ఎవరైనా ఎదురుతిరిగితే మట్టుబెట్టడం.. ఇలా ఇప్పటివరకు ఏకంగా 11 మందిని పొట్టన పెట్టుకున్నాడని భావిస్తున్న ఓ నరహంతకుడిని నాగర్‌కర్నూల్ జిల్లా పోలీసులు ఇటీవల అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రానికి చెందిన రామెట్టి సత్యనారాయణ యాదవ్ కొన్నేళ్లుగా తనకు మంత్రాలు, మాయలు తెలుసునంటూ అమాయక మహిళలు, వ్యక్తులను నమ్మిస్తూ మోసాలకు పాల్పడుతున్నాడు. తన మంత్రశక్తితో గుప్తనిధులను వెలికితీస్తానని, కుటుంబ కలహాలు, సమస్యలను పరిష్కరిస్తానంటూ మొదట తనకు పరిచయం అయిన వారిని నమ్మిస్తాడు. ఈ క్రమంలో వారి పేరిట ఉన్న భూములు, ఇతర ఆస్తిపాస్తులను తన పేరిట, అనుయాయుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుంటాడు. ఎవరైనా తిరగబడితే గుట్టుచప్పుడు కాకుండా పథకం ప్రకారం హత్యకు తెగబడతాడని బాధితుల నుంచి ఫిర్యాదులు అందినట్టు తెలుస్తోంది. ఇలా ఇప్పటికే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా 11 మంది అమాయకులను బలితీసుకున్నాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల అదుపులో ఉన్న నిందితుడి నుంచి పూర్తి వివరాలు రాబడుతున్నట్టు తెలుస్తోంది. కాగా మంగళవారం నిందితుడి పూర్తి వివరాలను వెల్లడిస్తామని నాగర్‌కర్నూల్ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.



సత్యనారాయణ

ఓ రియల్టర్ భార్య ఇచ్చిన ఫిర్యాదుతో వెలుగులోకి..

పోలీసుల విచారణలో భాగంగా నిందితుడు సత్యనారాయణ యాదవ్ ఇప్పటివరకు 11 మంది అమాయకులను హత్య చేసినట్టు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్టు తెలుస్తోంది. మృతుల జాబితాలో మూడేళ్ల కిందట 2020 ఆగస్టు 14న వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగపూర్ గ్రామంలో గుప్తనిధుల తవ్వకాల సమయంలో అపస్మారక స్థితిలో మరణించిన ఉన్న నలుగురు వ్యక్తులు హాజిరాబీ(60), ఆస్మా బేగం (32), ఖాజా (35), ఆశ్రీన్ (10) ఉన్నారని తెలుస్తోంది. రెండేళ్ల కిందట నాగర్‌కర్నూల్ మండలం గన్యాగులకి చెందిన లింగస్వామి, కోడేరు మండలం తీగలపల్లికి చెందిన రాంరెడ్డి, కల్వకుర్తి పట్టణానికి చెందిన ఓ వ్యక్తిని సైతం హతమార్చినట్టు అనుమానిస్తున్నారు. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలానికి చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి వెంకటేశ్ కన్పించడం లేదని అతని భార్య లక్ష్మీ హైదరాబాద్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణలో భాగంగా సత్యనారాయణ యాదవ్ బాగోతం బయటకు వచ్చినట్టు తెలుస్తోంది. కాగా మంత్రాల పేరుతో మోసాలకు పాల్పడుతున్న సత్యనారాయణ యాదవ్ బాగోతాలపై ఈ ఏడాది ఏప్రిల్ 5న 'మాయగాళ్లు'శీర్షికన 'సాక్షి'కథనాన్ని ప్రచురించింది. బాధితులు ఫిర్యాదు చేస్తున్నా విచారణపై నిర్లక్ష్యం చేస్తున్న పోలీసుల తీరును ఆ కథనంలో ప్రస్తావించింది.

స్వామీజీల ముసుగులో గంజాయి రవాణా

- రూ.1.21 కోట్ల విలువైన సరుకు స్వాధీనం



గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన వ్యక్తులు

భద్రాచలం అర్బన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో రూ.1.21 కోట్ల విలువైన 484 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కాషాయ వస్త్రాలు ధరించి, వాహనంలో దేవతామూర్తుల విగ్రహాలతో తిరుగుతూ భిక్షాటన ద్వారా జీవనం సాగిస్తున్నట్లు నమ్మిస్తున్న కొందరు వ్యక్తులు అదే వాహనంలో గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారు. భద్రాచలం టౌన్ సీఐ నాగరాజురెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. స్వామీజీల వేషధారణలో కొందరు వాహనంలో ఇంటింటికీ వెళ్లి భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి వాహనంలో గంజాయి రవాణా చేస్తున్నారనే సమాచారంతో భద్రాచలం బ్రిడ్జి సెంటర్ వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరియాణా రాష్ట్రానికి చెందిన మున్షీరాం, భగత్, గోవింద్ పట్టుబడ్డారు. సులువుగా డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో బల్వాన్ అనే వ్యక్తి ప్రోద్బలంతో వీరు ఆటో కొనుగోలు చేసి దేవుడి ప్రచార రథంలా మార్చారు. ఏపీ–ఒడిశా సరిహద్దు ప్రాంతమైన కలిమెలిలో గంజాయిని కొనుగోలు చేసి హరియాణాలో విక్రయించేందుకు వీరు బయలుదేరారని సీఐ తెలిపారు.

ప్రకృతిసేద్యమే అందరికీ శ్రీరామరక్ష

- పద్మశ్రీ పురస్కార గ్రహీత సుభాష్ పాలేకర్



సాక్షి సాగుబడి, హైదరాబాద్: భూతాపాన్ని అదుపుచేయాలన్నా, అందరూ ఆరోగ్యదాయకంగా జీవించాలన్నా, సకల మానవాళికి ఆహారభద్రత చేకూరాలన్నా ప్రకృతిసేద్యమే శ్రీరామరక్ష అని పద్మశ్రీ పురస్కార గ్రహీత సుభాష్ పాలేకర్ అన్నారు. సోమవారం రామచంద్ర మిషన్‌లో జరిగిన ప్రకృతి వ్యవసాయ విస్తరణ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఎరువులు, పురుగుమందులు, కలుపుమందుల రసాయనిక అవశేషాల వల్ల మనుషులకు కేన్సర్, మధుమేహం, బీపీ వంటి వ్యాధులు సంక్రమిస్తున్నాయని తెలిపారు. భూతాపం, వాయుకాలుష్యం, కుండపోత తుపాన్లు, తీవ్ర కరువులు, అధిక ఉష్ణోగ్రతలు అనూహ్య రీతిలో పెచ్చరిల్లుతున్న ఈ తరుణంలో రైతులు, వినియోగదారులు, వృత్తిదారులు, సాధారణ ప్రజలు కూడా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కోరారు. జీవవైవిధ్యాన్ని, భూమిలో సహజపోషక వ్యవస్థను పరిరక్షించుకునే దేశీ సంప్రదాయ ఆహార ఉత్పత్తి వ్యవస్థల ద్వారానే జీవరాశి మనుగడ సుభిక్షంగా విరాజిల్లుతుందని అందరూ గుర్తించాలన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించని, ప్రోత్సహించనివారు ఆధ్యాత్మిక జీవులు ఎలా అవుతారని ఆయన ప్రశ్నించారు. సేవ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్, ప్రకృతి వ్యవసాయదారుడు విజయరామ్ మాట్లాడుతూ పన్నెండేళ్లుగా పాలేకర్ కాలికి బలపం కట్టుకొని నెలకు 25 రోజులు దేశవ్యాప్తంగా శిక్షణాశిబిరాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. లక్షలాది మందికి ప్రకృతి సేద్య తాత్వికతపై లోతైన అవగాహన కల్పించటం ద్వారా గొప్ప మార్పునకు శ్రీకారం చుట్టారన్నారు.

'రెవెన్యూ శాఖ బలోపేతంతోనే భూ సమస్యలకు పరిష్కారం'

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ శాఖ బలోపేతంతోనే భూ సమస్యలు పరిష్కారమవుతాయని తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల సంఘం అభిప్రాయపడింది. ఈమేరకు సోమవారం రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్‌ను తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల సంఘం నూతన కార్యవర్గం కలిసింది. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగులు, రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను నవీన్ మిట్టల్‌కు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ వివరించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ వ్యవస్థలను బలోపేతం చేయాలని, భూపరిపాలనలో పరిపాలన వికేంద్రీకరణ చేయాలని కోరారు. రైతులు, ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా క్షేత్రస్థాయిలో అధికారులకు అధికారాలను కల్పించాలని కోరారు. వీటిపై నవీన్ మిట్టల్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

బీజేపీ టార్గెట్ 8!

▶ మొదటి పేజీ తరువాయి

జరగబోయే లోక్ సభ ఎన్నికల్లో 25 శాతానికి ఓటింగ్ పెంచుకొని ఎనిమిది సీట్లు సాధించాలనేది బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది.

సిట్టింగ్ స్థానాలపై స్పష్టత !

సిట్టింగ్ ఎంపీలైన కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి (సికింద్రాబాద్), జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ (కరీంనగర్), అర్వింద్ ధర్మపురి (నిజామాబాద్) ఆయా స్థానాల నుంచే మళ్లీ పోటీకి సిద్ధమయ్యారు. బోథ్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి పోటీచేసి ఓటమిపాలైన ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావుకు ఈసారి పోటీకి మళ్లీ అవకాశం కల్పిస్తారా లేదా అన్న దానిపై స్పష్టత రాలేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే బీఆర్ఎస్‌కి రాజీనామా చేసి బీజేపీలో చేరిన రాథోడ్ బాపూరావును ఈసారి ఆదిలాబాద్ నుంచి లోక్‌సభకు పోటీ చేయించే అవకాశాలున్నాయనే చర్చ పార్టీలో సాగుతోంది. ఆయనతో పాటు ఈసారి ఖానాపూర్ నుంచి ఓడిన మాజీ ఎంపీ రమేశ్‌రాథోడ్ కూడా ఈ సీటును ఆశిస్తున్నట్టు తెలిసింది. ఆదిలాబాద్ ఎంపీ సెగ్మెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఆదిలాబాద్, నిర్మల్, సిర్పూర్, ముథోల్ గెలిచిన జోరు మీదున్న బీజేపీ ఎంపీ సీటును కచ్చితంగా కైవసం చేసుకుంటామనే ధీమాతో ఉంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలోని మూడు ఎమ్మెల్యే సెగ్మెంట్‌లలోనూ పార్టీ విజయం సాధించడం, జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు హామీని నిలుపుకున్నందున నిజామాబాద్ ఎంపీ స్థానాన్ని మళ్లీ కైవసం చేసుకుంటామనే విశ్వాసం పార్టీ నాయకుల్లో వ్యక్తమవుతోంది.

మిగిలిన స్థానాల్లో ఇలా....

సిట్టింగ్ స్థానాలు మినహా మిగిలిన 13 ఎంపీ సీట్లలో పోటీకి కొందరు ముఖ్యనేతలు తమ ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు.

- మల్కాజిగిరి నుంచి పోటీకి బీజేపీ నేత, మధ్యప్రదేశ్ ఇన్‌చార్జ్ పి.మురళీధర్‌రావు, మహబూబ్‌నగర్ నుంచి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణకు జాతీయ నాయకత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. అయితే మహబూబ్‌నగర్ నుంచి పోటీకి మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, కల్వకుర్తి నుంచి అసెంబ్లీకి పోటీ చేసిన టి.ఆచారి సిద్ధంగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.
- మెదక్ నుంచి పోటీకి తాను సిద్ధమని మాజీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు ఇప్పటికే ప్రకటించారు. మల్కాజిగిరి, మెదక్, కరీంనగర్‌లలో ఎక్కడో ఒకచోట నుంచి పార్టీ అగ్రనాయకత్వం అవకాశం కల్పిస్తే పోటీకి సిద్ధమేనని సీనియర్‌నేత ఈటల రాజేందర్ తన సన్నిహితుల వద్ద సంకేతాలిచ్చి ఆ దిశలో ప్రయత్నాలు కూడా ముమ్మరం చేసినట్టు తెలుస్తోంది.
- చేవెళ్ల లోక్‌సభ స్థానం నుంచి పోటీకి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎప్పటి నుంచో కసరత్తు ప్రారంభించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు నుంచే దానికి సంబంధించిన కార్యాచరణలో నిమగ్నమైనట్టు పార్టీవర్గాల సమాచారం.
- భువనగిరి టికెట్ తనకు వస్తుందని మాజీ ఎంపీ డా. బూరనర్సయ్యగౌడ్ ఆ లోక్‌సభ పరిధిలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెబుతున్నారు.
- గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ జహీరాబాద్ నుంచి ఎంపీగా పోటీకి ఉత్సాహం కనబరుస్తున్నారు. అయితే ఇక్కడి నుంచి వీరశైవ లింగాయత్ సమాజ్‌కు చెందిన జాతీయనేత అశోక్ ముస్తాపురె, అక్కడి ప్రజల్లో గుర్తింపు ఉన్న సోమయప్ప స్వామిజీ, చీకోటి ప్రవీణ్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది.
- పెద్దపల్లి నుంచి పార్టీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి సోగల కుమార్‌కు మళ్లీ పోటీకి అవకాశం ఉంటుందని చెబుతున్నారు.
- నాగర్‌కర్నూల్ స్థానానికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బంగారు శృతిని బరిలో దింపడం లేదా కొత్త అభ్యర్థిని తెరపైకి తీసుకొచ్చే అవకాశముంది.
- వరంగల్ టికెట్ మాజీ డీజీపీ కృష్ణప్రసాద్ గట్టిగా కోరుతున్నట్టు తెలిసింది. ● నల్లగొండ స్థానానికి గతంలో పోటీ చేసిన గార్లజితేందర్ లేదా సూర్యాపేట నుంచి అసెంబ్లీకి పోటీ చేసి ఓడిన సంకినేని వెంకటేశ్వర్‌రావుకు చాన్స్ దక్కుతుందా, ఇంకా ఎవరైనా కొత్తవారికి ఇస్తారా అన్న దానిపై చర్చ సాగుతోంది.
- హైదరాబాద్ స్థానం నుంచి భగవంత్‌రావుకు అవకాశం కల్పించవచ్చునే ప్రచారం జరుగుతుండగా, ఎమ్మెల్యే రాజాసింగ్‌ను పోటీ చేయించినా అనూహ్య ఫలితాలు సాధించవచ్చనే చర్చ పార్టీ నేతల్లో ఉంది.
- మహబూబాబాద్ నుంచి రామచంద్రు నాయక్, హుస్సేన్ నాయక్, దిలీప్ నాయక్‌లు పోటీపడుతున్న ట్టుసమాచారం.
- ఖమ్మం నుంచి పార్టీనేత, తమిళనాడు సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్ రెడ్డికి అవకాశంకల్పిస్తారా ఇంకా మరెవరికైనా టికెట్ ఇస్తారా చూడాలని పార్టీ నేతలు అంటున్నారు.

● ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని అసోసియేషన్ ఆఫ్ హెల్త్ అండ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్(ఏహెచ్‌హెచ్ఏ)అధ్యక్షుడు, నిమ్స్ లైజన్ ఆఫీసర్ డాక్టర్ మార్త రమేశ్ రాష్ట్ర సచివాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌కు రమేశ్ శుభాకాంక్షలు తెలిపారు.

చరిత్రాత్మక తీర్పు

ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం. ఇదొక చరిత్రాత్మక తీర్పు. ఇది కేవలం న్యాయపరమైన తీర్పుకాదు. భవిష్యత్తు తరాలకు ఒక ఆశాదీపం. మెరుగైన భవిష్యత్తుకు వాగ్దానం. మరింత బలమైన, ఐక్య భారత్‌ను నిర్మించుకొనే విషయంలో మన సమ్మిళిత కృషికి మద్దతుగా నిలుస్తుంది. జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లోని మన సోదర సోదరీమణుల ప్రగతి, ఐక్యత, ఆశను ప్రతిధ్వనించే తీర్పు ఇది. వారి కలలను నెరవేర్చే విషయంలో మన అంకితభావం చెదిరిపోనిది. భారతీయులుగా మనం గర్వపడే మన ఐక్యతను కోర్టు మరోసారి బలపర్చింది. ఆర్టికల్ 370 వల్ల నిర్లక్ష్యానికి గురైన వర్గాలకు ప్రగతి ఫలాలు అందించాలన్నదే మా ఆకాంక్ష

- 'ఎక్స్'లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం. ప్రధాని నరేంద్ర మోదీ ఐదేళ్ల క్రితం తీసుకున్న నిర్ణయంతో జమ్మూకశ్మీర్‌లో శాంతి నెలకొంది. సాధారణ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఒకప్పుడు హింసను అనుభవించిన ప్రజలు ప్రస్తుతం శాంతియుతంగా జీవిస్తున్నారు. వారి జీవితాల్లో అభివృద్ధికి కొత్త నిర్వచనం వచ్చిచేరింది. జమ్మూకశ్మీర్‌లో పర్యాటకం, వ్యవసాయ రంగాలు వెలిగిపోతున్నాయి.

- అమిత్ షా, కేంద్ర హోంశాఖ మంత్రి

ప్రతీ భారతీయుడి మదిలో సంతోషం

ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఏను రద్దు చేస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. ఈ చరిత్రాత్మక నిర్ణయంతో ప్రతీ భారతీయుడి మదిలో సంతోషం వ్యక్తమవుతోంది. ప్రధాని మోదీ ఒక కొత్త అధ్యాయం లిఖించారు.

- రాజ్‌నాథ్ సింగ్, రక్షణ శాఖ మంత్రి

ప్రజలకు ఉజ్వలమైన భవిష్యత్తు

జమ్మూకశ్మీర్, లద్దాఖ్ ప్రజల ఉజ్వలమైన భవిష్యత్తుకు సుప్రీంకోర్టు తీర్పు నాంది పలికింది. అభివృద్ధిని వారికి చేరువ చేయడానికి మోదీ సర్కారు కృషి చేస్తూనే ఉంటుంది. న్యాయస్థానం చరిత్రాత్మక తీర్పు ఇచ్చింది. అభివృద్ధి, సుపరిపాలన, సాధికారత జమ్మూకశ్మీర్, లద్దాఖ్ ప్రజలకు అందుతాయి. వారంతా ఇకపై కలిసికట్టుగా ఉంటారు

- ఎస్.జైశంకర్, విదేశాంగ శాఖ మంత్రి

ప్రజల పాలిట మరణ శాసనం

ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంకోర్టు తీర్పు జమ్మూకశ్మీర్ ప్రజల పాలిట మరణ శాసనం కంటే తక్కువేమీ కాదు. ఇది కేవలం ప్రజలకే కాదు, భారత్ అనే భావనకు పరాజయం. భారత పార్లమెంట్ తీసుకున్న రాజ్యాంగ వ్యతిరేక, చట్టవ్యతిరేక చర్యకు నేడు న్యాయపరంగా ఆమోదం లభించింది. కోర్టు తీర్పుతో నిరాశ చెందాల్సిన అవసరం లేదు. ఏ నిర్ణయమూ తుది నిర్ణయం కాదు. జమ్మూకశ్మీర్ ప్రజలు రాజకీయ పోరాటం కొనసాగించాలి.

- మెహబూబా ముఫ్తీ, పీడీపీ

ఈ తీర్పు నిరాశ కలిగించింది

సుప్రీంకోర్టు తీర్పు నాకు నిరాశ కలిగించింది. అయితే, ఉత్సాహం మాత్రం కోల్పోలేదు. న్యాయం కోసం సుదీర్ఘ పోరాటానికి మేము సిద్ధంగా ఉన్నాం. జమ్మూకశ్మీర్ ప్రజల పోరాటం కొనసాగుతుంది. ఓటమి ఎదురైతే వెనక్కి తగ్గాల్సిన అవసరం లేదు. తీర్పుపై న్యాయ నిపుణులతో చర్చిస్తాం. చట్టపరంగా ముందుకెళ్తాం

- ఒమర్, నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు

రాష్ట్రహోదా పునరుద్ధరించాలి

ఆర్టికల్ 370 రద్దుకు చట్టపరంగా ఆమోదం లభించింది. ఇక చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్, ముంబై నగరాలను కేంద్ర పాలిత ప్రాంతాలుగా మార్చకుండా కేంద్ర ప్రభుత్వాన్ని ఇక ఎవరూ అడ్డుకోలేరు. వాస్తవానికి ఆర్టికల్ 370 రద్దు వల్ల జమ్మూలోని డోంగ్రాలు, లద్దాఖ్‌లోని బౌద్ధులు ఎక్కువగా నష్టపోతారు. జమ్మూకశ్మీర్‌కు వెంటనే రాష్ట్రహోదా పునరుద్ధరించాలి. రాబోయే లోక్‌సభ ఎన్నికలతో పాటే అక్కడ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలి

- అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం

జాతీయ సమైక్యత బలోపేతం

ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మన జాతీయ సమైక్యతను బలోపేతం చేస్తుంది. ఈ ఆర్టికల్‌ను మేము మొదటి నుంచి వ్యతిరేకిస్తూనే ఉన్నాం. ఆర్టికల్ 370 రద్దుకు చట్టపరంగా మద్దతు లభించడం ఆహ్వానించదగ్గ పరిణామం. జమ్మూకశ్మీర్ ప్రజలకు ఇకపై ఎంతో మేలు జరుగుతుంది

- సునీల్ అంబేకర్, ఆర్‌ఎస్‌ఎస్

ఆ తీర్పునకు చట్టపరంగా విలువ లేదు

ఆర్టికల్ 370 విషయంలో భారత సుప్రీంకోర్టు తీర్పునకు చట్టపరంగా ఎలాంటి విలువ లేదు. భారత ప్రభుత్వం 2019 ఆగస్టు 5న ఏకపక్షంగా, చట్టవ్యతిరేకంగా తీసుకున్న చర్యలను అంతర్జాతీయ చట్టాలు, న్యాయ వర్గాలు గుర్తించడం లేదు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానాల ప్రకారం జమ్మూకశ్మీర్ ప్రజలకు స్వయం ప్రతిపత్తి అనే హక్కు ఉంది. ఆ హక్కును వారి నుంచి ఎవరూ బలవంతంగా లాక్కోలేరు. భారత సుప్రీంకోర్టు తీర్పును మేము తిరస్కరిస్తున్నాం.

పాక్ విదేశాంగ మంత్రి

ప్రజల ఆకాంక్షలను కేంద్రం నెరవేర్చాలి

జమ్మూకశ్మీర్‌కు తక్షణమే రాష్ట్రహోదా పునరుద్ధరించాలి. అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలి. ప్రభుత్వాన్ని ఎన్నుకొనే అవకాశాన్ని జమ్మూకశ్మీర్ ప్రజలకు కల్పించాలి. సుప్రీంకోర్టు తీర్పును కుణ్నంగా పరిశీలించాల్సి ఉంది. న్యాయస్థానం కొన్ని అంశాలను పక్కనపెట్టినట్లు కనిపిస్తోంది.

పి.చిదంబరం, అభిషేక్ సింఘ్వీ, కాంగ్రెస్

కోర్టు తీర్పు కలవరానికి గురిచేసింది

సుప్రీంకోర్టు తాజా తీర్పు కొంత కలవరానికి గురిచేసింది. ఈ తీర్పు పర్యావసానాలు దేశ రాజ్యాంగ సమాఖ్య నిర్మాణంపై తీవ్రస్థాయిలో ఉంటాయనడంలో సందేహం లేదు.

- సీపీఎం పొలిట్‌బ్యూరో



సోమవారం తీర్పు వెలువరిస్తున్న ధర్మాసనం సభ్యులు జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సూర్యకాంత్

ఆర్టికల్ 370

రద్దు సబబే

సుప్రీం చరిత్రాత్మక తీర్పు

న్యూఢిల్లీ: ఆర్టికల్ 370పై సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన రాజ్యాంగంలోని ఈ ఆర్టికల్‌ను రద్దు చేయడం సబబేనని స్పష్టం చేసింది. నరేంద్ర మోదీ ప్రభుత్వం 2019లో తీసుకున్న ఈ నిర్ణయాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ముక్త కంఠంతో సమర్థించింది. 370 ఆర్టికల్ రద్దు తాలూకు రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టేసింది. సోమవారం ఈ మేరకు ఏకగ్రీవంగా మూడు తీర్పులు వెలువరించింది. ఆర్టికల్ 370 కేవలం ఓ తాత్కాలిక ఏర్పాటు మాత్రమేనని, దాన్ని రద్దు చేసే పూర్తి అధికారాలు రాష్ట్రపతికి ఉన్నాయని సీజేఐ స్పష్టం చేశారు. ఈ మేరకు తనతో పాటు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.ఎస్.గవాయ్, జస్టిస్ సూర్యకాంత్ తరఫున ఆయన 352 పేజీల మెజారిటీ తీర్పు వెలువరించారు. లద్దాఖ్ ప్రాంతాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడం కూడా సబబేనని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని జమ్మూ కశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలుగా మారుస్తూ మోదీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ''జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలి. 2024 సెప్టెంబర్ 30లోగా అక్కడ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలి'' అని కేంద్రాన్ని సీజేఐ ఆదేశించారు. ఈ తీర్పును సమర్థిస్తూ న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ 121 పేజీలతో విడిగా తీర్పు ఇచ్చారు. ఈ రెండు తీర్పులతోనూ పూర్తిగా ఏకీభవిస్తూ జస్టిస్ సంజీవ్ ఖన్నా కూడా మరో తీర్పు వెలువరించారు. ఈ తీర్పును కేంద్రంలో మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానంలో మరో పెద్ద విజయంగా భావిస్తున్నారు. ప్రధానితో పాటు బీజేపీ తీర్పును సమర్థించగా పలు పార్టీలతో పాటు పలువురు నేతలు వ్యతిరేకించారు.

ప్రతి నిర్ణయాన్నీ సవాలు చేయలేరు

జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370ని 2019 ఆగస్టు 5న కేంద్రం రద్దు చేసింది. రాష్ట్ర హోదా రద్దు చేసి దాన్ని జమ్మూ కశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్టికల్ 370 రద్దును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో 23 పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై విచారణ అనంతరం ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం సెప్టెంబర్ 5న తీర్పును రిజర్వు చేసింది. ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ రాష్ట్రపతి జారీ చేసిన రాజ్యంగ ఆదేశం (సీఓ) 272లో జమ్మూ కశ్మీర్‌కు రాజ్యాంగంలోని అన్ని విధి విధానాలనూ వర్తింపజేశారు. ఆర్టికల్ 370లో పేర్కొన్న రాజ్యాంగ అసెంబ్లీ అనే పదాన్ని అసెంబ్లీగా మార్చారు. ఈ నిర్ణయాల చెల్లుబాటుపై ధర్మాసనం ప్రధానంగా విచారణ జరిపింది. జమ్మూ కశ్మీర్ విషయమై కేంద్రం తీసుకున్న ప్రతి నిర్ణయాన్నీ సవాలు చేయజాలరని తీర్పులో సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం అది భారతదేశంలో సంపూర్ణంగా విలీనమై అంతర్భాగంగా మారిందనడంలో ఏ సందేహానికీ తావు లేదని స్పష్టం చేశారు. ''ఆర్టికల్ 1 ప్రకారమే గాక ఆర్టికల్ 370ని బట్టి చూసినా జమ్మూ కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమే. అలాంటప్పుడు దానికి ప్రత్యేక సార్వభౌమాధికారమంటూ ఏమీ ఉండబోదు. హక్కుల విషయంలోనూ మిగతా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో అది సమానమే. అంతే తప్ప ప్రత్యేకతేమీ ఉండబోదు'' అని పునరుద్ఘాటించారు. జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామన్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ప్రకటించిన నేపథ్యంలో దాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించడం ఆర్టికల్ 3 ప్రకారం సరైందో కాదో తేల్చాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. ఆర్టికల్ 370 (1) (డి) కింద తనకున్న అధికారాలను వినియోగించేందుకు (నాటి) జమ్మూ కశ్మీర్ ప్రభుత్వ అంగీకారం తీసుకోవడం రాష్ట్రపతికి తప్పనిసరేమీ కాదని పేర్కొన్నారు. జమ్మూ కశ్మీర్ రాజ్యాంగ అసెంబ్లీ అనుమతి లేకుండా ఆర్టికల్ 370కి ఎలాంటి మార్పుచేర్పులూ చెల్లుబాటు కావని, రాజ్యాంగ అసెంబ్లీ 1957లోనే రద్దయినందున ఆర్టికల్ 370 శాశ్వతత్వం సంతరించుకుందని పిటిషనర్లు చేసిన వాదనను పూర్తిగా అసంబద్ధమన్నారు. అది కేవలం తాత్కాలిక ఏర్పా టేనని రాజ్యాంగంలోని పలు నిబంధనలను ఉటంకిస్తూ స్పష్టం చేశారు. దాన్ని రాజ్యాంగంలోని 21వ భాగంలో పొందుపరిచేందుకు కూడా అదే కారణమని వివరించారు.

> **ప్ర**జాస్వామ్యం, సమాఖ్య తత్వం మన రాజ్యాంగపు మౌలిక లక్షణాలైనా కొన్ని నిర్దిష్ట ఏకస్వామ్యపు లక్షణాలు కూడా అందులో ఇమిడే ఉన్నాయని ధర్మాసనం స్పష్టం చేసింది. ''వాటి ప్రకారం ఏ విషయంలోనైనా అంతిమంగా నిర్ణాయక అధికారాలు కేంద్రానికే దఖలు పడ్డాయి. కేంద్రపాలిత ప్రాంతాల ఏర్పాటు వంటివి
>
> ### అంతిమ అధికారం కేంద్రానిదే
>
> వాటిలో భాగమే'' అని సీజేఐ వివరించారు. ''కేంద్ర, రాష్ట్రాల మధ్య శాసన, కార్యనిర్వాహక అధికారాల విభజన, వాటి అమలులో రాష్ట్రాలకు ఇచ్చిన స్వతంత్రం ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసేవే. అయితే పలు కారణాల దృష్ట్యా రాష్ట్రంగా మనుగడ సాగించలేవని భావించిన ప్రాంతాలను కేంద్ర పాలిత ప్రాంతాలుగా మార్చే సంపూర్ణ అధికారాలు కేంద్రానికి ఉన్నాయి'' అని పేర్కొన్నారు.



సార్వభౌమత్వం ఉండదు

ఆర్టికల్ 370 ప్రకారం జమ్మూ కశ్మీర్‌కు అంతర్గత సార్వభౌమత్వం ఉంటుందన్న వాదనను కూడా ధర్మాసనం తోసిపుచ్చింది. 1947లో విలీనం సందర్భంగా రక్షణ, విదేశాంగ, సమాచార అంశాల్లో మాత్రమే జమ్మూ కశ్మీర్ సార్వభౌమాధికారాలను భారత ప్రభుత్వానికి నాటి రాజు హరిసింగ్ వదులుకున్నారన్న వాదనను కూడా కొట్టిపారేసింది. కేంద్రంతో ఇలాంటి ప్రత్యేక నిబంధనలున్న ఇతర రాష్ట్రాలు కశ్మీర్‌ను ఉదాహరణగా చూపుతూ తమకూ అంతర్గత సార్వభౌమత్వముందని వాదిస్తే పరిస్థితేమిటని సీజేఐ ప్రశ్నించారు. మన అసాష్టవ సమాఖ్య వ్యవస్థ స్వభావం ప్రకారం కొన్ని రాష్ట్రాలకు మిగతా వాటితో పోలిస్తే కొన్ని విషయాల్లో కాస్త స్వయం ప్రతిపత్తికి ఆస్కారముందని గుర్తు చేశారు. ''భారత రాజ్యాంగాన్ని సంపూర్ణంగా ఔదలదాలుస్తూ 1949 నవంబర్ 25న కశ్మీర్ విలీన ఒప్పందాన్ని దాని యువరాజు కరణ్‌సింగ్ బేషరతుగా ఆమోదించడంతోనే అది పూర్తిగా దేశంలో కలిసిపోయింది. కనుక జమ్మూ కశ్మీర్‌కు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఎప్పుడూ ఏ విధమైన అంతర్గత సార్వభౌమత్వమూ లేదు, ఉండబోదు. అక్కడి ప్రజలకూ ఇదే వర్తిస్తుంది'' అన్నారు. ''రెండు కారణాలతో ఆర్టికల్ 370 తెరపైకి వచ్చింది. ఒకటి జమ్మూ కశ్మీర్లో రాజ్యాంగ అసెంబ్లీ కొలువుదీరేదాకా దాకా అది మధ్యంతర ఏర్పాటుగా పని చేసింది. అలాగే నాడు అక్కడ నెలకొన్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో తాత్కాలిక ఏర్పాటుగా కూడా ఆర్టికల్ 370ని తీసుకొచ్చారు. అది శాశ్వతమేమీ కాదు. దాన్ని రద్దు చేసే అధికారం రాష్ట్రపతికి ఉంది'' అని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 30లోగా జమ్మూ కశ్మీర్‌లో ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాల్సిందిగా కేంద్ర ఎన్నికల సంఘానికి సీజేఐ సూచించారు.

కశ్మీర్లో మానవ హక్కుల హననంపై నిష్పాక్షిక దర్యాప్తు: జస్టిస్ కౌల్

సీజేఐ వెలువరించిన మెజారిటీ తీర్పుతో ఏకీభవిస్తూ జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ విడిగా తీర్పు వెలువరించారు. దశలవారీగా కశ్మీర్‌ను అభివృద్ధి తదితర అన్ని అంశాల్లోనూ ఇతర రాష్ట్రాల స్థాయికి తీసుకెళ్లడమే ఆర్టికల్ 370 ఉద్దేశమని స్పష్టం చేశారు. దాని రద్దు పూర్తిగా సబబేనని స్పష్టం చేశారు. జమ్మూ కశ్మీర్‌కు తగిలిన గాయాలు మానాల్సిన అవసరముందని జస్టిస్ కౌల్ తన తీర్పులో అభిప్రాయపడ్డారు. 1980ల నుంచి అక్కడ ప్రభుత్వపరంగా, ఇతరత్రా జరిగిన మానవ హక్కుల ఉల్లంఘనలపై స్వతంత్ర కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కేంద్రానికి సిఫార్సు చేశారు. అప్పటి దారుణాలపై అది నిష్పాక్షికంగా పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి నివేదిక సమర్పించాలన్నారు. కశ్మీర్ జస్టిస్ కౌల్ స్వస్థలం. ఈ నేపథ్యంలో తీర్పులో ఒక చోట 'కశ్మీరీలమైన మేము' అని కూడా ఆయన పేర్కొన్నారు. ''1947 నుంచీ దశాబ్దాల పాటు కశ్మీరీలు వేర్పాటు, ఉగ్రవాదాల బాధితులుగా ఉంటూ వస్తున్నారు. దాంతో తొలుత కశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాలను ఇతర దేశాలు ఆక్రమించాయి. 1980ల్లో వేర్పాటువాదం లోయలో కల్లోలం సృష్టించింది. అది వలసలకు దారి తీసింది. అవి స్వచ్ఛంద వలసలు కావు. సరిహద్దుల ఆవలి నుంచి వచ్చి పట్టమతిలేని మతోన్మాదాన్ని తాలలేక కశ్మీరీ పండిట్లు ప్రాణాలు కాపాడుకునేందుకు విధి లేక ఇల్లూవాకిలీ విడిచి మూకుమ్మడిగా వలస వెళ్లారు. దాంతో కశ్మీర్ తాలూకు సాంస్కృతిక విలువలే సమూలంగా మారిపోయాయి. దేశ సమగ్రత, సార్వభౌమత్వమే ప్రమాదంలో పడి సైన్యాన్ని రంగంలోకి దించాల్సిన పరిస్థితులు తలెత్తాయి. విదేశీ చొరబాట్లను అరికట్టి దేశ సార్వభౌమత్వాన్ని పరిరక్షించేందుకు సైన్యం చేపట్టిన చర్యలతో పరిస్థితులు మరో మలుపు తీసుకున్నాయి. తర్వాతి పరిణామాల్లో ఆడ, మగ, చిన్నా, పెద్దా అందరూ భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చింది. మూడు దశాబ్దాలు దాటినా నాటి అన్యాయాలను సరిదిద్దలేదు'' అంటూ ఆవేదన వెలిబుచ్చారు. ''అక్కడ పరిస్థితిని చక్కదిద్దడంతో పాటు కశ్మీర్ తాలూకు సామాజిక నిర్మాణాన్ని పునరుద్ధరించాల్సి ఉంది. తద్వారా కశ్మీరీలు సహనశీలత, పరస్పర గౌరవం సహజీవనం సాగించేలా చూడాలి'' అని పేర్కొన్నారు.

గట్టి కారణాలుంటేనే యూటీలు: జస్టిస్ ఖన్నా

రాష్ట్రాలను కేంద్రపాలిత ప్రాంతాలుగా మార్చడంపై జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆందోళన వెలిబుచ్చారు. ''ఈ చర్య విపరీత పరిణామాలకు దారి తీస్తుంది. సమాఖ్య తత్వానికి అడ్డంకిగా మారుతుంది. ప్రజలకు ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాన్ని లేకుండా చేస్తుంది'' అని అభిప్రాయపడ్డారు. అందుకే కేంద్రపాలిత ప్రాంతాన్ని ఏర్పాటు చేయాలంటే అందుకు సహేతుకమైన గట్టి కారణాలు ఉండి తీరాల్సిందేనని స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3లో పొందుపరిచిన నియమ నిబంధలను పూర్తిగా అనుసరిస్తూ మాత్రమే అందుకు పూనుకోవాలని సూచించారు. ఆర్టికల్ 370 అంశంపై వెలువరించిన విడి తీర్పులో జస్టిస్ ఖన్నా ఈ మేరకు పేర్కొన్నారు. దాని రద్దు సబబేనంటూ సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ వెలువరించిన తీర్పులతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నట్టు తెలిపారు. ఆర్టికల్ 370కి శాశ్వత లక్షణం లేదని స్పష్టం చేశారు. ''ఈ మేరకు సీజేఐ, జస్టిస్ కౌల్‌వెలువరించిన తీర్పులు గొప్ప పరిణతితో కూడుకున్నవి. సంక్లిష్టమైన న్యాయపరమైన అంశాలను సరళంగా వివరిస్తూ సాగాయి'' అని ప్రస్తుతించారు.

మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్

- బీజేపీ అధిష్టానం అనూహ్య నిర్ణయం
- రాష్ట్ర జనాభాలో 48 శాతం ఉన్న ఓబీసీ నేతకు పట్టం
- ఆయనను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్న బీజేపీ ఎమ్మెల్యేలు



భోపాల్: బీజేపీ అధిష్టానం అనూహ్య నిర్ణయం తీసుకుంది. అందరి అంచనాలను తలకిందులు చేస్తూ మధ్యప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా ఓబీసీ వర్గం నాయకుడు మోహన్ యాదవ్(58) పేరును ఖరారు చేసింది. ఈ విషయాన్ని మధ్యప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు వి.డి.శర్మ వెల్లడించారు. కేంద్ర పరిశీలకుల ఆధ్వర్యంలో బీజేపీ శాసనసభాపక్షం సోమవారం సాయంత్రం భోపాల్‌లో సమావేశమైంది. తమ నాయకుడిగా మోహన్ యాదవ్‌ను ఎన్నుకుంది. ఆయన పేరును ప్రస్తుత ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రతిపాదించారు. ఎమ్మెల్యేలంతా ఆమోదించారు. మోహన్ యాదవ్ ఇక రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం లాంఛనమే. ఆయన ఉజ్జయిని సౌత్ నియోజకవర్గం నుంచి వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రభుత్వంలో ఉన్నత విద్యా శాఖ మంత్రిగా పనిచేశారు. ముఖ్యమంత్రి పదవికి పోటీపడిన వారిలో తొలుత మోహన్ యాదవ్ పేరు లేదు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్)తో మొదటి నుంచి సంబంధాలు ఉండడం, రాష్ట్రంలో 48 శాతం జనాభా ఉన్న ఓబీసీ నేత కావడంతో బీజేపీ పెద్దలు ఆయనవైపు మొగ్గు చూపించినట్లు తెలుస్తోంది. బీజేపీ శాసనసభాపక్ష నేతగా మోహన్ యాదవ్ ఎన్నిక కావడంతో ముఖ్యమంత్రి పదవికి శివరాజ్‌సింగ్ చౌహాన్ రాజీనామా సమర్పించారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేలా పనిచేస్తానని యాదవ్ చెప్పారు. తనను ఎంపిక చేసినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతోపాటు పార్టీ అగ్రనేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కరడుగట్టిన హిందుత్వావాది

మోహన్ యాదవ్ విద్యార్థి దశ నుంచి నాయకుడిగా ఎదిగారు. కరడుగట్టిన హిందుత్వావాదిగా ముద్రపడ్డారు. కళాశాలల్లో 'రామచరిత మానస్'ను ఆప్షనల్ సబ్జెక్టుగా ప్రవేశపెడతామని 2021లో ప్రకటించారు. మోహన్ యాదవ్ 1965 మార్చి 25న ఉజ్జయినిలో జన్మించారు. 1982లో ఉజ్జయినిలోని మాధవ్ సైన్స్ కాలేజీలో జాయింట్ సెక్రెటరీగా ఎన్నికయ్యారు. 1984లో అదే కాలేజీలో ఉపాధ్యక్షుడిగా విజయం సాధించారు. ఎల్‌ఎల్‌బీ, ఎంబీఏ తోపాటు పీహెచ్‌డీ పూర్తిచేశారు. చిన్నప్పటి నుంచే ఆయనకు ఆర్‌ఎస్‌ఎస్‌తో అనుబంధం ఉంది. 1993 నుంచి 1995 దాకా ఆర్‌ఎస్‌ఎస్ ఆఫీసు బేరర్‌గా పనిచేశారు. తొలిసారిగా 2013లో ఉజ్జయిని సౌత్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2018, 2023లోనూ అక్కడి నుంచే విజయం సాధించారు. 2020లతో మొదటిసారిగా మంత్రి అయ్యారు. ఉజ్జయిని ప్రాంతం నుంచి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన మొట్టమొదటి నాయకుడు ఆయనే.

ఏమిటీ ఆర్టికల్ 370?

- ఆర్టికల్ 370 ప్రకారం జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హోదా ఉంటుంది.
- ప్రత్యేక రాజ్యాంగం, రాష్ట్ర పతాకం ఉంటాయి.
- అంతర్గత పాలన విషయంలో పూర్తి స్వయం ప్రతిపత్తి ఉంటుంది.
- కశ్మీర్‌పై భారత సార్వభౌమాధికారం రక్షణ, విదేశీ వ్యవహారాలు, కమ్యూనికేషన్ల వరకే పరిమితం.
- ఇతర రాష్ట్రాల ప్రజలు జమ్మూ కశ్మీర్‌లో ఆస్తులు, భూములు కొనుగోలు చేయలేరు.
- ప్రజల పౌరసత్వం, ఆస్తి యాజమాన్యం, ప్రాథమిక హక్కుల చట్టం మిగతా ప్రాంతాల వారికంటే భిన్నంగా ఉంటుంది.
- అక్కడ ఆర్థిక ఎమర్జెన్సీ ప్రకటించే అధికారం కేంద్రానికి లేదు.
- రక్షణ, విదేశాంగ, కమ్యూనికేషన్లు మినహా ఇతర చట్టాల అమలుకు అక్కడి రాజ్యాంగ అసెంబ్లీ ఆమోదం తప్పనిసరి.
- ఆర్టికల్ 370ని సవరించే, రద్దు చేసే అధికారం రాజ్యాంగ అసెంబ్లీకి ఉంది.
- కానీ రాజ్యాంగ అసెంబ్లీయే 1957లో రద్దయిపోయింది.
- దాంతో ఆర్టికల్ 370 రాజ్యాంగంలో శాశ్వత భాగమైయిందని, దాని రద్దు అధికారం కేంద్రానికి లేదని అక్కడి పార్టీలు వాదిస్తూ వస్తున్నాయి.

అమలు నుంచి రద్దు దాకా...

1947 అక్టోబర్ 26: భారతదేశ విభజన తర్వాత జమ్మూకశ్మీర్ స్వతంత్ర దేశంగా ఉండడానికే మహారాజా హరిసింగ్ మొగ్గు చూపారు. భారత్‌లో గానీ, పాకిస్తాన్‌లో గానీ విలీనం కాబోమని ప్రకటించారు. ఇంతలో పాకిస్తాన్ సైన్యం అండతో అక్కడి గిరిజనులు జమ్మూకశ్మీర్‌పై దండెత్తారు. మహారాజా హరిసింగ్ భారత ప్రభుత్వ సహకారాన్ని కోరారు. భారత్‌లో విలీనానికి అంగీకరించారు. కొన్ని షరతులతో విలీన ఒప్పందంపై సంతకం చేశారు.

1949 మే 27: రాజ్యాంగాన్ని రూపకల్పనకు ఏర్పాటైన రాజ్యాంగ సభ విలీన ఒప్పందం ప్రకారం ఆర్టికల్ 370 ముసాయిదాను ఆమోదించింది.

1949 అక్టోబర్ 17: జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తూ ఆర్టికల్ 370ని భారత రాజ్యాంగంలో చేర్చారు.

1951 మే 1: జమ్మూకశ్మీర్‌లో రాజ్యాంగ అసెంబ్లీని ఏర్పాటు చేస్తూ రాజకుమారుడు డాక్టర్ కరణ్ సింగ్ ఒక ప్రకటన విడుదల చేశారు.

1952: ఇండియా, జమ్మూకశ్మీర్ మధ్య సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి 'ఢిల్లీ అగ్రిమెంట్'పై భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, జమ్మూ కశ్మీర్ ప్రధానమంత్రి షేక్ అబ్దుల్లా సంతకం చేశారు.

1954 మే 14: రాష్ట్రపతి ఉత్తర్వు మేరకు ఆర్టికల్ 370 అమల్లోకి వచ్చింది.

1954 మే 15: జమ్మూకశ్మీర్‌లో శాశ్వత నివాసితుల హక్కుల విషయంలో రాష్ట్ర శాసనసభ చేసిన చట్టాలకు రక్షణ కల్పించడానికి రాష్ట్రపతి ఉత్తర్వు ద్వారా 'ఆర్టికల్ 35ఏ'ను భారత రాజ్యాంగంలో చేర్చారు.

1957 నవంబర్ 17: జమ్మూకశ్మీర్ రాజ్యాంగాన్ని ఆమోదించారు.

1958 జనవరి 26: జమ్మూకశ్మీర్‌కు సొంత రాజ్యాంగం అమల్లోకి వచ్చింది.

1965: జమ్మూకశ్మీర్‌లో ప్రధానమంత్రి, సదర్-ఇ-రియాసత్ పదవులను ముఖ్యమంత్రి, గవర్నర్‌గా అధికారికంగా మార్చారు.

2018 డిసెంబర్ 20: జమ్మూకశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన విధించారు.

2019 జూలై 3: రాష్ట్రపతి పాలనను మరోసారి పొడిగించారు.

2019 ఆగస్టు 5: ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది.

2019 ఆగస్టు 6: ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ అడ్వొకేట్ ఎం.ఎల్.శర్మ సుప్రీంకోర్టులో కేసు వేశారు. తర్వాత మరికొన్ని పిటిషన్లు దాఖలయ్యాయి.

2019 ఆగస్టు 9: జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం–2019ను పార్లమెంట్ ఆమోదించింది. రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించారు.

2019 సెప్టెంబర్ 19: ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ కోసం ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనాన్ని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసింది.

2023 ఆగస్టు 2: పిటిషన్లపై సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ మొదలైంది.

2023 సెప్టెంబర్ 5: మొత్తం 23 పిటిషన్లపై ధర్మాసనం విచారణ పూర్తి చేసింది. తుది తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు వెల్లడించింది.

2023 డిసెంబర్ 11: ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ సుప్రీంకోర్టు కీలక తీర్పు ప్రకటించింది. 2024 సెప్టెంబర్ 30లోగా అక్కడ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

సరైన సమయంలో రాష్ట్ర హోదా: అమిత్ షా

కశ్మీర్ బిల్లులకు రాజ్యసభ ఆమోదం

న్యూఢిల్లీ: ఉగ్రవాద జాడలు లేని.. నవీన, అభివృద్ధి చెందిన కశ్మీర్ నిర్మాణం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హయాంలోనే మొదలవనుందని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను అనువైన సమయంలో పునరుద్ధరిస్తామని సోమవారం రాజ్యసభలో ప్రకటించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే) భారత్‌లో అంతర్భాగమని, దాని నెవరూ లాక్కోలేరని స్పష్టం చేశారు.

భారతీయుల కశ్మీర్.. కశ్మీరీల భారత్

కశ్మీర్ కోసం పోరాడేవారు ఎవరూ లేరంటూ ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా చేసిన వ్యాఖ్యలపై హోం మంత్రి అమిత్ షా దీటుగా స్పందించారు. 'ఆయన తన కోసం మాత్రమే మాట్లాడుకుంటారు. మనకోసం ఎందుకు మాట్లాడతారు? మనం ఎల్లప్పుడూ కశ్మీర్ పక్షమే. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, ద్వారక నుంచి ఈశాన్యం వరకు.. ప్రాంతమంతా మనందరిదీ. అదే విధంగా, కశ్మీర్ భారతీయులందరిది, కశ్మీరీలందరిది భారత్' అంటూ సమాధానమిచ్చారు. అంతకుముందు జమ్మూకశ్మీర్ పునర్ విభజన (సవరణ) బిల్లు, జమ్మూకశ్మీర్ రిజర్వేషన్(సవరణ)బిల్లులపైచర్చ జరిగింది. గత వారం లోక్‌సభ ఆమోదించిన ఆ బిల్లులను రాజ్యసభ కూడా మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఈ సందర్భంగా జరిగిన చర్చకు అమిత్ షా సమాధానమిచ్చారు. హోం మంత్రి వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.

బహిష్కరణపై సుప్రీంలో మహువా పిటిషన్

న్యూఢిల్లీ: తనను లోక్‌సభ నుంచి బహిష్కరించడాన్ని సవాల్ చేస్తూ టీఎంసీ నేత మహువా మొయిత్రా సోమవారం సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఓ వ్యాపారవేత్త నుంచి ముడుపులు తీసుకుని, పార్లమెంట్‌లో ప్రశ్నలడిగినట్లు వచ్చిన ఆరోపణలపై ఎథిక్స్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ నెల 8వ తేదీన లోక్‌సభలో వాడివేడిగా చర్చ జరగడం, అనైతిక ప్రవర్తనకుగాను మహువాపై బహిష్కరణ వేటువేస్తూ సభ మూజువాణి ఓటుతో ఒక తీర్మానాన్ని ఆమోదించిన విషయం తెలిసిందే. మహువా మాత్రం తనపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. తాజాగా, ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

జార్ఖండ్ సీఎం సోరెన్‌కు ఈడీ మళ్లీ సమన్లు

రాంచీ: జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు సోమవారం మరోసారి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సమన్లు జారీ చేసింది. భూకుంభకోణం కేసులో మనీల్యాండరింగ్ ఆరోపణలపై ప్రశ్నించేందుకు ఈ నెల 12న రాంచీలోని ప్రాంతీయ కార్యాలయానికి రావాలని అందులో కోరింది. ఈ కేసులో ఆయనకు ఆగస్ట్ 14వ తేదీ మొదలుకొని సమన్లు పంపడం ఇది ఆరోసారని ఈడీ వర్గాలు తెలిపాయి. ఒక్కసారి కూడా విచారణకు ఆయన హాజరుకాలేదని పేర్కొన్నాయి.

జడ్జీలు ఆస్తులు వెల్లడించాలి

రాజ్యసభలో బీజేపీ ఎంపీ సుశీల్ కుమార్ మోదీ

న్యూఢిల్లీ: మంత్రులు, ప్రభుత్వ అధికారుల మాదిరిగానే హైకోర్టులు, సుప్రీంకోర్టుల న్యాయమూర్తులు కూడా తమ ఆస్తుల వివరాలను బహిర్గతం చేయడం తప్పనిసరిగా మార్చాలని బీజేపీ ఎంపీ సుశీల్‌కుమార్ మోదీ ప్రభుత్వాన్ని కోరారు. ఇందుకోసం ప్రస్తుతమున్న చట్టాన్ని మార్చడం లేదా కొత్తగా చట్టాన్ని తీసుకురావాలని ఆయన సూచించారు. రాజ్యసభ జీరో అవర్‌లో సోమవారం ఈ అంశాన్ని ప్రస్తావించారు.

మనీశ్ సిసోడియా కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: ఆప్ నేత మనీశ్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీని ప్రత్యేక కోర్టు వచ్చే జనవరి 10వ తేదీ వరకు పొడిగించింది. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో మనీ ల్యాండరింగ్ ఆరోపణలపై సీబీఐ అధికారులు ఈ ఏడాది ఫిబ్రవరి 26న అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మార్చి 9న ఈడీ మనీశ్ సిసోడియాను అదుపులోకి తీసుకుంది.

సాక్షి హైదరాబాద్

మంగళవారం ॥ 12 ॥ డిసెంబర్ ॥ 2023



ఆ లాకప్ డెత్‌తోనే ఈ కష్టాలు!
బెంగళూరులో రెండున్నరేళ్ల క్రితం జరిగిన ఓ లాకప్‌డెత్ కారణంగా ఆ నగరం ఇప్పుడు డ్రగ్ పెడ్లర్స్, సప్లయర్లకు అడ్డాగా మారిందని మన రాష్ట్ర పోలీస్ విభాగం గుర్తించింది. -8లో



రవాణా కార్మికులకు న్యాయం చేయాలి
మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్ల ఆదాయానికి గండి పడుతోందని, ఈ రంగంలోని కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ నేతలు కోరారు. -8లో

గంజాయి పట్టివేత



గంజాయి అక్రమ రవాణా చేస్తున్న పాత నేరస్తుడిని మలక్‌పేట పోలీసులు అరెస్ట్ చేసి అతడి నుంచి 7 కిలోల గంజాయి, రూ. 60 వేల నగదు, కారు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. -8లో



సమస్యలు విన్నవించేందుకు ప్రజాభవన్‌కు వచ్చిన దివ్యాంగులు



వెల్లువలా వినతులు

ప్రజాభవన్‌లో సోమవారం ప్రజావాణి కొనసాగింది. ఉదయం ఏడు గంటల నుండే వివిధ ప్రాంతాల నుండి ప్రజలు వినతులు పట్టుకుని వచ్చారు. రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి శ్రీధర్‌బాబు రెండు గంటలపాటు వినతులు స్వీకరించారు. అనంతరం ఉన్నతాధికారులు ఫిర్యాదులు స్వీకరించారు. వివరాలను కంప్యూటర్లలో నమోదు చేశారు. బాధితుల ఫోన్ నెంబర్లు తీసుకుని సమాచారం ఇస్తామని చెబుతున్నారు.

– పంజగుట్ట



వినతులు స్వీకరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు



కుటుంబ సభ్యులతో వచ్చిన దివ్యాంగుడు

న్యూస్‌రీల్

పడిపోయిన టమాటా ధర

- నగర మార్కెట్‌కు పెరిగిన దిగుమతి

సాక్షి,సిటీబ్యూరో: గతవారం రూ.50–60 పైగా ధర పలికిన టమాటా ధరలు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టాయి. సోమవారం బోయిన్‌పల్లి మార్కెట్‌లో ధర కేవలం రూ. 10–15 ఎవరకు పలకడంతో రిటైల్ మార్కెట్‌లో ధరల తగ్గుదల నమోదైంది. రూ.60 వరకు పలికి టమాటా ధర ఒక్కసారిగా భారీగా తగ్గడంతో వినియోగదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జంటనగరాల్లోని గుడిమల్కాపూర్, బోయిన్‌పల్లి, మోండామార్కెట్, మాదన్నపేట మార్కెట్లతో పాటు ఎర్రగడ్డ, మెహిదీపట్నం, ఫలక్‌నుమా, కూకట్‌పల్లి, ఆల్వాల్, ఎల్‌బీనగర్, వనస్థలిపురం వంటి ప్రధాన రైతుబజార్లలోనూ టమాటా దిగుమతులు పెరిగాయి. నగరానికి 60 నుంచి 80 లారీల టమాటా దిగుమతి అవుతుందని వ్యాపారులు తెలిపారు. హోల్‌సేల్ మార్కెట్‌లోనే కిలో రూ. 10 నుంచి 15 వరకు పలుకుతుండగా రిటైల్ మార్కెట్‌లో మాత్రం రూ. 20 నుంచి 30 వసూలు చేస్తున్నారు. ఆదివారం నగర మార్కెట్లకు దాదాపు 500 టన్నుల టమాటా దిగుమతి అయినట్లు మార్కెటింగ్ శాఖ లెక్కలు చెబుతున్నాయి. రోజు ఇదే మోతాదులో టమాటా దిగుమతి అయితే ధరలు మరింత తగ్గుతాయని మార్కెట్ వర్గాల అంచనా. మరోవైపు ప్రస్తుతం నగరంలో ధరలు ఎక్కువగా కావడంతో సామాన్యుల వినియోగం కూడా తగ్గింది. దీంతో డిమాండ్ కూడా కాస్త తగ్గిందని రానున్న రోజుల్లో ధరలు మరింత తగ్గుతాయని వ్యాపారులు అంటున్నారు.

రేపు తాగునీటి సరఫరాలో అంతరాయం

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరానికి తాగునీరు సరఫరా చేసే కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లై పథకం ఫేజ్–3లో కోదండాపూర్ పంపింగ్ స్టేషన్ వద్ద పైపులైన్‌కు ఏర్పడిన భారీ లీకేజీ మరమ్మతు పనుల నేపథ్యంలో ఈ నెల 13 వ తేదీ బుధవారం ఉదయం 5 గంటల నుంచి 14వ తేదీ గురువారం ఉదయం 5 గంటల వరకు 24 గంటలు పలు రిజర్వాయర్ల పరిధిలోని ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు జలమండలి అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని శాస్త్రిపురం, బండ్లగూడ, భోజగుట్ట, షేక్‌పేట్, ఆళ్లబండ, జూబ్లీహిల్స్, ఫిల్మ్ నగర్, ప్రశాసన్ నగర్, తట్టిఖానా, లాలాపేట్, సాహెబ్ నగర్, ఆటోనగర్, సరూర్‌నగర్, వాసవి రిజర్వాయర్, సైనిక్‌పురి, మౌలాలి, స్నేహపురి, కైలాసగిరి, దేవేంద్ర నగర్, గచ్చిబౌలి, మాదాపూర్, అయ్యప్ప సొసైటీ, కావురి హిల్స్, మధుబన్, దుర్గానగర్, బుద్వేల్, సులేమా నగర్, గోల్డెన్ హైట్స్, 9 నంబర్, కిస్మత్ పూర్, గంధంగూడ, బోడుప్పల్, మల్లికార్జుననగర్, మానిక్ చంద్, చెంగిచెర్ల, భరత్ నగర్, పీర్జాదిగూడ, ధర్మసాయి తదితర ప్రాంతాలలో నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. ఈ ప్రాంతాల వాసులు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలన్నారు.

19 నుంచి హైలైఫ్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్


వెంకటేశ్వరకాలనీ: క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి, వివాహాది శుభకార్యాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన డిజైనరీ దుస్తుల హైలైఫ్ ఎగ్జిబిషన్ ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు మూడు రోజుల పాటు హెచ్ఐసీసీ నోవాటెల్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన సన్నాహక ప్రదర్శన సోమవారం బంజారాహిల్స్ రోడ్ నెం.10లో నిర్వహించారు. పలువురు మోడల్స్ ఈ ప్రదర్శనలో ఉంచబోయే దుస్తులు, ఆభరణాలు ధరించి ఆకట్టుకున్నారు. దేశ వ్యాప్తంగా ప్రఖ్యాత డిజైనర్లు తమ ఉత్పత్తులను ఇందులో ప్రదర్శించబోతున్నారన్నారు. లైఫ్ స్టైల్ వేర్, బ్రైడల్ వేర్, డిజైనరీ వేర్, యాక్సరీస్, జ్యువెలరీ ఈ ప్రదర్శనకే హైలెట్‌గా నిలవబోతున్నాయని అన్నారు.



పాతబస్తీకి మెట్రోపై 'కొత్త' ఆశలు

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అడ్డంకులు తొలగేనా..

- త్వరగా పనులు ప్రారంభించాలని కోరుతున్న స్థానికులు
- గతంలో పెద్దఎత్తున ఆందోళనలు
- జేఏసీకి తోడు మజ్లిస్ పార్టీ ప్రయత్నించినా..ఫలించని మెట్రో



చార్మినార్: పాతబస్తీ ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్న మెట్రో రైలుపై ఇప్పుడు ఆశలు చిగురిస్తున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో ఇప్పుడైనా అడ్డంకులు తొలగి మెట్రోకు మార్గం సుగమం అవుతుందని భావిస్తున్నారు. పాతబస్తీ నుంచి వెంటనే మెట్రో రైలు ప్రాజెక్ట్ పనులను ప్రారంభించాలని స్థానికులు గట్టిగా కోరుతున్నారు. గతంలో ఈ అంశంపై పెద్ద ఎత్తున నిరసనలు కూడా వెల్లువెత్తాయి. మెట్రో రైలు సాధన కోసం ఏర్పడిన ఓల్డ్ సిటీ మెట్రో రైల్ జాయింట్ యాక్షన్ కమిటీ గత కొన్నేళ్లుగా సైలెంట్ అయ్యింది. గతంలో మెట్రో కోసం ఆందోళనలను ఉధృతం చేసిన జేఏసీ ఈ విషయాన్ని పక్కన పెట్టింది. మజ్లిసేతర పార్టీలన్నీ ఏకమై 2017 నవంబర్ 21న నాయకులందరూ జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పాటయ్యారు. అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్‌తో పాటు అన్ని పార్టీల నాయకులూ ఈ జేఏసీలో ఉండి మెట్రోను సాధించుకోవడానికి ఆందోళన చేపట్టారు. మెట్రో రైలు మేనేజింగ్ డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసి పాతబస్తీకి మెట్రో అవసరాన్ని, ప్రాధాన్యతను వివరించారు. సమావేశాలు, నిరసన దీక్షలు, నిరసన ర్యాలీలు కొనసాగించారు. ఇంతలో 2018లో ఎన్నికలు రావడంతో సైలెంట్ అయ్యారు. రెండోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఇక పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు మారింది. ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినందున మళ్లీ కదలిక వస్తుందని అక్కడి నేతలు భావిస్తున్నారు.

ఈసారి తప్పనిసరిగా..

- 2018లో రెండోసారి కేసీఆర్ సీఎం అయిన తర్వాత మధ్యమధ్యలో మెట్రో రైలు ఎండీకి వినతి పత్రాలు అందజేసి పాతబస్తీకి మెట్రో రైలు తీసుకురావాలని కోరారు.
- అలాగే హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో పాటు మజ్లిస్ పార్టీ ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఒవైసీలు కూడా పాతబస్తీలో మెట్రో రైలు పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు.
- ఒకటి రెండు సార్లు సంబంధిత అధికారులతో కలిసి పాతబస్తీలో పర్యటనలు సైతం నిర్వహించారు. దీంతో ఇక పాతబస్తీలో మెట్రో వచ్చేసింది అనే భ్రమ కల్పించారు.
- మళ్లీ 2023 ఎన్నికల వచ్చాయి. ఎన్నికల ప్రచారం సందర్భంగా మెట్రో రైలు ప్రస్తావన వచ్చింది.
- ఫలితాలు వెలువడి తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే పాతబస్తీలో మెట్రో పనులు ప్రారంభమవుతాయని పాతబస్తీ చార్మినార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్ హామీ ఇచ్చారు.
- ప్రస్తుతం ఎన్నికలు ముగిసి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం..పాతబస్తీలో తిరిగి మజ్లిస్ పార్టీ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా విజయం సాధించడంతో ఇప్పుడైనా మెట్రో పనులకు అడ్డంకులు తొలగిపోతాయని..పాతబస్తీ ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఎన్నికల తతంగం పూర్తికావడంతో...

- ప్రస్తుతం ఎన్నికల తతంగం పూర్తికావడంతో రాజకీయ పార్టీలకు అతీతంగా పాతబస్తీలోని నాయకులు, మేధావులు, యువకులు, విద్యార్థులు, సీనియర్ సిటిజన్లు.. ఇలా ప్రతిఒక్కరూ పాతబస్తీ నుంచి మెట్రో రైల్ కారిడార్ పనులను వెంటనే ప్రారంభించాలని ముక్త కంఠంతో కోరుతున్నారు.
- పాతబస్తీలో వ్యాపార అభివృద్ధితో పాటు ఇక్కడి పర్యాటక స్థలాలను సందర్శించడానికి ప్రపంచ పర్యాటకులకు మెట్రోరైలు ఎంతో మేలు చేస్తుందంటున్నారు.
- ముందుగా ప్రకటించినట్లుగానే మెట్రో రైల్ కారిడార్ పనులను దారుషిఫా నుంచి మీరాలంమండి ద్వారా ఫలక్‌నుమా వరకు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ఫలక్‌నుమా నుంచి ఇమ్లిబన్ వరకు..

- పాతబస్తీలో 4.2 కిలో మీటర్ల దూరానికి మెట్రో పనులు ప్రారంభించాల్సి ఉంది.
- పాతబస్తీ ఫలక్‌నుమా నుంచి ఇమ్లిబన్ బస్ డిపో ద్వారా సికింద్రాబాద్ జేబీఎస్ వరకు ఉండే ఈ మెట్రో కారిడార్ పనుల్లో కేవలం ఫలక్‌నుమా నుంచి ఇమ్లిబన్ వరకు మాత్రమే పనులు ఇంకా ప్రారంభం కాలేదు.
- గతంలో పాతబస్తీలో మెట్రో అలైన్‌మెంట్‌ను మార్చాలనే ఫిర్యాదులు అందడంతో పనులు ఇంకా ప్రారంభించలేకపోతున్నామని సంబంధిత మెట్రో అధికారులు గతంలో చెప్పారు.
- నగరంలోని ఇతర కారిడార్లలో మెట్రో రైలు పరుగులు తీస్తుండగా.. పాతబస్తీలో దాని ఊసే లేదని పాతబస్తీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ఎట్టకేలకు ఎన్నికల నేపథ్యంలో మీరాలంమండి, దారుషిఫా తదితర ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ చేపట్టారు.

వసూళ్ల కోసం బల్దియా పరుగో పరుగు!

- సిబ్బంది జీతాలకూ కటకటే
- ఆస్తిపన్ను వసూళ్లపై సీరియస్‌గా దృష్టి

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీలో నిధుల కటకట ఏర్పడింది. ఎన్నికల నేపథ్యంలో ఆస్తిపన్ను వసూళ్లు చేసే బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లను ఎన్నికల విధుల్లో నియమించడంతో కలెక్షన్లు తగ్గాయి. ప్రజలు తమంతట తాముగా చెల్లించడం ద్వారా వస్తున్న ఆస్తిపన్ను మినహా బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ల ద్వారా వసూలు చేసే ఆస్తిపన్ను తగ్గింది. అంతేకాకుండా ఆస్తిపన్ను చెల్లించాల్సిన యజమానుల్లో సింహభాగం ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్ను ఇప్పటికే చెల్లించారు. దీంతో పాటు ఎన్నికల సమయమైనందున టౌన్‌ప్లానింగ్ విభాగానికి భవన నిర్మాణ అనుమతుల ద్వారా వచ్చే ఆదాయం తగ్గింది. ఇలా వివిధ కారణాలతో జీహెచ్‌ఎంసీ ఖజానా దిగజారిపోయింది. దీంతో, ఈనెల ఇప్పటి వరకు కూడా సిబ్బందికి జీతాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆస్తిపన్ను వసూళ్ల కోసం ఉన్నతాధికారులు బిల్‌కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లను పురమాయించడంతో వారు ఉరుకులు పరుగులు తీస్తున్నారు. ఇప్పటి దాకా ఎన్నికల విధుల్లో ఉన్న వారికి ఎన్నికలు ముగియగానే కలెక్షన్ల పనులప్పగించారు.

ఆదాయం తగ్గలేదు..

వాస్తవానికి జీహెచ్‌ఎంసీకి ఆస్తిపన్ను ద్వారా లభించే ఆదాయం తగ్గలేదు. వివిధ ప్రాజెక్టులు, పనుల కోసం చేసిన అప్పుల చెల్లింపులకే ఎక్కువభాగం నిధులు ఖర్చవుతున్నందునే ఈ పరిస్థితి తలెత్తినట్లు తెలుస్తోంది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ మొదటి వారం వరకు రూ. 1015 కోట్ల మేర ఆస్తిపన్ను వసూలు కాగా, ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్ మొదటి వారం వరకు రూ.1170 కోట్లకు పైగా వసూలైంది. కానీ ప్రాజెక్టు పనుల వ్యయమే మోయలేని భారంగా మారడంతో ఈ పరిస్థితి ఎదురైనట్లు జీహెచ్‌ఎంసీ వర్గాలు చెబుతున్నాయి. కొత్త ప్రభుత్వం బల్దియాపై పడిన మోయలేని భారాన్ని తగ్గించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

కాసుల వేట



గత సంవత్సరం ఆదుకున్న ఓటీఎస్

గత సంవత్సరం (2022–23) భారీ ఆస్తిపన్ను బకాయిదారులకు కల్పించిన ఒన్‌టైమ్ సెటిల్‌మెంట్(ఓటీఎస్) వల్ల ఖజానాకు ఇబ్బందులు తప్పాయి. ఆ స్కీమ్‌వల్ల రూ.170 కోట్లకు పైగా వసూలు కావడంతో గత సంవత్సరం ఇలాంటి పరిస్థితి ఎదురవలేదు. దాంతోపాటు ట్యాక్స్ సెక్షన్ సిబ్బంది సైతం వసూళ్లు చేశారు. గతంలో జీతాల చెల్లింపులకు ఇబ్బందులు ఎదురైన సమయంలో సచివాలయంలోని ఉన్నతాధికారులను, మంత్రిని సంప్రదించడం ద్వారా ఏదోరకంగా నిధులు సమకూర్చేవారు. ప్రస్తుతం ఎన్నికల సమయం కావడం, ఎవరి పనుల్లో వారు బిజీగా ఉండటం, తదితర కారణాలతో ఆ అవకాశం లేకుండా పోయింది.

బస్సులు పెంచుతాం

ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడి

- 'ఉచితం' అమలుపై క్షేత్రస్థాయిలో పరిశీలన
- జేబీఎస్‌లో ఆకస్మిక తనిఖీలు
- సిటీబస్సులో మెట్టుగూడ వరకు ప్రయాణం
- పెరిగిన రద్దీతో బస్సుల సంఖ్య పెంచనున్నట్లు వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పిస్తూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' పథకం అమలు తీరుపై ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈమేరకు ఆయన జూబ్లీబస్‌స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి మహిళా ప్రయాణికుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు ఉచిత ప్రయాణ సదుపాయం ఎంతో బాగుందని, చార్జీల భారం తప్పిందని పలువురు మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. జేబీఎస్–ప్రజ్ఞాపూర్, జేబీఎస్–జనగామకు వెళ్లే పల్లె వెలుగు బస్సుల్లో, బాన్సువాడకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సులో ఎండీ మహిళా ప్రయాణికులతో మాట్లాడారు. అనంతరం జేబీఎస్ నుంచి రామంతాపూర్ వెంకట్ రెడ్డి నగర్‌కు వెళ్లే (రూట్ నంబర్ 18 వీ/జే) సిటీ ఆర్డినరీ బస్సులో ఆయన మెట్టుగూడ వరకు పయనించారు. ఆ బస్సులో మహిళా ప్రయాణికులకు సజ్జనార్ స్వయంగా జీరో టికెట్లను అందజేశారు.

అనంతరం ఎండీ మాట్లాడుతూ, మహాలక్ష్మి–మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యానికి మంచి స్పందన వస్తోందని అన్నారు. మహిళలకు ప్రయాణ భారాన్ని తగ్గించేందుకు అందుబాటులోకి తెచ్చిన ఈ పథకాన్ని.. మహిళలు, బాలికలు, విద్యార్థినులు, థర్డ్ జెండర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

బస్సుల పెంపు..

మహిళా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీఎస్ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ఉచిత బస్ ప్రయాణ పథకం అమలుపైన మార్గదర్శకాలను విడుదల చేసి 40 వేల మంది సిబ్బందికి అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించే మహిళలందరూ స్థానికతను నిర్ధారించుకునేందుకు తమ ఆధార్ కార్డులను సిబ్బందికి చూపించి సహకరించాలని కోరారు. ఉచిత ప్రయాణ సౌకర్యం ప్రవేశపెట్టగానే రద్దీ పెరిగిందని, అందుకు అనుగుణంగా బస్సులను నడిపేందుకు ప్రణాళికలను రూపొందించామని చెప్పారు. రద్దీ సమయాల్లో ప్రయాణికులు కొంత సంయమనం పాటించాలని కోరారు. ఆర్టీసీ సేవల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (గ్రేటర్ హైదరాబాద్ జోన్) వెంకటేశ్వర్లు, రంగారెడ్డి, సికింద్రాబాద్ ఆర్ఎంలు శ్రీధర్, ఖుష్రోషా ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

కాల్ సెంటర్‌కు ఫోన్ చేయండి..

ప్రయాణికులకు 24 గంటల పాటు అందుబాటులో ఉండే సంస్థ కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని సజ్జనార్ చెప్పారు. ప్రయాణంలో ఇబ్బందులపైన ఫోన్ :040–69440000, 040–23450033 నెంబర్‌లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రయాణికుల ఫిర్యాదులు, సూచనలు, సలహాలకనుగుణంగా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.



మహిళలకు ఫ్రీ టికెట్ జారీ చేస్తున్న సజ్జనార్

స్టేట్‌హోంను సందర్శించిన మంత్రి సీతక్క



మహిళలతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

శ్రీనగర్‌కాలనీ: మహిళలకు, చిన్నారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం మధురానగర్ స్టేట్‌హోమ్‌ను ఆమె సందర్శించారు. అక్కడి వసతులను, పలు అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కమిషనర్‌తో పాటు ఉన్నతాధికారులతో సమావేశమై పలు విషయాలపై చర్చించారు. పిల్లల ఎదుగుదల, మహిళల రక్షణ, ప్రెగ్నెంట్ ఉమెన్స్ అవసరాలు, పేదరిక నిర్మూలన, అంగన్‌వాడీ సెంటర్లతో పాటు వివిధ అంశాలపై చర్చించామని, మార్పును తప్పక తీసుకువస్తామని మంత్రి పేర్కొన్నారు. మహిళలు, పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధను తీసుకొని మంచి ఫలితాలు సాధించాలని అధికారులను కోరారు.

జాతీయ టీటీ పోటీలకు తెలంగాణ జట్ల ప్రకటన

సాక్షి, హైదరాబాద్: జాతీయ సీనియర్, అంతర్ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్‌లో పాల్గొనే తెలంగాణ పురుషుల, మహిళల జట్లను ప్రకటించారు. ఈ పోటీలు ఈనెల 16 నుంచి 22 వరకు హరియాణాలోని పంచ్‌కులాలో జరుగుతాయి. పురుషుల జట్టుకు చంద్రచూడ్, మహిళల జట్టుకు నైనా జైస్వాల్ నాయకత్వం వహిస్తారని తెలంగాణ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ సంఘం (టీఎస్‌టీటీఏ) సెక్రటరీ నాగేందర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పురుషుల జట్టు: చంద్రచూడ్ (కెప్టెన్), మొహమ్మద్ అలీ, వన్ష్ సింఘాల్, అలీ మొహమ్మద్, సంతోష్ కుమార్, అమన్ (కోచ్). మహిళల జట్టు: నైనా జైస్వాల్ (కెప్టెన్), వరుణి జైస్వాల్, భవిత, ప్రణీత, దేవిశ్రీ యాదవ్, వేణుగోపాల్ (కోచ్ కమ్ మేనేజర్).

కొనసాగుతారా?

గ్రేటర్ పరిధిలోని ముగ్గురు కలెక్టర్లపై నిర్ణయం ఏంటో?

- కొత్త ప్రభుత్వం ఏర్పాటు నేపథ్యంలో చర్చోపచర్చలు





సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు జిల్లాల కలెక్టర్లు వారి స్థానాల్లో కొనసాగుతారా? లేక బదిలీ అవుతారా అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. కొత్త ప్రభుత్వం వారిని కొనసాగిస్తుందా లేక ఇతర ప్రాంతాలకు పంపిస్తుందా అన్న చర్చ రాజకీయ వర్గాలతో పాటు సాధారణ ప్రజల్లోనూ నడుస్తోంది. ఎన్నికల బదిలీల్లో భాగంగా గ్రేటర్ పరిధిలోని మేడ్చల్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న అమయ్‌కుమార్‌ను బదిలీ చేశారు. ఆయన స్థానంలో గౌతమ్ పాత్రుకు బాధ్యతలు అప్పగించారు. అలాగే రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా వ్యవహరిస్తున్న హరీష్‌పై కూడా ఈసీ కన్నెర్ర జేసింది. దీంతో ఆయనను బదిలీ చేస్తూ.. భారతి హోళికేరిని నియమించింది. కాగా, అంతకు ముందే ఎన్నికల బదిలీల్లో భాగంగా ఖాళీగా ఉన్న హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా అనుదీప్ దురిశెట్టి నియమించారు. తాజాగా ఎన్నికల ఘట్టం ముగిసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానే కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వంలో నియమితులైన వీరిని తిరిగి అదే స్థానాల్లో కొనసాగిస్తారా ? లేక వేరే వారిని రప్పిస్తారా అన్నది అంతుపట్టడం లేదు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో భూములకు సంబంధించిన అవకతవకలు, అక్రమాలు ఎక్కువ. ఆ జిల్లాలు రాజధానిలో భాగమై ఉండటంతో భూముల ధరలు బంగారాన్ని మించిపోవడంతో భూ కబ్జాదారులు, భూ తగాదాలు ఎక్కువే. వాటిని ఆసరా చేసుకొని రెండు జిల్లాల్లోని రెవెన్యూ అధికారులు అవకతవకలకు పాల్పడి భారీగా ఆస్తులు కూడబెట్టుకున్నారనే ఆరోపణలున్నాయి. ధరణి అవకతవకలు సైతం ఈ జిల్లాల్లో ఎక్కువే. ఈ నేపథ్యంలో ప్రక్షాళన చర్యల్లో భాగంగా ఎక్కువ కాలం వేచి చూడకుండా గత ప్రభుత్వ హయాంలో నియమితులైన వారిని వెంటనే మార్చి తమకు అనుకూలురైన కలెక్టర్లను ప్రభుత్వం నియమించుకుంటుందా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

పార్లమెంట్ ఎన్నికల వరకు కొనసాగింపు?

ఇదిలా ఉండగా, త్వరలోనే పార్లమెంట్ ఎన్నికలు కూడా జరగనున్నందున ఆ ఎన్నికల వరకు కూడా ప్రస్తుతమున్న వారినే కొనసాగించవచ్చునని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. వేరేవారిని తీసుకోవాలనుకున్నా ఎన్నికల నిబంధనలు పరిగణనలోకి తీసుకోవాల్సి ఉండటం, తదితర అంశాలను ప్రస్తావిస్తున్నారు.

బల్దియా కమిషనర్ సైతం..

జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ సైతం ఇక్కడ ఎంతకాలం ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది. మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్ విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పే ఆయనకు సైతం వర్తిస్తుందని చెబుతున్నారు. ఆ లెక్కన ఆయన ఏపీకి వెళ్లాల్సి ఉంటుంది. అందుకు ఎంత సమయం పడుతుందో తెలియనప్పటికీ, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న ఆయన పార్లమెంట్ ఎన్నికల వరకు జీహెచ్‌ఎంసీలో కొనసాగవచ్చుననే అభిప్రాయాలున్నాయి.

అర్వింద్‌కు స్థానచలనం?

మరోవైపు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) కమిషనర్ అర్వింద్‌కుమార్‌కు స్థానచలనం కలిగే సూచనలు కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో కీలక భూమిక పోషించిన అర్వింద్‌పై అనేక అంశాల్లో ప్రస్తుత సీఎం రేవంత్ నేరుగా విమర్శనాస్త్రాలు సంధించారు. ముఖ్యంగా భూముల వేలాలు, ఔటర్ రింగ్‌రోడ్డు టోల్ టెండర్ల వ్యవహారాన్ని తప్పుబట్టారు. ఇదే అంశంపై అర్వింద్ ఏకంగా రేవంత్‌కు పరువు నష్టం నోటీసులు కూడా జారీ చేశారు. తాజాగా, ఈ శాఖను కూడా సీఎం పర్యవేక్షిస్తున్నందున..అర్వింద్‌ను అక్కడ కొనసాగించడం కష్టమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్మీ హవల్దార్ ఆత్మహత్య

కంటోన్మెంట్: ఆర్మీ హవల్దార్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నాగేంద్ర బాబు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లా, పెల్లిపట్టికి చెందిన సుభాష్ (28) తాడ్‌బంద్‌లోని 68 మీడియమ్ రెజిమెంట్‌లో గార్డ్ కమాండర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం డ్యూటీ ముగించుకుని విశ్రాంతి తీసుకునేందుకు రెజిమెంట్‌లోకి వెళ్లాడు. 11.30 గంటల సమయంలో వాష్‌రూమ్‌కు వెళ్లిన అతను ఎంతకూ తిరిగి రాకపోవడంతో మరో కమాండర్ విశ్వనాథ్ వెళ్లి తలుపు తట్టినా స్పందించలేదు. దీంతో వెంటిలేటర్ నుంచి చూడగా సుభాష్ ఎగ్జాస్ట్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. తోటి గార్డ్ మనోజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి పట్టివేత

- మలక్‌పేటలో 7 కిలోల గంజాయి స్వాధీనం
- పాత నేరస్తుడు అరెస్ట్.. పరారీలో మరొకరు
- రూ. 60 వేల నగదు, కారు, సెల్ ఫోన్ స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు, గంజాయి, నిందితుడు

మలక్‌పేట: గంజాయి అక్రమ రవాణా చేస్తున్న పాత నేరస్తుడిని మలక్‌పేట పోలీసులు అరెస్ట్ చేసి అతడి నుంచి 7 కిలోల గంజాయి, రూ. 60 వేల నగదు, కారు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ గుంజె శ్రీనివాస్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా, చిట్యాల, శాంతినగర్‌కు చెందిన గోగ్రే కృష్ణ గంజాయి అక్రమ రవాణా చేసేవాడు. ఇతను నగరానికి చెందిన సాయి అలియాస్ గోవర్ధన్ నాయక్‌తో కలిసి స్విఫ్ట్ కారులో గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, మలక్‌పేట పోలీసులు ఆదివారం రాత్రి దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్ చౌక్‌లో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ నాయక్ తప్పించుకోగా గోగ్రే కృష్ణను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి గంజాయి, కారు, సెల్‌ఫోన్, నగదు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితుడిని మలక్‌పేట పోలీసులకు అప్పగించారు. అతడిపై చిట్యాల పీఎస్‌లో ఒకటి, ఉప్పల్ ఎక్సైజ్ పీఎస్‌లో 2 కేసులు ఉన్నట్లు తెలిపారు. దాడుల్లో సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, ఎస్సైలు నర్సింహులు, ఆంజనేయులు, నవీన్, మలక్‌పేట, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆ లాకప్ డెత్‌తోనే ఈ కష్టాలు!

- డ్రగ్ పెడ్లర్స్‌కు అడ్డాగా మారిన బెంగళూరు
- ఒకప్పుడు ఆ నగరంలోనూ వీరిపై ఉక్కుపాదం
- 2021లో డ్రగ్స్ కేసులో చిక్కిన కాంగో జాతీయుడు
- ఠాణా లాకప్‌లో అతను చనిపోవడంతో రచ్చరచ్చ
- ఆ ఉదంతంలో ఉదాశీనంగా మారిన అక్కడి పోలీసులు
- కట్టడికి ప్రత్యామ్నాయాలు అన్వేషిస్తున్న అధికారులు


ఆందోళనకారులను చెదరగొడుతున్న బెంగళూరు పోలీసులు (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ స్టేట్ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో (టీఎస్–నాబ్), హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్, సైబరాబాద్, రాచకొండలకు చెందిన స్పెషల్ ఆపరేషన్ టీమ్స్‌లతో (ఎస్‌ఓటీ) పాటు స్థానిక పోలీసులకు చిక్కిన ప్రతి నాలుగు డ్రగ్ ముఠాల్లో మూడింటి లింకులు బెంగళూరులో ఉంటున్నాయి. ఆ నగరం డ్రగ్ పెడ్లర్స్, సప్లయర్లకు అడ్డాగా మారడానికి దాదాపు రెండున్నరేళ్ళ క్రితం చోటు చేసుకున్న ఓ లాకప్ డెత్ కారణమైంది. దీనిని గమనించిన రాష్ట్ర పోలీసు విభాగం ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తోంది.

ఒకప్పుడు గోవా... ఇప్పుడు బెంగళూరు...

నగరంలో ఎక్కువగా లభించే మాదకద్రవ్యాల్లో గంజాయి సంబంధితమైన వాటి తర్వాతి స్థానంలో సింథటిక్ డ్రగ్స్ ఉంటున్నాయి. గంజాయి, చెరస్, హష్ ఆయిల్ తదితరాలు ఏజెన్సీ ప్రాంతాల నుంచి సిటీకి వస్తున్నాయి. కొకైన్, బ్రౌన్‌షుగర్, హెరాయిన్ తదితర సింథటిక్ డ్రగ్స్ మూలాలు మాత్రం విదేశాల్లో ఉంటున్నప్పటికీ ఇక్కడకు సరఫరా మాత్రం ఉత్తరాదితో పాటు బెంగళూరు నుంచి జరుగుతోంది. ఒకప్పుడు ఈ డ్రగ్ డాన్స్ అంతా గోవా కేంద్రంగా కథ నడిపే వారు. హైదరాబాద్ పోలీసులు వరుస దాడులు చేసి ఎడ్విన్, స్టీవ్ సహా బడా డ్రగ్ డాన్స్‌కు చెక్ చెప్పారు. దీంతో ఇక్కడి వారికి గోవా నుంచి డ్రగ్స్ సరఫరా దాదాపు ఆగిపోయింది. దీంతో బెంగళూరు కేంద్రంగా సరఫరా మొదలైంది.

ఆ నగరమూ విదేశీయుల అడ్డా...

బెంగళూరుతో పాటు ఉత్తరాదిలోని అనేక నగరాల్లో తిష్ట వేసి, డ్రగ్స్ దందాలో కీలకంగా వ్యవహరిస్తున్న వారిలో నల్లజాతీయులే ఎక్కువగా ఉంటున్నారు. స్టడీ, బిజినెస్, విజిట్ సహా వివిధ రకాలైన వీసాలపై వస్తున్న నైజీరియా, సూడాన్, సోమాలియా, కాంగో జాతీయులు డ్రగ్ పెడ్లర్స్, సప్లయర్స్‌గా మారుతున్నారు. ఇలాంటి వాళ్లు ఇతర నగరాలతో పాటు బెంగళూరులోనూ పెద్ద సంఖ్యలో నివసిస్తున్నారు. 2021 ప్రథమార్థం వరకు ఆ నగరంలో నేరాలు చేస్తున్న, అక్రమంగా నివసిస్తున్న ఇలాంటి వారిపై ఉక్కుపాదం మోపేవారు. వీళ్ళు సాధారణంగా ఎంపిక చేసుకున్న ప్రాంతాల్లోనే పెద్ద సంఖ్యలో నివసిస్తుంటారు. బెంగళూరులోని అలాంటి ప్రాంతాల్లో తరచూ తనిఖీలు చేసే అక్కడి పోలీసులు అక్రమంగా నివసిస్తున్న, దందాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకున్నారు.

ఒక్క ఉదంతంలో అడ్డం తిరిగిన కథ ..

ఆ నగరంలో 2021 ఆగస్టులో చోటు చేసుకున్న ఓ ఉదంతంతో కథ అడ్డం తిరిగింది. కాంగోకు చెందిన జోయల్ షిందానీ ములు (27) స్టడీ వీసాపై బెంగళూరుకు వచ్చాడు. డ్రగ్స్ పెడ్లింగ్ చేస్తూ పోలీసులకు చిక్కకుండా ముప్పతిప్పలు పెట్టిన ఇతడిని 2021 ఆగస్టులో జేసీ నగర్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ నేపథ్యంలో ఠాణాలోనే అతడు చనిపోయాడు. కార్డియాక్ అరెస్టు వల్ల మరణం సంభవించిందని పోలీసులు చెప్పగా, పోలీసులే కొట్టి చంపారని నల్లజాతీయులు ఆరోపించారు. దీంతో పెద్ద సంఖ్యలో ఆ ఠాణా వద్దకు చేరుకున్న నల్లజాతీయులు రాళ్లు రువ్వడంతో పాటు నిరసన చేపట్టారు. దాదాపు రెండు రోజుల పాటు ఈ ఘర్షణలు అక్కడి పోలీసులు ఉలిక్కిపడేలా చేశాయి. ఈ పరిణామం తర్వాత ఆ నగర అధికారులు నల్లజాతీయుల విషయంలో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

పరిస్థితులు చేయి దాటుతుండటంతో...

దీనిని అలుసుగా చేసుకున్న అనేక మంది డ్రగ్ పెడ్లర్స్, సప్లయర్స్ బెంగళూరును అడ్డాగా మార్చుకున్నారు. ఇతర మెట్రోల్లో నివసించే నల్లజాతీయులు సైతం ఆ నగరానికి వచ్చివెళ్తూ డ్రగ్స్ దందా చేస్తున్నారు. కొన్ని రకాలైన డ్రగ్స్ విదేశాల నుంచి నేరుగా కర్ణాటకలోని వివిధ నగరాలకు వచ్చి బెంగళూరు చేరుతున్నాయి. అక్కడ నుంచే హైదరాబాద్ సహా వివిధ నగరాలకు సరఫరా అవుతున్నాయి. ఇటీవల వెలుగులోకి వచ్చిన కేసులను అధ్యయనం చేసిన అధికారులు ఈ విషయం గుర్తించారు. దీంతో అక్కడ ఉన్న డ్రగ్ పెడ్లర్స్‌కు చెక్ చెప్పడానికి, మాదకద్రవ్యాల దందాను కట్టడి చేయడానికి అవసరమైన మార్గాలను అన్వేషిస్తున్నారు. అవసరమైతే దీనిపై కేంద్ర ఏజెన్సీల సహకారం కూడా తీసుకోవాలని భావిస్తున్నారు. ఇక్కడ నుంచి సూత్రధారులను పట్టుకోవడానికి వెళ్లినా సరైన సహకారం లభించకపోవడాన్నీ ప్రస్తావిస్తున్నారు.

రవాణా రంగ కార్మికులకు న్యాయం చేయాలి


అభివాదం చేస్తున్న ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ నాయకులు

హిమాయత్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలలో భాగంగా మహాలక్ష్మి పేరుతో ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆటో డ్రైవర్ల ఆదాయానికి గండి కొడుతుందని, రెండు రోజుల్లోనే ఆదాయం తగ్గి ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ నేతలు అన్నారు. సోమవారం హిమాయత్ నగర్ సత్యనారాయణ రెడ్డి భవన్‌లో కన్వీనర్ వెంకటేషం అధ్యక్షతన రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ తమకు నష్టం జరిగినా ప్రజలకు మేలు చేసే ఈ పథకాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అయితే గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆటో డ్రైవర్ల ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా మారిందని, దీంతో ఎందరో ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రవాణారంగా కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, అర్హులైన ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ.12 వేలు ఇవ్వాలని, పెరిగిన ఇంధన, నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా తక్షణమే ఆటో మీటర్ చార్జీలు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జేఏసీ కో–కన్వీనర్లు వి.కిరణ్, బి. శ్రీకాంత్, జి.మల్లేష్ గౌడ్, సిహెచ్ బాల నరసింహ, ఎండి. అమానుల్లా ఖాన్, ఎంఏ సలీం, మీర్జా రఫాత్ బైగ్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల నోట మూడు నెలల పిండం

హబీబ్‌నగర్ పీఎస్‌లో కేసు నమోదు

నాంపల్లి: అబార్షన్‌తో బయటకు తీసిన పిండాన్ని నాలాలో విసిరేశారు. నాలాలో పడిన పిండాన్ని కుక్కలు పీక్కుతింటుండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామ నిర్వహించి మాంసం ముద్దలను ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ సంఘటన హబీబ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హబీబ్‌నగర్ నాలా వద్ద సోమవారం మూడు నెలల పిండాన్ని కుక్కలు తింటున్నట్లు సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు పిండాన్ని స్వాధీనం చేసుకున్నారు. గుర్తు తెలియని మహిళ అబార్షన్ చేయించుకుని పిండాన్ని పారేసి ఉంటారని అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో మరో మూడు అత్యాధునిక క్రీడామైదానాలు


పికిల్బాల్ క్రీడా మైదానాన్ని ప్రారంభిస్తున్న అనిల్ కామినేని

లక్డీకాపూల్ : ప్రపంచవ్యాప్తంగా విశేష ఆకర్షణ కలిగిన రాకెట్ క్రీడాభివృద్ధికి నగరంలో మూడు అత్యాధునిక క్రీడామైదానాలు అందుబాటులోకి రావడం శుభపరిణామని తెలంగాణ అర్చరీ అసోసియేషన్ ప్రెసిడెంట్ అనిల్ కామినేని అన్నారు. స్పోర్ట్స్ సర్వీస్ ప్రొవైడర్ గేమ్ పాయింట్ నగరంలో ప్రీమియం పికిల్బాల్ కోర్టును ప్రారంభించింది. ఈ సందర్భంగా గేమ్ పాయింట్ సహ వ్యవస్థాపకులు సిద్ధార్థ్ రెడ్డి మాట్లాడుతూ.. పికిల్బాల్‌పై పెరుగుతున్న ఆసక్తిని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ పికిల్బాల్ అసోసియేషన్ భాగస్వామ్యంతో టోర్నమెంట్లను నిర్వహించనున్నట్లు తెలిపారు. పికిల్బాల్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్‌లతో కూడిన రాకెట్ క్రీడ అభివృద్ధి చేసేందుకు బుక్ అండ్ ప్లే విధానం అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు.

సీఎంను కలిసిన అర్వింద్‌కుమార్



సాక్షి, సిటీబ్యూరో: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మున్సిపల్, పరిపాలన పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, హెచ్‌ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ అర్వింద్ కుమార్ సోమవారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

వెనుక నుంచి కారు ఢీ: ముడు కార్లు ధ్వంసం


ప్రమాదంలో ధ్వంసమైన కార్లు

పంజగుట్ట: వేగంగా వచ్చిన ఓ కారు పార్క్ చేసి ఉన్న మరో కారును ఢీ కొనడంతో వరుసగా మూడు పార్క్ చేసి ఉన్న కార్లు ఒకదానికి ఒకటి ఢీ కొని ధ్వంసం అయ్యాయి. సోమవారం మధ్యాహ్నం హుందాయ్ క్రెటా కారు బేగంపేట నుంచి రాజ్‌భవన్ రోడ్డు వైపు వెళ్తోంది. జీక్రా స్కూల్ ఎదురుగా ఎస్‌బీఐ బ్యాంకుకు వెళ్లేందుకు వచ్చిన వారు మూడు కార్లు వరుసగా పార్క్ చేసి ఉన్నారు. క్రెటా కారు వెనక ఉన్న కారును బలంగా ఢీ కొట్టడంతో ఆ కారు ముందు ఉన్న మరో రెండు కార్లు ఒకదాన్ని మరొకటి ఢీ కొట్టుకున్నాయి. ఈ ఘటనలో మొత్తం నాలుగు కార్లు ధ్వంసం కాగా కారు నడుపుతున్న వ్యక్తి తలకు గాయమైంది. వెంటనే పక్కనే ఉన్న జాయ్ ఆస్పత్రికి తరలించి పోలీసులు కారును క్రేన్ ద్వారా స్టేషన్ తరలించారు.


మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పరామర్శిస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ మంత్రి తలసాని



మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

మాజీ హోం శాఖ మంత్రి మహమూద్ అలీ


బీసీ ఉద్యోగుల సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్‌గా రామరాజువర్మ


నియామక పత్రం అందజేస్తున్న చంద్రశేఖర్

పంజగుట్ట: తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా రామరాజు వర్మ నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రశేఖర్‌గౌడ్ చేతులమీదుగా సోమవారం అందుకున్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఐక్యంగా ఉండి సమస్యలపై సంఘటితంగా పోరాటం చేయాలని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ప్రతి బీసీ ఉద్యోగి సభ్యుడిగా చేరి ఈ నెలలో నిర్వహించే సభ్యత్వ డ్రైవ్‌లో పాల్గొని సంఘాన్ని బలోపేతం చేయ్యాలన్నారు. సంఘం ప్రతినిధి బృందం నీటిపారుదల శాఖా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మహిళాధ్యక్షురాలు డి.రమ, ఉపాధ్యక్షులు చక్రధర్, మహేంద్ర సాగర్ పాల్గొన్నారు.

డిమెన్షియా వ్యాధిపై అవగాహన వర్క్‌షాప్


సదస్సులో పాల్గొన్న వైద్యులు

బంజారాహిల్స్: తెలివితేటలు, జ్ఞాపకశక్తి వివేకాన్ని క్రమంగా క్షీణింపజేసే డిమెన్షియాకు ప్రస్తుతం ఎలాంటి చికిత్సా లేదని అందుకే దీన్ని నివారించేందుకు జీవనశైలి మార్పుల మీదే ఎక్కువగా దృష్టి సారించాలని వైద్యులు పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రిలో డిమెన్షియా వ్యాధి అవగాహన కోసం సోమవారం రోజు వర్క్‌షాప్ జరిగింది. డిమెన్షియా ఇండియా అలయన్స్ అధ్యక్షురాలు డాక్టర్ రాధామూర్తి, జాయింట్ సెక్రటరి పవిత్రా గంగాధరన్, డాక్టర్ మురళీధర్‌రెడ్డి, డాక్టర్ హరిణి, హేమలతా తదితరులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొని మాట్లాడుతూ... ముందస్తు రోగ నిర్ధారణతో వ్యాధిని నిర్మూలించవచ్చన్నారు. చిత్తవైకల్యం అనేది వృద్ధాప్యం సాధారణ భాగం కాదని వారు స్పష్టం చేశారు. ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించడం వల్ల ఎంతో మందికి ఉపయోగ పడుతుందనే ఉద్దేశంతో ఏర్పాటు చేశామన్నారు. ప్రారంభ లక్షణాలు, రోగ నిర్ధారణ గురించి తెలియజేశారు.

ముగిసిన ప్రాజెక్ట్ ఎక్స్‌పో


అంబేద్కర్ కళాశాలలో జరిగిన ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో పాల్గొన్న విద్యార్థులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విద్యా సంస్థల్లో ఎంబీఏ, డిగ్రీ, ఇంటర్ మీడియట్, ఎస్ఎస్‌సీ విద్యార్థులకు మూడు రోజుల పాటు నిర్వహించిన ప్రాజెక్ట్ ఎక్స్‌పో (నూతన ఆవిష్కరణ ప్రదర్శన) ఘనంగా ముగిసింది. ఎక్స్‌పోలో పాల్గొని ఉత్తమ ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ. మూడు వేలు, ద్వితీయ బహుమతిగా రూ. రెండు వేలు, తృతీయ బహుమతిగా వెయ్యి రూపాయలతో అభినందించారు. ప్రథమ బహుమతి వైర్‌లెస్ డిజిటల్ బ్రోర్డుకు, ద్వితీయ బహుమతి ఆపరేటర్ మోడల్ ట్రీ, తృతీయ బహుమతి ఇస్రో చంద్రయాన్ మోడల్స్‌కు అందించారు. కళాశాల జాయింట్ సెక్రటరీ పి.వి.రమణకుమార్ మాట్లాడుతూ... విద్యార్థులు అనుకుంటే అసాధ్యమంటూ ఏదీ లేదన్నారు. కార్యక్రమంలో ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.భవానీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వసుంధర, పాఠశాల ప్రిన్సిపాల్ విఠలాచారి తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

చిక్కడపల్లి: పనికి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైనంది. దోమలగూడ ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ సాయికృష్ణ సమాచారం మేరకు... హిమాయత్‌నగర్‌లో నివసించే సుజ్జన్‌లాల్, సావిత్రి దంపతులకు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. మూడవ కుమార్తె అర్చన(18) ఇళ్లలో పని చేస్తూ ఉండేది. ఈ క్రమంలో ఈ నెల 10 వ తేదీన సాయంత్రం సుష్మ వాళ్ల ఇంట్లో పనిచేసేందుకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అయితే అర్చన ఎంతకూ ఇంటికి తిరిగి రాలేదు. పనికి కూడా సుష్మ ఇంటికి వెళ్లలేదని తెలిసింది. దీనితో కంగారు పడిన కుటుంబ సభ్యులు దోమలగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా ఉమామహేశ్వర కల్యాణం

చిక్కడపల్లి: వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో ఉమామేశ్వర స్వామి వార్ల కల్యాణోత్సవం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ఈవో లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మాసశివరాత్రి సందర్భంగా ఘృతశర్కాభిషేకం కార్యక్రమం జరిగింది. ఆలయంలో బిల్వార్చన, అన్నపూజ, నివేదన, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో పండితులు భవానంద శర్మ, జగన్‌మోహనాచార్యులు, బుచ్చమాచార్యులు, గోపాలాచారి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలి

ముషీరాబాద్: మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం వల్ల ఆర్టీసీ ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని బస్సుల సంఖ్యను వెంటనే పెంచాలని బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం భోలక్‌పూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే తపనతో ముందస్తు ప్రణాళిక లేకుండా మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసి ఆర్టీసీ ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నదని ఆరోపించారు. బస్సులలో అధిక రద్దీ వల్ల ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణికులకు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం అన్ని వర్గాల ప్రజలకు అమలయ్యేలా ప్రతి ఒక్కరికీ తెల్ల రేషన్ కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం వల్ల ఆటో డ్రైవర్లు, ఉబర్, ఓలా, రాపిడో ద్వారా ఉపాధి పొందుతున్న నిరుద్యోగులకు ఉపాధి కరువై ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. జీవనోపాధి కల్పిస్తున్న ఈ రంగాల్లో ఉన్న వారిని ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దు

సనత్‌నగర్: ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా అధికారులు వ్యవహరించడంపై బీజేపీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు, సీనియర్ నేత నెమలి ఆనంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బేగంపేట డివిజన్ బ్రాహ్మణవాడీ లేన్‌నెంబర్–3లో వాటర్‌వర్క్స్ విభాగం అధికారులు స్థానికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకోకుండా కొత్తలైన్‌కు సంబంధించి పనులు చేపడుతున్నారంటూ పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో అక్కడికి చేరుకున్న నెమలి ఆనంద్ విషయాన్ని వాటర్‌వర్క్స్ మేనేజర్ దృష్టికి తీసుకురాగా ఆయన తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. నెమలి ఆనంద్ విజ్ఞప్తి మేరకు వాటర్‌వర్క్స్ సిబ్బంది సమస్యను పరిష్కరించారు. బీజేపీ ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్షుడు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆరోగ్యమస్తు!

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో 83,127 మందికి లబ్ధి

ఆరోగ్యశ్రీ.... పేద, మధ్యతరగతి ప్రజానీకానికి వరంలాంటిది. ఖరీదైన వైద్యాన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో సామాన్యులకు అందుబాటులోకి తీసుకొచ్చే బృహత్తర పథకం ఇది. సామాన్యులపై ఆర్థిక భారంమోపకుండా బతుకుపై ఆశలు కల్పిస్తున్నది. అంతే కాదు ఆరోగ్యమస్తు అంటూ ఈ పథకం దీవెనలు కూడా అందజేస్తున్నది. నేనున్నాననే భరోసాతో సామాన్య, మధ్య తరగతి ప్రజలను బతికిస్తున్న పథకం. ఇప్పుడు ఈ పథకానికి తెలంగాణ ప్రభుత్వం మరింత మెరుగులు దిద్దింది.

- శనివారం నుంచి అందుబాటులోకి వచ్చిన రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం
- హర్షం వ్యక్తం చేస్తున్న సామాన్య, మధ్య తరగతి ప్రజలు


వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన మహిళలు

బంజారాహిల్స్: పేద, మధ్య తరగతి ప్రజలు ప్రైవేట్ దవాఖానాలకు వెళ్లి చికిత్సలు పొందాలంటే ఆర్థిక పరిస్థితులు అడ్డొచ్చి ఆలోచించాల్సిన పరిస్థితులు తలెత్తేవి. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పని చేసిన దివంగత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొచ్చారు. విప్లవాత్మకమైన ఈ పథకం దేశమన్ననలు అందుకుంది. కార్పొరేట్ ఆస్పత్రుల్లో కూడా సామాన్యుడికి ఉచితంగా చికిత్స పొందే అవకాశాన్ని కల్పించారు. రేషన్ కార్డుల్లో పేరు ఉన్న ప్రతి ఒక్కరూ ఆరోగ్యశ్రీ పథకానికి అర్హులు.

- ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధి కిందకు వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, బోరబండ, తదితర డివిజన్ల పరిధిలో 83,127 తెల్లరేషన్ కార్డులు ఉన్నాయి.
- వీరందరికీ రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందే అవకాశం ఉంది. 1672 వ్యాధులకు రూ. 10 లక్షల వరకు తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి వచ్చాక ఇచ్చిన పథకం ద్వారా లబ్ధి పొందే అవకాశం కల్పించారు.

రూ. 10 లక్షలకు పెంపుపై సర్వత్రా హర్షం

పథకం ప్రారంభించినప్పుడు రూ. 2 లక్షల వరకు ఎలాంటి ఖర్చుల లేకుండా ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్సకు అవకాశం కల్పించారు.

- తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ఈ పథకాన్ని కొనసాగించారు. ఆరోగ్య శ్రీ తరహాలోనే కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేస్తున్నది.
- ఈ రెండు పథకాలను కలిపి రూ. 5 లక్షల వరకు వైద్య సేవలు పొందే అవకాశం ఉండేది. తాజాగా సీఎం రేవంత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.
- మేనిఫెస్టోలో తెలిపిన విధంగా ఆరోగశ్రీ పథకాన్ని మళ్లీ రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకంగా మారుస్తూ పరిధిని రూ. 10 లక్షలకు పెంచుతూ చేయూత పేరుతో శనివారం ప్రారంభించారు.
- 289 వ్యాధులకు, సర్జికల్ విభాగంలో 1383 వ్యాధులకు రూ. 10 లక్షల వరకు చికిత్స పొందవచ్చు. 126 రకాల వ్యాధిగ్రస్తులకు చికిత్స అనంతరం సంవత్సరంపాటు ఉచితంగా మందులు అందించనున్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 19, నల్ల వంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 55, పచ్చిమిర్చి 28, బజ్జిమిర్చి 40, క్యాప్సికం 55, పచ్చి కాకరకాయ 45, పందిరి బీర 55, క్యాబేజీ 15, క్యారెట్ 37, దొండకాయ 35, గుండు బీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 50, కీర 20, దోసకాయ 28, బీట్‌రూట్ 33, ఉల్లిగడ్డ 36, ఆలుగడ్డ 23, చామగడ్డ 40, మొరంగడ్డ 20, కందగడ్డ 55, గుమ్మడికాయ 13, క్యాలీఫ్లవర్ 18, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4–6, ఉల్లిపొరక రూ. 31 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

21 నుంచి చిల్డ్రన్స్ ఆర్ట్ ఫెస్టివల్

లక్డీకాపూల్: చిన్నారుల్లో వినూత్నమైన కళల పట్ల ప్రోత్సహించే దిశగా నగరంలో మూడు రోజుల పాటు చిల్డ్రన్స్ ఆర్ట్ ఫెస్టివల్ –2023 నిర్వహించనున్నారు. చిల్డ్రన్స్ ఫైన్ ఆర్ట్ గ్యాలరీతో కలిసి కొల్లూరులోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన కళలు, సంస్కృతికి ప్రతీకగా నిలవనున్నది. ఈ నెల 21వ తేదీ నుంచి స్కూల్ ఆవరణలో జరిగే ఈ ప్రదర్శన చిన్నారులతో పాటు ప్రఖ్యాత చిత్రకారులు, ఆర్ట్ ప్రాక్టీషనర్లు, ఉపాధ్యాయులకు వేదిక కానున్నది. వర్క్‌షాప్‌లు, ఇంటరాక్టివ్ ఇన్‌స్టాలేషన్, ఆకర్షణీయమైన చిత్ర ప్రదర్శనలతో నగరవాసులను అలరించనున్నదని స్కూల్ నిర్వాహకులు పేర్కొన్నారు.

రేవంత్‌ను అభినందించిన సుదర్శన్‌రావు



బంజారాహిల్స్: తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎ. రేవంత్ రెడ్డిని తెలంగాణ కాంగ్రెస్ కమిటీ మాజీ సెక్రటరీ దుశర్ల సుదర్శన్‌రావు అభినందించారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్ నేతృత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఏళ్లుగా పార్టీ జెండాలు మోస్తూ పార్టీ కోసం శ్రమిస్తున్న తమలాంటి సీనియర్ నాయకులు అందరినీ ఆదరించాలని అడిగినప్పుడు సమయం కూడా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. మూడేళ్లుగా తాము ఢిల్లీ, హైదరాబాద్ చుట్టూ తిరుగుతున్నామని ఇప్పుడు మన ప్రభుత్వమే ఏర్పడటంతో ఎంతో ఆనందంగా ఉందని సీనియర్ కాంగ్రెస్ నాయకులు అందరినీ పిలిపించుకొని సమావేశం ఏర్పాటు చేస్తూ వారి సాదక బాధకాలు కూడా వినడం ద్వారా మరింత మంచి చేసిన వారం అవుతామని అన్నారు.

దానంకు మాల సంఘాల జేఏసీ సన్మానం



ఫిలింనగర్: ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన దానం నాగేందర్ తెలంగాణ మాల సంఘాల జేఏసీ నాయకులు సోమవారం ఆయన నివాసం వద్ద కలిసి ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ... ఈ ఎన్నికల్లో మాల సంఘాల నేతలు, కార్యకర్తలు తన విజయానికి ఎంతో కృషి చేశారని వారికి రుణపడి ఉంటానని ఎల్లవేళలా వారికి అందుబాటులో ఉంటానని అన్నారు. మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్, గ్రేటర్ చైర్మన్ ఉత్తమ్ సుమన్, గడ్డం సత్యనారాయణ, బరిగెల వెంకటస్వామి, పొలడుగు శ్రీనివాస్, అచ్యుతయ్య, లలిత, రుక్మిణి, సరళ, అనిల్, నాను పాల్గొన్నారు.

స్మృతివనం ఏర్పాటుకు సీఎం చొరవ చూపాలి

మేచినేని కిషన్‌రావు, సుదర్శన్‌రావు


మాట్లాడుతున్న మేచినేని కిషన్‌రావు

బంజారాహిల్స్: తెలంగాణ స్వాతంత్ర్యం కోసం 1948లో జరిపిన పోరాట చరిత్రను, 1969 నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటం చేసిన అమరులు, రాష్ట్ర సాధకుల చరిత్రను ప్రతిబింబించేలా వంద ఎకరాల్లో స్మృతివనం నిర్మించి భావితరాలకు స్ఫూర్తిని కలిగించేలా ఏర్పాటు చేయాలని 1969 తెలంగాణ ఉద్యమకారుల సమితి అధ్యక్షుడు మేచినేని కిషన్‌రావు, సెక్రటరీ జనరల్ డి. సుదర్శన్‌రావు కోరారు. సోమవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... కంటోన్మెంట్ ఏరియాలో వంద ఎకరాల స్థలం ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని చరిత్రలో నిలిచిపోయే విధంగా స్మృతివనం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. మలి ఉద్యమంలో చనిపోయిన కుటుంబాలకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వనున్నారని ఇందుకు సమితి హర్షం వ్యక్తం చేస్తున్నదన్నారు. 5 ఎకరాల వ్యవసాయ భూమిని కూటా కేటాయించాలన్నారు. మలి ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన కుటుంబాలకు ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. 1969 ఉద్యమకారులను తెలంగాణ రాష్ట్ర సాధకులుగా గుర్తించాలన్నారు. ఇందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యమకారులపై ఉన్న అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. తాము గత నెల 6న తొలి, మలి ఉద్యమకారుల సదస్సును నిర్వహించి రెండు తీర్మానాలను ప్రవేశ పెట్టామన్నారు. అందులో ఒకటి కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతి అక్రమాలపై సీబీఐ విచారణ జరపడమని సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే కాళేశ్వరంపై చర్యలు తీసుకొని బాధ్యులైన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్పొరేషన్ పదవుల్లో మహిళలకు ప్రాధాన్యమివ్వాలి

చిక్కడపల్లి: గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేశారని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పుస్తకాల కవిత అన్నారు. సోమవారం సాయంత్రం గాంధీనగర్ విలేకరులతో పుస్తకాల కవిత మాట్లాడారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు సూచనల మేరకు గతంలో ఇక్కడ అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వివిధ రూపాలలో ఆందోళనలు చేశామన్నారు. దశాబ్దకాలం తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. మహిళా కాంగ్రెస్ చేసిన కృషిని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించి కార్పొరేషన్ చైర్ పర్సన్, కమిటీ సభ్యులు నియామకాలలో అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. మహిళా కాంగ్రెస్ ఎన్నో పోరాటాలు చేసిందని, తెలంగాణ రాష్ట్ర సాధనకో ఎంతో కృషి చేసిన విషయాన్ని కవిత గుర్తు చేశారు.

తలసానికి అభినందనల వెల్లువ

సనత్‌నగర్: మూడోసారి భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను నియోజకవర్గానికి చెందిన పలువురు సోమవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఆయన నివాసంలో శుభాకాంక్షలు తెలిపారు. సనత్‌నగర్ డివిజన్‌లోని రవీంద్రనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌సింగ్, ఉపాధ్యక్షుడు ఎన్వీ రమణారెడ్డి, సుదర్శన్, రాంరెడ్డి, ముఖ్య సలహాదారులు రాపోల సత్యానారాయణ, సూర్యనారాయణ ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

శుభాకాంక్షలు



శ్రీనగర్‌కాలనీ: నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌ను సోమవారం శ్రీనగర్‌కాలనీ ఎంఐఎం అధ్యక్షుడు షేక్ జాఫర్ దారుసలాంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నేతలు రఫీక్, అన్వర్, షరీఫ్, నిజామ్, ఖలీమ్, ఉమ్మన్ పాల్గొన్నారు.

'లిటిల్ రాయల్స్' ప్రారంభం


స్టోర్‌ను ప్రారంభిస్తున్న పింకీరెడ్డి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.7లోని ది హిల్‌టాప్‌లో ప్రముఖ డిజైనర్లు వర్ష కెడియా, సౌమ్యారెడ్డి ఏర్పాటు చేసిన లిటిల్ రాయల్స్ లగ్జరీ కిడ్స్ ఫ్యాషన్ స్టోర్‌ను సోమవారం పింకీరెడ్డి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ... చిన్నారుల కోసం ఏదైనా కొనుగోలు చేయాలంటే ఎక్కడికి వెళ్లాలని ఆలోచిస్తున్నారని అయితే అన్ని ఒకే వేదిక వద్ద ఇక్కడ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. చిన్నారులు ఈ స్టోర్‌ను ఎంతగానో సందడి చేసే విధంగా ఆకట్టుకునే, ఆకర్షణీయమైన వస్తువులు, దుస్తులు అందుబాటులో ఉంచారని అన్నారు.

మారుమూల ప్రాంతాల్లోనూ మానసిక ఆరోగ్య కేంద్రాలు అవసరం


సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ రమేష్‌రెడ్డి

బంజారాహిల్స్: మారుమూల ప్రాంతాల్లో కూడా మానసిక ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ డీఎంఈ డైరెక్టర్ డాక్టర్ రమేష్ రెడ్డి తెలిపారు. ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైకియాట్రిక్ అపోలో మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని అపోలో మెడికల్ కాలేజీలో మానసిక సేవలను స్థాపించడం అనే థీమ్‌తో సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ... ఎంతో మంది నిపుణులు ఈ సదస్సుకు వచ్చారని మన దేశంలో ఉన్న పరిమితులు, మనో రోగ చికిత్స సేవలు తెలుసన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ బోధనా సంస్థల్లో ఇటువంటి నిపుణులు ఎంతో మంది ఉన్నారన్నదే ప్రశ్న అన్నారు. మానసిక వైద్యం కళాశాలలకే పరిమితం అయిందని అక్కడ కూడా పూర్తి స్థాయిలో లేదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అరబింద బ్రహ్మ, అశోక్, నేహ మహేంద్ర, నరేష్ వడ్లమాని తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


సతీష్

బంజారాహిల్స్: ఇంటి అద్దె చెల్లించేందుకు డబ్బులు తీసుకొస్తానని బయటికి వెళ్లిన భర్త రోజులు గడుస్తున్నా ఇంటికి రాలేదని ఆందోళన వ్యక్తం చేస్తూ ఓ మహిళ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలివీ... వెంకటగిరిలో నివసించే ఎస్. సతీష్(39) ర్యాపిడో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల ఇంటి కిరాయి కోసం డబ్బులు తీసుకొస్తానని భార్య సాయిశ్రీకి చెప్పి వెళ్లారు. రోజులు గడిచినా రాకపోవడం... భర్త కోసం అన్ని ప్రాంతాలు గాలించినా ఉపయోగం లేకుండా పోయింది. అనుమానాస్పద స్థితిలో అదృశ్యమైన సతీష్ కోసం జూబ్లీహిల్స్ పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేసి సీసీ ఫుటేజీలను పరిశీలిస్తూ ముమ్మరంగా గాలించారు. ఫలితం లేకపోవడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 98666 39127లో సంప్రదించాలని బాధితురాలు కోరారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా కార్తీక దీపారాధన


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు

ఖైరతాబాద్: కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా సాగర తీరంలో గంగ తెప్పోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దీపారాధన కార్యక్రమానికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హాజరయ్యారు. గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం మహిళలు సాగర తీరంలో దీపాలు వదిలారు. గంగ తెప్పోత్సవ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్‌బాబు, మహేష్‌యాదవ్, ప్రవీణ్, పృథ్వీరాజ్, అరుణజ్యోతి, అనురాధ, అనిత పాల్గొన్నారు.

సందడిగా కార్తీక వన భోజనాలు


కార్తీక వనభోజనాల్లో పాల్గొన్న ఏడుళ్ల బయ్యారం కుటుంబ సభ్యులు

బంజారాహిల్స్: హైదరాబాద్‌లో నివసిస్తున్న ఏడుళ్ల బయ్యారం కుటుంబ సభ్యులు కార్తీక వనభోజనాల వేడుకను సందడిగా నిర్వహించారు. సాయినాథ్ చారిటబుల్ సొసైటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వీరంతా పాల్గొని సందడి చేశారు. ఐఆర్ఎస్ అధికారి ఆర్. వెంకటేశ్వర్‌రెడ్డి, పారిశ్రామిక వేత్త వి.ఎల్.ఎన్.రెడ్డి, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అధికారిణి జ్యోతి తదితరులు పాల్గొని తమ విలువైన సూచనలు అందజేశారు. సుమారు 150 కుటుంబాలు వన భోజన మహోత్సవంలో పాల్గొని ఆట,పాటలతో ఆకట్టుకున్నారు. సంప్రదాయ విందు భోజనాలతో కార్యక్రమాలు మరింత ఆకర్షణీయంగా మలిచారు. పినపాక మండలంలోని ఏడుళ్ల బయ్యారంకు చెందిన వీరంతా ఈ కార్తీక వనభోజనాల మహోత్సవాలను అత్యంత ఆనందోత్సవాల మధ్య నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. కార్యక్రమంలో ఇదే ప్రాంతానికి చెందిన ప్రముఖులు ఎస్. వెంకటేశ్వర్‌రెడ్డి, ముక్కు వెంకటేశ్వర్‌రెడ్డి, విజయ, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

లక్డీకాపూల్‌లో భారీగా ట్రాఫిక్ జామ్

- ఎక్కడికక్కడ నిలిచిపోయిన వాహనాలు
- నగరంలోని పలు ప్రాంతాల్లో వాహనదారులకు తప్పని ఇబ్బందులు

లక్డీకాపూల్: నగరంలోని పలు ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ స్థంభించిపోయింది. ముఖ్యంగా లక్డీకాపూల్‌లోని మెట్రో స్టేషన్ పరిసర ప్రాంతాల్లో సోమవారం ఉదయం 12 గంటల ప్రాంతంలో అనూహ్యంగా ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. దీంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. ఎటూ కదలకుండా ఉన్న చోటే వాహనదారులు ఆగిపోయారు. ప్రముఖుల రాకపోకల నేపథ్యంలో ఈ సమస్య ఏర్పడింది. ఫలితంగా అసెంబ్లీ ప్రాంతం నుంచి లక్డీకాపూల్ చౌరస్తాతో పాటు నిరంకారి భవన్ చౌరస్తా, తెలుగు తల్లి ఫ్లైఓవర్, విజయనగర్ కాలనీ, ఖైరతాబాద్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకొని చేస్తున్న అక్రమ వ్యాపారాలు వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యానికి గురచేశాయి. ముఖ్యంగా లక్డీకాపూల్ ప్రాంతంలో ఈ సమస్య మరింత జటిలంగా తయారైంది. లక్డీకాపూల్ పాత రాజ్‌దూత్ హోటల్ చౌరస్తాలోని హోటళ్ల వద్ద ఈ పరిస్థితి నెలకొంది. ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు జోక్యం చేసుకుని ఫుట్‌పాత్ వ్యాపారాలను క్రమబద్ధీకరించాలని పలువురు వాహనాదారులు కోరుతున్నారు. లక్డీకాపూల్‌లోని కలెక్టరేట్ భవన సముదాయానికి హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌ను తరలించిన నేపథ్యంలో కొన్ని సందర్భాల్లో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. కలెక్టరేట్ నుంచి వచ్చే వాహనాలు కొత్త వంతెన వైపు వెళ్లే సమయంలో ఇబ్బంది ఏర్పడకుండా జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్ల వల్ల డీజీపీ కార్యాలయం నుంచి వచ్చి నిరంకారి వైపు వెళ్లే వాహనాలు ఆగిపోతున్నాయి. మరో వైపు హైదరాబాద్ కలెక్టరేట్ వైపు నుంచి వచ్చిన వాహనాలు సైతం కొత్త వంతెన పైకి వెళ్లే యత్నంలో జంక్షన్ వద్ద ఆగిపోతున్న పరిస్థితి. దీంతో మెహిదీపట్నం వైపు వెళ్లాల్సిన వాహనాలు నేరుగా వెళ్లేందుకు ట్రాఫిక్ పోలీసులు వెసులుబాటు కల్పించారు. ఈ క్రమంలోనే లక్డీకాపూల్ మెట్రో స్టేషన్ పరిసర ప్రాంతాల్లో తరుచుగా ఏర్పడే ట్రాఫిక్ జామ్ సమస్యలకు చెక్ పెట్టాలని పలువురు వాహనదారులు పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్లుప్తంగా...

కొత్తగా 850 ఎంబీబీఎస్ సీట్లు



వచ్చే విద్యా సంవత్సరంలో అందుబాటులోకి..

సాక్షి, అమరావతి: వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏపీలో మరో 850 వైద్య సీట్లను అందుబాటులోకి తెచ్చేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఈ విద్యా సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం ఐదు నూతన వైద్య కళాశాలలను ప్రారంభించడం ద్వారా 750 సీట్లను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. 2024–25 విద్యా సంవత్సరం నుంచి పాడేరు, పులివెందుల, ఆదోని, మార్కాపురం, మదనపల్లె వైద్య కళాశాలలను ప్రభుత్వం ప్రారంభించనుంది. ఐదు చోట్ల వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులను బోధనాస్పత్రులుగా అభివృద్ధి చేయడంతో పాటు, వైద్య కళాశాలలకు 222, బోధనాస్పత్రికి 484 చొప్పున 3,530 పోస్టులను మంజూరు చేశారు. ఈ పోస్టుల భర్తీ ప్రక్రియ దాదాపు పూర్తయింది. ఒక్కోచోట 150 చొప్పున 750 సీట్ల కోసం నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ)కు దరఖాస్తు చేశారు. మరోవైపు అనంతపురం వైద్య కళాశాలలో 50, నెల్లూరు, శ్రీకాకుళం కళాశాలల్లో ఒక్కో చోట 25 చొప్పున 50 ఎంబీబీఎస్ సీట్ల పెంపునకు దరఖాస్తు చేశారు. ప్రస్తుతం అనంతపురంలో 150, శ్రీకాకుళంలో 175, నెల్లూరులో 175 సీట్లున్నాయి.

ఆర్టీసీ ఉద్యోగులకు తీపి కబురు

జీతాలతోపాటు అలవెన్సుల చెల్లింపు

సాక్షి, అమరావతి: ఆర్టీసీ ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం మరో తీపి కబురు అందించింది. ఉద్యోగులకు ప్రతి నెలా జీతాలతోపాటు అలవెన్సులు కూడా కలిపి చెల్లించాలని నిర్ణయించింది. 'పే ఇన్ టు'లో డ్యూటీ బేస్డ్ అలవెన్సులను జీతాలతోపాటు కలిపి చెల్లించనుంది. వచ్చే నెల నైట్ అవుట్, డే అవుట్ అలవెన్సులు, ఓవర్ టైమ్ అలవెన్సులను జీతాలతో పాటు చెల్లించనున్నారు. దాంతో దాదాపు 50వేలమంది ఆర్టీసీ ఉద్యోగులకు ప్రయోజనం కలగనుంది. అదేవిధంగా ఆర్టీసీ ఉద్యోగులకు 2017 పీఆర్సీ బకాయిలు, ఎస్ఆర్‌బీఎస్ ట్రస్ట్‌కు చెల్లించాల్సిన మొత్తాన్ని కూడా త్వరలోనే దశలవారీగా చెల్లించాలని నిర్ణయించింది. అలాగే క్రమశిక్షణ చర్యలపై ఆర్టీసీ ఉద్యోగులు అప్పీల్ చేసేందుకు.. తదనంతరం సత్వరం పరిష్కరించేలా విధి విధానాలను రూపొందించాలని ప్రభుత్వం ఆదేశించింది. దానిపై రూపొందించిన ముసాయిదాను న్యాయశాఖ పరిశీలనకు పంపారు. త్వరలోనే క్రమశిక్షణ చర్యలపై ప్రత్యేకంగా అప్పీళ్లకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం విధి విధానాలను ఖరారు చేయనుంది.

సామాజిక న్యాయంతో | కొత్త సమన్వయకర్తలు

- 11 నియోజకవర్గాలకు కొత్తవారిని నియమించిన సీఎం జగన్
- మంగళగిరిలో ఆళ్ల స్థానంలో సమన్వయకర్తగా గంజి చిరంజీవి
- గాజువాకలో దేవన్‌రెడ్డి స్థానంలో బీసీ వర్గానికి చెందిన వరికూటి రామచంద్రరావు
- గుంటూరు పశ్చిమ సమన్వయకర్తగా మంత్రి విడదల రజని
- చిలకలూరిపేట సమన్వయకర్తగా మల్లెల రాజేష్‌నాయుడు

ముగ్గురు మంత్రులకు స్థానచలనం



ఆదిమూలపు సురేష్ (కొండేపి)



మేరుగు నాగార్జున (సంతనూతలపాడు)



విడదల రజని (గుంటూరు పశ్చిమ)

సాక్షి, అమరావతి: సామాజిక న్యాయం అనేది నినాదం కాదు.. అనుసరించాల్సిన విధానమని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి చాటిచెప్పారు. కేబినెట్ నుంచి నామినేటెడ్ పదవుల వరకూ సింహభాగం పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఇచ్చి రాజ్యాధికారంలో వాటా కల్పించి సామాజిక న్యాయమంటే ఇదీ అని దేశానికి చాటిచెప్పిన సీఎం జగన్ తాజాగా 11 నియోజకవర్గాలకు నూతన సమన్వయకర్తల నియామకంలోనూ అదే విధానాన్ని పాటించారు. ప్రస్తుతం అగ్రవర్ణాలకు చెందిన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న రెండు నియోజకవర్గాలకు కొత్త సమన్వయకర్తలుగా బీసీ సామాజిక వర్గానికి చెందిన వారిని నియమించారు. మంత్రులు విడదల రజని, మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్‌లు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలను మార్పు చేశారు.

మరింత మెరుగైన ఫలితాలే లక్ష్యంగా..

ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులను సీఎం వైఎస్ జగన్ సమాయత్తం చేస్తున్నారు. అన్ని నియోజకవర్గాల్లో రాజకీయ పరిస్థితులను శాస్త్రీయంగా, క్షుణ్ణంగా అధ్యయనం చేస్తూ మరింత మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా, సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ మార్పుచేర్పులు చేస్తున్నారు. ఈ క్రమంలో 11 నియజకవర్గాలకు కొత్త సమన్వయకర్తలను నియమించారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తన పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో ఆ నియోజకవర్గ సమన్వయకర్తగా చేనేత సామాజిక వర్గానికి చెందిన గంజి చిరంజీవిని సీఎం జగన్ నియమించారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి కుమారుడు, నియోజకవర్గ సమన్వయర్త దేవన్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయడంతో ఆ స్థానంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన వరికూటి రామచంద్రరావును నియమించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్తగా బీసీ సామాజిక వర్గానికి చెందిన వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజినిని నియమించారు. ఆమె ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్తగా కాపు సామాజిక వర్గానికి చెందిన మల్లెల రాజేష్‌నాయుడిని నియమించారు.

కొత్త సమన్వయకర్తలు వీరే..

1.ప్రత్తిపాడు(ఎస్సీ)– బాలసాని కిరణ్‌కుమార్
2.కొండెపి(ఎస్సీ) – డాక్టర్ ఆదిమూలపు సురేష్
3.వేమూరు(ఎస్సీ) – వరికూటి అశోక్‌బాబు
4.తాడికొండ(ఎస్సీ) – మేకతోటి సుచరిత
5.సంతనూతలపాడు(ఎస్సీ) – డాక్టర్ మేరుగు నాగార్జున
6.చిలకలూరిపేట – మల్లెల రాజేష్‌నాయుడు
7.గుంటూరు పశ్చిమ – విడదల రజిని
8.అద్దంకి – పాణెం హనిమిరెడ్డి
9.మంగళగిరి – గంజి చిరంజీవి
10.రేపల్లె – డాక్టర్ ఈవూరు గణేష్
11.గాజువాక – వరికూటి రామచంద్రరావు

వ్యక్తిగత కారణాలతోనే రాజకీయాలకు ఎమ్మెల్యే ఆర్కే దూరం

సీఎం వైఎస్ జగన్ వెంటే రామకృష్ణారెడ్డి: ఎంపీ అయోధ్య రామిరెడ్డి



సాక్షి, అమరావతి/మంగళగిరి: తన సోదరుడు, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) వ్యక్తిగత కారణాలతో రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్త ఆళ్ల అయోధ్య రామిరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే పదవికి, పార్టీకి ఆర్కే రాజీనామా చేయడంపై ఆయన స్పందించారు. ఆర్కేకు ఎలాంటి అసంతృప్తి లేదని, సీఎం జగన్ వెంటే నడుస్తారని స్పష్టం చేశారు. తాడేపల్లిలో సీఎం క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్కేకు కొన్ని అంచనాలు ఉన్నాయని, వాటిని అందుకోలేక రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారని వివరించారు. మంగళగిరి నియోజకవర్గంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థికి అవకాశం ఇవ్వాలని సీఎం జగన్ మొదటి నుంచి భావించారని, ఆ క్రమంలోనే సమన్వయకర్తగా గంజి చిరంజీవిని నియమించారని చెప్పారు.

వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా: ఆర్కే



తాను వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నానని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. ఆయన సోమవారం అసెంబ్లీకి వెళ్లి స్పీకర్ ఓఎస్డీకి రాజీనామా అందించిన అనంతరం మంగళగిరిలో విలేకరులతో మాట్లాడారు. 1995 నుంచి రాజకీయాలలో ఉంటూ దివంగత వైఎస్సార్ అనుచరుడిగా కొనసాగానన్నారు. 2004, 2009లలో కాంగ్రెస్ నుంచి పెదకూరపాడు టిక్కెట్ ఆశించి భంగపడ్డానన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడిచి 2014, 2019లలో మంగళగిరి ప్రజల ఆశీస్సులతో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా విజయం సాధించానన్నారు. అవినీతికి తావులేకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దానని చెప్పారు.

మెరుగైన ఫలితాల కోసమే మార్పులు

11 నియోజక వర్గాలకు కొత్త సమన్వయకర్తల నియామకంపై మంత్రి బొత్స, ప్రభుత్వ సలహాదారు సజ్జల



సాక్షి, అమరావతి: ఏపీలో 175 స్థానాల్లోనూ గెలుపే లక్ష్యంగా ఏ నియోజక వర్గానికి ఎవరిని పార్టీ సమన్వయకర్త(ఇన్‌ఛార్జ్)గా నియమించాలో శాస్త్రీయంగా అధ్యయనం చేసిన అనంతరం మార్పులు చేర్పులకు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో సోమవారం 11 నియోజకవర్గాలకు కొత్త సమన్వయకర్తలను నియమించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి ఆ వివరాలను ప్రకటించారు. మంగళవారం నుంచి 11 నియోజవర్గాల్లో పార్టీ వ్యవహారాలన్నీ కొత్తగా నియమితులైన సమన్వయకర్తలే పర్యవేక్షిస్తారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మెరుగైన ఫలితాల కోసమే ఈ మార్పులని, భవిష్యత్తులోనూ ఇలాంటి నిర్ణయాలు ఉండవచ్చని వారు స్పష్టం చేశారు. బొత్స మాట్లాడుతూ.. ఏ ఒక్కరినీ పార్టీ వదులుకోదని, అందరి సేవలను వినియోగించుకుంటుందని స్పష్టం చేశారు. గత నాలుగున్నరేళ్లుగా సీఎం జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సామాజిక న్యాయం చేస్తూ వారికి ధైర్యాన్ని, స్థైర్యాన్ని ఇచ్చారన్నారు. భవిష్యత్తులోనూ అన్ని నియోజకవర్గాల్లో పరిస్థితులను సమీక్షించుకుంటూ అవసరాన్ని బట్టి ఇన్‌ఛార్జ్‌ల మార్పు చేర్పులపై తగిన నిర్ణయాలు తీసుకుంటారని చెప్పారు. గంజి చిరంజీవిని పార్టీలో చేర్పించింది మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డేనని మంత్రి బొత్స గుర్తు చేశారు. మంగళగిరి నియోజకవర్గ పార్టీ సమన్వకర్తగా చిరంజీవిని సీఎం జగన్ నియమించారన్నారు. పార్టీలో ఆళ్ల రామకృష్ణారెడ్డికి సముచిత స్థానం ఇస్తారని చెప్పారు. ఈ మార్పుల వల్ల కొందరికి బాధ ఉండవచ్చని, అయితే అందరూ సీఎం జగన్ నిర్ణయాలను అర్థం చేసుకుని పార్టీకి సహకరిస్తారన్నారు. సజ్జల మాట్లాడుతూ.. "సీఎం జగన్ వైఎస్సార్‌సీపీని స్థాపించిన నాటి నుంచి పార్టీని ప్రజలకు జవాబుదారీగా ఉంచారు. సీఎం జగన్ దృష్టిలో శాసనసభ్యుడికి ఎంత విలువ ఉంటుందో కార్యకర్తకూ అంతే విలువ ఉంటుంది. ప్రజలతో మమేకమై వారి మనసులు చూరగొని ఆశీస్సులు పొంది ఎవరు రాణిస్తారో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్ణయాలు తీసుకుంటామని సీఎం జగన్ మొదటి నుంచి చెబుతున్నారు. ఈ క్రమంలోనే 11 నియోజకవర్గాలకు కొత్త సమన్వయకర్తలను నియమించారు. భారీ మెజార్టీతో గెలవాలన్న ఆలోచనతోనే మార్పులు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి నిర్ణయాలు ఉండవచ్చు.. ఉండకపోవచ్చు కూడా! పార్టీ ఒక వ్యక్తి కోసమో.. వ్యక్తుల కోసమో ఉండదు. ఎవరికైనా ఇబ్బంది ఉంటే కూర్చోబెట్టి మాట్లాడతాం. ఎందుకు మార్పు చేశామనేది అంతర్గతంగా వారికి వివరిస్తాం"అని పేర్కొన్నారు.

రంగస్థలానికి పూర్వ వైభవం

- 23 నుంచి గుంటూరులో ఏపీ 'నంది నాటకోత్సవాలు'
- ఏపీఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి



సాక్షి, అమరావతి: తెలుగు నాటక రంగ స్థలానికి పూర్వవైభవం తీసుకొచ్చే సంకల్పంతో గుంటూరులో ఈ నెల 23వ తేదీ నుంచి 29 వరకు '22వ నంది నాటకోత్సవాల'ను నిర్వహిస్తున్నట్లు ఏపీ చలన చిత్ర, టీవీ, నాటక రంగాభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి తెలిపారు. సోమవారం విజయవాడలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. పద్య, సాంఘిక నాటకాలు, నాటికలు, బాలల నాటిక, కళాశాల /వర్సిటీ నాటిక (ప్లేలెట్స్)కు 115 ఎంట్రీలు వచ్చాయన్నారు. వీటిల్లో ప్రాథమిక పరిశీలన అనంతరం 38 ప్రదర్శనలను తుది పోటీలకు ఎంపిక చేశామన్నారు. ఐదు విభాగాల్లో 74 అవార్డులను అందజేయనున్నట్లు పోసాని వివరించారు. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి రాత్రి 10 గంటల వరకు నాటక ప్రదర్శనలు కొనసాగుతాయన్నారు. ఐదు విభాగాల్లో స్వర్ణ, రజత, కాంస్య నంది బహుమతుల కోసం జరిగే పోటీల్లో ఒక్కోదానిలో ముగ్గురు చొప్పున మొత్తం 15 మంది న్యాయనిర్ణేతలు ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేస్తారని తెలిపారు. దీంతో పాటు 2022లో నాటక రంగంపై 'ఉత్తమ రచన గ్రంథం'ఎంపిక కోసం మరో ముగ్గురు జడ్జిలతో కమిటీని నియమించామన్నారు.

నామినేషన్లకు గడువు పొడిగింపు

ప్రభుత్వం నాటక రంగ విస్తరణకు ఎనలేని ప్రోత్సాహం అందిస్తోందన్నారు. నంది నాటకోత్సవాల వేదికపై 'ఎన్టీఆర్ రంగస్థల పురస్కారం'పేరుతో నాటక రంగంలో వ్యక్తిగత విభాగంలో విశేష సేవలందించిన నటులు, కళాకారులకు రూ.1.50 లక్షల నగదు బహుమతిని ప్రదానం చేస్తోందన్నారు. దీంతో పాటు సమష్టి కృషితో పనిచేసిన నాటక సమాజాలకు, పరిషత్తులను ప్రోత్సహించేందుకు తొలిసారిగా వైఎస్సార్ రంగస్థల పురస్కారాన్ని ప్రదానం చేస్తూ.. రూ.5లక్షల బహుమతి, మెమెంటోతో సత్కరిస్తామన్నారు. ఈ అవార్డుల నామినేషన్ల గడువును ఈ నెల 20వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది నుంచి బాలలు, కళాశాల విద్యార్థి నాటకాల విభాగాల్లోనూ వ్యక్తిగత బహుమతులను అందజేస్తామన్నారు.

ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని మంత్రికి వినతి

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని తెలంగాణ ఇంజినీరింగ్ శాఖల సీపీఎస్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. సోమవారం ఎర్రమంజిల్ జలసౌధ కార్యాలయంలో నీటిపారుదల శాఖ సమీక్షా సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రిని సంఘం అధ్యక్షుడు ఎస్.మధుసూదన్, కార్యదర్శులు స్రవంతి, సంధ్య, నాయకులు కలిసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరినట్లు తెలిపారు. పదవీ కాలం పూర్తయిన ఉద్యోగులు సర్వీస్ పొడిగింపు ద్వారా తిరిగి కొనసాగుతున్న విధానాన్ని పునఃపరిశీలించి కిందిస్థాయి వారికి పదోన్నతుల్లో అవకాశం కల్పించాలని, పదోన్నతులలో గతంలో ప్రభుత్వం ఇచ్చిన మెమో 11656ను అమలు చేసి ప్రతిభ, మెరిట్ ఉన్న ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు., పదవీవిరమణ వయస్సును పునఃపరిశీలన ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

ఫోర్జరీ సంతకాలతో అడిషనల్ డైరెక్టర్లుగా అవతారం

- ఇద్దరిపై చీటింగ్ కేసు నమోదు

గచ్చిబౌలి: ఫోర్జరీ సంతకాలతో తాము పని చేస్తున్న కంపెనీలో అడిషనల్ డైరెక్టర్లుగా అవతారమెత్తిన ఇద్దరిపై చీటింగ్ కేసు నమోదైన ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. చిత్రపురి కాలనీలో ఊర్విన్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఐటీ కంపెనీ ఉందన్నారు. డైరెక్టర్‌గా పని చేసి రఘు కుమారీ 2022 సెప్టెంబర్‌లో అమెరికాకు వెళ్లి తిరిగి 2023 ఏప్రిల్‌లో హైదరాబాద్‌కు వచ్చారని చెప్పారు. ఆపరేషన్స్ బాధ్యతలు నిర్వహించే స్వామిజీ, రవి కుమార్‌లు డైరెక్టర్ సంతకాలు ఫోర్జరీ చేసి 2022 డిసెంబర్‌లో ఆర్‌ఓసీలో అడిషనల్ డైరెక్టర్లుగా నమోదు చేసుకున్నారని పోలీసులు తెలిపారు. ఆ ఇద్దరి వల్ల కంపెనీకి రూ. మూడు కోట్ల నష్టం వాటిల్లిందని డైరెక్టర్ రఘు కుమారీ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితులపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నగర వార్తలు

కీసరగుట్ట.. భక్తుల కిటకిట

- కనుల పండువగా స్వామివారికి బిల్వార్చన
- వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం





పూజలు చేస్తున్న భక్తులు



క్యూలో నిల్చున్న భక్తులు (ఇన్‌సెట్‌లో) స్వామివారికి బిల్వార్చన పూజ నిర్వహిస్తున్న దృశ్యం

కీసర: కీసరగుట్ట భవానీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీకమాసోత్సవాల ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో చివరి సోమవారం గర్భాలయంలో కొలువైన శ్రీస్వామివారి (శివలింగానికి)కి వేదపండితులు కనుల పండువగా బిల్వార్చన పూజను నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం అనంతరం స్వామివారి వేదపండితులు బిల్వార్చన పూజతోపాటు, మాస శివరాత్రి సందర్భంగా యాగశాల వద్ద రుద్ర హోమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్తీకమాసం అందులో శివుడికి ఇష్టమైన రోజు సోమవారం కావడంతో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు కీసరగుట్టకు తరలివచ్చారు. గర్భాలయంలో కొలువైన మూలవిరాట్ స్వామివారిని దర్శించుకున్న అనంతరం యాగశాల, ప్రధాన గోపురానికి ఎదురుగా ఉన్న శివలింగాలకు పసుపుకుంకుమ, పాలతో అభిషేకాలు నిర్వహించి కార్తీకదీపాలను వెలిగించారు. వేదపండితులు కార్తీకమాసోత్సవ విశిష్టతను భక్తులకు తెలియజేస్తూ కార్తీకమాసంలో శివుడిని దర్శించుకొని కార్తీకదీపాలు వెలిగిస్తే కలిగే శుభాలను భక్తులకు తెలియజేశారు. అనంతరం భక్తులు కీసరగుట్ట దిగువ ప్రాంతంలోని హుడాపార్కులో కుటుంబ సమేతంగా వనభోజనాలు చేసి సేదతీరారు. ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. మంగళవారంతో కీసరగుట్టలో కార్తీక మాసోత్సవ పూజలు ముగియనున్నట్లు వేదపండితులు తెలిపారు. చివరిరోజు స్వామివారి తైలాభిషేకం, అన్నపూజలను నిర్వహించనున్నట్లు పండితులు తెలిపారు.

టీమ్ చాంపియన్‌గా టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ

సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) ఇంటర్ కాలేజీ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో మహిళల విభాగంలో తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజెస్ (టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ) జట్టు, పురుషుల విభాగంలో లయోలా అకాడమీ జట్టు టీమ్ చాంపియన్‌షిప్ టైటిల్స్ సాధించాయి. గోల్కొండలోని ఆర్టిలరీ సెంటర్ మైదానంలో ఈ మీట్‌ను నిర్వహించారు. మహిళల 100 మీటర్ల విభాగంలో బి.రాగవర్షిణి (సెయింట్ జోసెఫ్; 12.3 సెకన్లు) స్వర్ణ పతకం సాధించగా..ప్రణతి లాలిత్య (లయోలా అకాడమీ) రజతం, శ్రీ వైష్ణవి (లయోలా అకాడమీ) కాంస్యం గెలిచారు. మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో అంతర్జాతీయ అథ్లెట్ అగసార నందిని (టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ; 14.65 సెకన్లు) బంగారు పతకం నెగ్గగా.. ప్రణతి లాలిత్య రజతం, అంజలి యాదవ్ కాంస్యం కైవసం చేసుకున్నారు. జావెలిన్ త్రో, హైజంప్ ఈవెంట్స్‌లోనూ నందిని పసిడి పతకాలు సొంతం చేసుకోవడం విశేషం. పురుషుల 100 మీటర్ల విభాగంలో హర్షవర్ధన్ (లయోలా అకాడమీ; 11 సెకన్లు) స్వర్ణం గెలుపొందాడు.



విప్లవాత్మక మార్పులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దోహదం



ఆన్‌లైన్ సదస్సులో పాల్గొన్న వక్తలు

రాయదుర్గం: వివిధ రంగాలలో శాస్త్రీయ పరిశోధనల్లో విప్లవాత్మక మార్పులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దోహదం చేస్తోందని ఇన్‌వేని ఏఐ సంస్థ సీఈఓ డాక్టర్ కృష్ణన్‌నందబాలన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్స్ (ఎఫ్ఏబీఏ),హెచ్‌సీయూ ఆధ్వర్యంలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫర్ ఫార్మా అండ్ బయోటెక్ ఇన్ కొలాబరేషన్ విత్ సైన్స్ గురూస్'అనే అంశంపై ఆరు రోజులపాటు ఆన్‌లైన్‌లో నిర్వహించే సమావేశాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య సంరక్షణ ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతున్న ప్రకృతి దృశ్యంపై వివరించారు. ఆర్టిఫిషియల్ ఇటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ ఏకీకరణ రూపాంతరం చెందుతుందని రుజువు చేస్తోందన్నారు. ఐస్పిరిట్ ఇంజినీర్ డాక్టర్ సును మాట్లాడుతూ.. డేటా గోప్యత మోడల్ ధ్రువీకరణ, గుత్తాధిపత్య పద్ధతుల నివారణంగా గుర్తించబడిన ఈ రంగంలో రక్షణ మూడు ముఖ్యమైన స్తంభాలపై మరింత దృష్టి సారించాలన్నారు. సైన్స్ గురుస్ డాక్టర్ జగత్‌రెడ్డిజునుతుల, ప్రొ. డాక్టర్ బిందుమాధవరెడ్డి, ప్రిన్సిపల్ రీసెర్చ్ సైంటిస్ట్ డాక్టర్ వాసుదేవవర్మ, సిలికోట్రయల్స్ వ్యవస్థాపక సీఈఓడాక్టర్ లుకాఈమిలి ప్రసంగించారు.

29న ఏసీసీఈ, అల్ట్రాటెక్ అవార్డ్స్–2023



అవార్డుల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పంజగుట్ట: అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజినీర్స్ (ఇండియా) (ఏసీసీఈ(ఐ) హైదరాబాద్ రీజన్ ఆధ్వర్యంలో, అల్ట్రాటెక్ సిమెంట్ సహకారంతో సివిల్ ఇంజినీరింగ్‌లో మంచి కట్టడాలు కట్టిన వారికి, ఔట్‌స్టాండిగ్ స్ట్రక్చర్స్‌కు అవార్డులు ఇవ్వనున్నట్లు ఏసీసీఈ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ కాశీరామ్ తెలిపారు. ఈనెల 29న హెచ్‌ఐసీసీ హోటల్ నోవాటెల్‌లో (ఏసీసీఈ (ఐ) అల్ట్రాటెక్ అవార్డ్స్–2023 ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని వైస్ చైర్మన్ భీమ్‌రావు, సెక్రటరీ సి.రమేష్, నర్మద అల్ట్రాటెక్ సంస్థ ప్రతినిధి శ్రీనివాసరావులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్ రీజన్, వరంగల్ రీజన్ పేరుతో రెండుగా విభజించామని, హైదరాబాద్ రీజన్‌లో 14 జిల్లాలు ఉన్నాయని తెలిపారు. మొత్తం 17 విభాగాల్లో అవార్డులు ఇవ్వనున్నట్లు ప్రభుత్వ, ప్రైవేట్ నిర్మాణాలు, స్ట్రక్చర్స్‌ను పరిగణలోకి తీసకుంటామని తెలిపారు. గ్రీన్‌బిల్డింగ్, విద్యుత్ ఆదా చేయడం, స్టేర్‌కేస్ కరెక్టుగా ఉందా, ఫైర్ సేఫ్టీ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే అంశాలను పరిశీలించి అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు ఈనెల 19వ తేదీ లోపు accehyd@gmail.comకు మెయిల్ పంపించాలని తెలిపారు. 9 మంది నిష్ణాతులు జ్యూరీ సభ్యులు అన్ని దరఖాస్తులు పరిశీలించి భవనాలను సందర్శించి విజేతలను ఎన్నుకుంటారని తెలిపారు. యంగ్ ఇంజినీర్లకు కూడా అవార్డులు ఉన్నాయని తెలిపారు.

నిజాం కళాశాల విద్యార్థుల ఆందోళన



ధర్నా చేస్తున్న విద్యార్థినులు

గన్‌ఫౌండ్రీ: పలువురు విద్యార్థుల నుంచి ఎగ్జామ్ ఫీజు తీసుకోకుండా నిజాం కళాశాల ప్రిన్సిపల్ వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోమవారం కళాశాల విద్యార్థులు పరీక్షలను బహిష్కరించి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ భీమ 15 మంది విద్యార్థులను కావాలనే ఎగ్జామ్ ఫీజును తీసుకోకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. వంద మంది విద్యార్థులు నిరసన తెలిపినప్పటికీ కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ స్పందించకపోవడం ఎంతో బాధాకరమన్నారు. కొంతమంది విద్యార్థులే లక్ష్యంగా ఎగ్జామ్ ఫీజు కట్టించుకోకుండా ఒక సంవత్సరం పాటు డిటెండ్ అయ్యేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులతో కళాశాల సిబ్బంది సర్ది చెప్పడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

మల్లేపల్లి ఐటీఐలో | మైక్రోసాఫ్ట్ లెర్నింగ్ ల్యాబ్స్ ప్రారంభం



కార్యక్రమంలో వివిధ కంపెనీల ప్రతినిధులు

గోల్కొండ: యువతకు గ్రీన్ స్కిల్స్, ఎంప్లాయిమెంట్ రెడినెస్ కోసం మల్లేపల్లి ఐటీఐలో మైక్రోసాఫ్ట్ లెర్నింగ్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. సోమవారం మల్లెపల్లి ఐటీఐలో జరిగిన కార్యక్రమంలో టీఎస్ఎస్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధి రూపాటోహరా ముఖ్య అతిథిగా హాజరై ల్యాబ్స్‌ను మైక్రోసాఫ్ట్ కంపెనీ ప్రతినిధులతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రీన్ స్కిల్స్ ఫర్ యూత్‌లో భాగంగా ఐటీఐలలో చదివే విద్యార్థులకు అవసరమైన ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఫర్ మ్యానిఫ్యాక్చరింగ్ సెక్టార్ ప్రోగ్రామ్‌లో సహాయ పడేందుకు గ్రీన్ స్కిల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. హరిత పరిశ్రమకు సంబంధించిన ఆచరణాత్మక నైపుణ్యాలను విద్యార్థులకు అందించడానికి ఈ ల్యాబ్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆమె తెలిపారు. మైక్రోసాఫ్ట్ మద్దతుతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని అన్నారు. తక్కువ సామాజిక, ఆర్థిక నేపథ్యం నుంచి వచ్చిన యువతకు అవసరమైన నైపుణ్యాలతో సన్నద్ధం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఆమె అన్నారు. ఈ ల్యాబ్స్‌లో విద్యార్థులకు ఎన్నో పాఠ్యాంశాలు చేర్చబడ్డాయని అన్నారు. కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని ఆమె పేర్కొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం ॥ 12-12-2023

రాలిపోని ఆత్మవిశ్వాసం



"నిర్దిష్టమైన లక్షణాలు, ముఖ కవళికలు అందాన్ని నిర్వచించలేవు. ఎందుకంటే జుట్టు ఉన్నా లేకపోయినా గుండెల్లో ఆత్మవిశ్వాసం... పెదవులపై చిరునవ్వూ ఉంటే అందంగానే ఉంటారు" అని నిరూపించి, ఎంతోమందికి స్ఫూర్తినిస్తోంది **కేతకీ జానీ.** నలభైఏళ్ల వయసులో అలోపేసియా వ్యాధితో కేతకీ జుట్టు రాలిపోయినప్పటికీ కృంగిపోకుండా హెయిర్‌లెస్ మోడల్‌గా రాణిస్తూనే అలోపేసియా బాధితులకు అవగాహన కల్పిస్తూ ధైర్యాన్ని నూరిపోస్తోంది.



అహ్మదాబాద్‌లో పుట్టిన కేతకీ జానీ పుణెలో పెరిగింది. స్కూలు విద్యాభ్యాసం పూర్తయ్యాక బిఏ, బిఈడీ, ఎమ్ఏ చేసింది. మహారాష్ట్ర టెక్స్ట్‌బుక్ ప్రొడక్షన్‌లో ప్రత్యేక అధికారిగా పనిచేసేది. ఉన్నట్టుండి కేతకీ జుట్టు రాలిపోవడం మొదలైంది. అలా రాలిపోయిన ప్రదేశంలో కొత్త వెంట్రుకలు వచ్చేవి కావు. విచిత్రంగా అనిపించింది. జుట్టు ఇలా రాలిపోవడానికి అలోపేసియా అంటే పేనుకొరుకుడు వ్యాధి కారణమని డాక్టర్ చెప్పారు. ఈ సమస్యకు తాత్కాలిక ఉపశమనమే తప్ప శాశ్వత పరిష్కారం లేదని తెలిసి కేతకి తీవ్రనిరాశకు గురైంది.

జుట్టు రాలిపోయి తను అసహ్యంగా మారిపోతుందేమో అని భయపడిపోయింది. ఒకపాప, బాబుకు తల్లి అయిన కేతకికి భర్త కూడా మద్దతుగా నిలవకపోవడం, బంధువులు, ఇరుగు పొరుగు క్యాన్సరా? అని అడగడం, అంతా అవహేళన మాటలు, చూపులు... దాంతో తీవ్ర మనస్తాపానికి గురై జీవితాన్ని త్యజించాలనుకుంది. కానీ తను లేకపోతే పిల్లల పరిస్థితి ఏమవుతుందో తలచుకుని తన నిర్ణయాన్ని మార్చుకుంది. వ్యాధితోనే పోరాడుతూ బతకాలని నిర్ణయించుకుంది. గుండులా మారిన తలపైన టాటూలతో అందంగా అలంకరించుకుని ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుంది.

యాడ్ చూసి...

ఒకరోజు మిసెస్ ఇండియా వరల్డ్ వైడ్ కాంపిటీషన్ యాడ్ చూసి కాంపిటీషన్‌లో పాల్గొంది. ఆ పోటీలో పాల్గొన్న తొలి అలోపేసియా బాధితురాలిగా నిలిచింది. ఆ తర్వాత మిసెస్ యూనివర్స్ కాన్ఫిడెంట్‌గా, మిసెస్ పూనె, మిస్ అండ్ మిసెస్ పూనే ఇంటర్నేషనల్, మిసెస్ పాపులర్ వంటి అనేక టైటిల్స్‌ను వరుసగా గెలుచుకుంటూ వస్తోంది. కొప్పున్నా లేకున్నా ఆత్మవిశ్వాసమే అందం అని నిరూపించింది. హెయిర్ లెస్ మోడల్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న కేతకి తనలా మరెవరూ బాధపడకూడదన్న ఉద్దేశ్యంతో అలోపేసియా గురించిన అవగాహన కల్పిస్తోంది. వివిధ కార్యక్రమాల ద్వారా ఎంతో మంది బాధితులకు ధైర్యాన్ని నూరిపోస్తోంది.

అవహేళన కాదు అండగా నిలవండి..

"ఎంతో ఒత్తుగా ఉండే నా జుట్టు 2010 నుంచి ఊడిపోవడం మొదలైంది. దీంతో తీవ్ర నిరాశలో కృంగిపోయాను. అందరూ నన్ను అదోరకంగా చూస్తుండడంతో ఆఫీసుకు త్వరగా వెళ్లి త్వరగా వచ్చేసేదాన్ని. ఇలా కొన్నాళ్లు భయంభయంగా గడిపాను. జుట్టు లేకపోతేనేం? గుండు మీద టాటూలు వేసుకుంటే అందంగా కనిపించవచ్చన్న ఆలోచన వచ్చింది. వెంటనే టాటూలు వేసుకున్నాను. ఫరవాలేదనిపించి ధైర్యంగా మోడలింగ్‌లో అడుగు పెట్టాను. అక్కడ దక్కిన గౌరవంతో హెయిర్‌లెస్ మోడల్‌గా ఎదిగాను. నాలో ఆత్మవిశ్వాసం పెరిగిన తరువాత... నాకున్న సమస్య గురించి వివరించి చెప్పడం మొదలు పెట్టాను. అలోపేసియా గురించి అవగాహన కలిగించి గుండెల్లో ధైర్యం నింపితే బాధితులకు ఊరటగా ఉంటుంది" అని కేతకీ జానీ కోరుతోంది.



హై మోటివేషన్

కొండంత ధైర్యంతో...



కెప్టెన్ ఫాతిమా వసీమ్



సియాచిన్ పేరు వినబడగానే ఒంట్లో చలితో పాటు మృత్యుభయం కూడా దూరుతుంది.

శత్రువుల జాడను కనిపెట్టడం ఒక ఎత్తయితే, ప్రకృతే శత్రువుగా మారి ప్రాణాలు కబళించే ప్రమాదకర పరిస్థితి నుంచి బయట పడడం మరో ఎత్తు.

దేశం కోసం కొండంత ధైర్యంతో సియాచిన్ గ్లాసియర్‌లో విధులు నిర్వహిస్తున్నారు మన సైనికులు.

సియాచిన్ గ్లాసియర్‌లో విధులు నిర్వహించబోతున్న ఫస్ట్ ఉమన్ మెడికల్ ఆఫీసర్ (ఆపరేషనల్ పోస్ట్)గా ఫాతిమా వసీమ్ చరిత్ర సృష్టించింది...

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన యుద్ధ క్షేత్రం సియాచిన్ గ్లేసియర్. గడ్డకట్టే చలిలో మన సైనికుల సాహసం, అంకితభావం మాటలకు అందనివి. సముద్ర మట్టానికి 17,720 అడుగుల ఎత్తులో ఉన్న సియాచిన్‌లో శీతాకాలంలో పగలు ఏడు గంటలు మాత్రమే ఉంటుంది. ఆక్సిజన్ లెవెల్స్ సరిగ్గా ఉండకపోవడంతో సైనికులు ఎక్కువ సమయం నిద్ర పోవడానికి వీలు కాదు. షేవింగ్ చేసుకోవాలన్నా కష్టమే. ఒకవేళ చర్మం తెగితే గాయం మానడానికి చాలా సమయం పడుతుంటుంది. స్నానం చేయాలన్న కష్టమే.

ప్రత్యేక చీతా హెలికాప్టర్లు మాత్రమే ఇక్కడికి చేరుకోగలవు.

ఇక్కడ మూడు వేల మంది వరకు సైనికులు పనిచేస్తారు. ఒక్కో బెటాలియన్ మూడు నెలల వరకు గస్తీ విధులు నిర్వహిస్తుంది. మంచుకొండ చరియలు విరిగి పడడం ద్వారా ఎంతోమంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఒక్క మాటలో చెప్పాలంటే 'ప్రతికూలత' గురించి తప్ప 'అనుకూలత' గురించి ఒక్క మాట కూడా వినిపించని మృత్యుక్షేత్రంలోకి మెడికల్ ఆఫీసర్‌గా అడుగు పెట్టనుంది కెప్టెన్ ఫాతిమా వసీమ్.

'సియాచిన్ బ్యాటిల్ స్కూల్'లో ఎన్నో నెలల పాటు కఠోరమైన శిక్షణ పొందింది ఫాతిమా.



శిక్షణలో...



వైద్య సేవలు అందిస్తూ

'సియాచిన్ గ్లేసియర్‌పై ఆపరేషనల్ పోస్ట్‌లో విధులు నిర్వహించబోతున్న తొలి మహిళా వైద్యాధికారిగా ఫాతిమా వసీమ్ ఎంతోమందికి స్ఫూర్తిని ఇచ్చింది. ఇది చారిత్రక సందర్భం. కెప్టెన్ ఫాతిమా వసీమ్ ధైర్య సాహసాలు, అంకితభావాలకు అద్దం పట్టిన సందర్భం' అంటూ 'ఎక్స్'లో ఇండియన్ ఆర్మీ ఒక వీడియోను పోస్ట్ చేసింది.

'ఐసే జాగోరే సాథియో... దునియా సే జాకో బోలుదో' అనే పాట వినిపిస్తుండగా 'మీట్ కెప్టెన్ ఫాతిమా, ఏ సియాచిన్ వారియర్. ఉయ్ సెల్యూట్ హర్' అంటూ వీడియో మొదలవుతుంది. ఈ వీడియోలో 'సియాచిన్ బ్యాటిల్ స్కూల్'లో ఫాతిమా వసీమ్ శిక్షణ తీసుకుంటున్న, సైనికులకు వైద్యం చేస్తున్న దృశ్యాలు కనిపిస్తాయి.

విజేత

కాబోయే డాక్టరమ్మకు అందాల కిరీటం

'అందమే ఆనందం' అనుకోవడంతో పాటు 'ఆనందమే అందం' అనుకునే **రిజుల్ మైని** మిచిగాన్ (యూఎస్)లో మెడికల్ స్టూడెంట్. ఈ ఇండో-అమెరికన్ స్టూడెంట్ **'మిస్ ఇండియా యూఎస్‌ఏ 2023'** కిరీటాన్ని గెలుచుకుంది...



అందాల కిరీటంతో రిజుల్ మైని

'మిస్ ఇండియా యూఎస్ఏ' టైటిల్ గెలుచుకోవడానికి 25 రాష్ట్రాల నుంచి 57 మంది పోటీ పడ్డారు.

'వినయంతో, ఒకింత గర్వంతో నేను మిస్ ఇండియా యూఎస్ఏ 2023 అని చెబుతున్నాను. నా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం లేకపోతే ఈ విజయం సాధ్యం అయ్యేది కాదు. నా ప్రయాణంలో అడుగడుగునా స్నేహితులు అండగా నిలిచారు. విలువైన సూచనలు ఇచ్చారు' అంటుంది రిజుల్ మైని.

ఇరవై నాలుగు సంవత్సరాల ఇండియన్-అమెరికన్ రిజుల్ మైని తనను తాను మెడికల్ స్టూడెంట్, మోడల్‌గా పరిచయం చేసుకుంటుంది. సర్జన్ కావాలనేది తన లక్ష్యం.



స్కూలు రోజుల నుంచి చదువుకు ఎంత ప్రాధాన్యత ఇచ్చేదో, కళలు, సాంస్కృతిక సంబంధిత కార్యక్రమాలకు అంతే ప్రాధాన్యత ఇచ్చేది రిజుల్. మిచిగాన్ స్టేట్ యూనివర్శిటీలో 'హ్యూమన్ సైకాలజీ'లో బ్యాచిలర్ డిగ్రీ చేసిన రిజుల్‌కు ఖాళీ సమయం అంటూ ఉండదు. ఎప్పుడూ సందడి సందడిగా ఉంటుంది. ఆమె హాబీల జాబితాలో పెయింటింగ్, కుకింగ్, గోల్ఫింగ్... ఇలా ఎన్నో ఉన్నాయి.

స్వచ్ఛంద కార్యక్రమాలలోనూ ముందుంటుంది. వైద్యానికి సంబంధించిన సరికొత్త విషయాలు, పుస్తకాలకు సంబంధించిన సమాచారాన్ని సోషల్ మీడియాలో ఇతరులతో పంచుకోవడం అంటే ఇష్టం.

'కళ అనేది మనసులోని మాలిన్యాన్ని శుభ్రం చేస్తుంది' అనే మాట రిజుల్ మైనికి ఇష్టం. అందుకేనేమో ఆమెకు కళలు అంటే అంత ఇష్టం. కళలు ఉన్నచోట వెలుగు ఉంటుంది. ఆ వెలుగే అందం. ఆనందం.

సాగుబడి

జ్యేష్ఠ కార్తె: డిసెంబర్ 15 వరకు
మూల కార్తె: 16 నుంచి

బ్లాక్ సోల్జర్ ఫ్లై లార్వాతో
కోళ్ల ఫారాల కాలుష్యానికి చెక్

- బీఎస్ఎఫ్ లార్వాతో కోళ్ల ఫారంలో ఉండే ఈగలు, దుర్వాసన, అనారోగ్య సమస్యలు దూరం



- కోళ్ల విసర్జితాలపై బిఎస్ఎఫ్ పిల్ల పురుగులు చల్లక ముందు...
- విసర్జితాలను పిల్ల పురుగులు తిని ఎరువుగా మార్చిన తర్వాత..

కోళ్ల ఫారంలో కోళ్ల విసర్జితాల వల్ల కోళ్ల రైతులు, కార్మికులకే కాకుండా పరిసర ప్రాంతాల ప్రజలకు ఈగలు, దుర్వాసన పెద్ద సమస్యగా ఉంటుంది. కోళ్ల విసర్జితాలను ఆశించే ఈగలు మనుషులకు, కోళ్లకు ఆరోగ్య సమస్యలు తెచ్చిపెడుతున్నాయి. కోళ్ల విసర్జితాల నుంచి విడుదలయ్యే అమ్మోనియా వాయువు వల్ల కోళ్ల ఫారాల్లో పనిచేసే కార్మికులకు, రైతులకు కళ్లు మండటం, తలనొప్పి వంటి సమస్యలు రావటంతో పాటు కోళ్లకు సైతం తలనొప్పి, కంటి చూపు సమస్యలు తలెత్తుతూ ఉంటాయి.

లేయర్, బ్రీడర్ కోళ్ల ఫారాల కింద పోగుపడే కోళ్ల విసర్జితాల దుర్వాసన, ఈగల నివారణకు రసాయనాలు చల్లినప్పటికీ ఇది తీరని సమస్యగానే మిగిలిపోతోంది.

జనావాసాలకు దగ్గరగా ఉండే కోళ్ల ఫారాల దుర్గంధాన్ని, ఈగలను భరించలేని ప్రజలు వాటిని మూయించే పరిస్థితులు కూడా నెలకొంటూ ఉంటాయి. అయితే, ఈ సమస్యలను పర్యావరణహితంగా పరిష్కరించే ఓ మార్గాన్ని సూచిస్తున్నారు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఓ స్టార్టప్ వ్యవస్థాపకుడు యడ్లపాటి రమేష్.

బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్ఎఫ్) అనే హానికరం కాని ఈగకు చెందిన పిల్ల పురుగులను కోళ్ల ఫారంలోని విసర్జితాలపై వదిలితే కోళ్ల ఫారాల నుంచి దుర్వాసన సమస్య, విసర్జితాల యాజమాన్య సమస్యలు తీరిపోతాయని రమేష్ తెలిపారు. కోళ్ల వ్యర్థాలను – వర్మి కంపోస్ట్ ప్రక్రియ లాగా మారుస్తూ బిఎస్ఎఫ్ లార్వా (పిల్ల పురుగులు) పెరుగుతాయి. నెలకొక సారి వీటిని కోళ్ల ఫారంలో విసర్జితాలపై వేసుకుంటే చాలు. కోళ్ల ఫారాల నుంచి వ్యర్థాల దుర్వాసన నుంచి 95% పైగా విముక్తి కలిగించడానికి సహజ ప్రక్రియ అయిన బ్లాక్ సోల్జర్ ఫ్లై లార్వా ఒక మంచి పరిష్కారమని ఆయన చెబుతున్నారు. గత ఐదారేళ్లుగా బిఎస్ఎఫ్ లార్వా ఉత్పత్తిపై పనిచేస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో కోళ్ల రైతులకు ఈ లార్వాను అందిస్తూ కాలుష్య నియంత్రణకు, ఆరోగ్య రక్షణకు కృషి చేస్తున్నామని ఆయన అన్నారు.

లార్వాను కోళ్ల విసర్జితాల (లిట్టర్)పై నెలకోసారి చల్లటం వల్ల ఉపయోగాలు:

- సాధారణ ఈగలు పూర్తిగా తగ్గిపోతాయి. కోళ్ల విసర్జితాలపై ఈగలు అరికట్టేందుకు ఉపయోగించే మందులు, అలాగే ఈగల లార్వాను నిర్మూలించడానికి, ఫీడ్‌లో ఇచ్చే మందులు అసలు అవసరం లేదు
- దుర్వాసన తగ్గుతుంది
- కోళ్ల విసర్జితాల నుంచి వెలువడే అమ్మోనియా తగ్గిపోతుంది. కోళ్ల ఫారంలో ఆక్సిజన్ స్థాయి పెరుగుతుంది. కళ్ళు మంటలు, సిఆర్‌డి సమస్య తగ్గుతుంది
- విసర్జితాలను బిఎస్ఎఫ్ పిల్ల పురుగులు ఎరువుగా మార్చే క్రమంలో, విసర్జితాల్లో తేమ తగ్గిపోయి, దుర్వాసన కూడా తగ్గుతుంది. సున్నం, బ్లీచింగ్ అవసరం ఉండదు. వీటి ఖర్చు తగ్గుతుంది.
- విసర్జితాల నిర్వహణకు కూలీలు, స్ప్రేయర్లు, మందుల ఖర్చు ఆదా అవుతుంది
- కోళ్ల విసర్జితాలపై ఉండే సాల్మొనెల్లా, ఈ-కొలి వంటి హానికారక సూక్ష్మక్రిములను అరికడతాయి
- ఆర్గానిక్ కంపోస్ట్‌గా మారిన కోళ్ల విసర్జితాలను రైతులు మంచి ధరకు విక్రయించుకోవచ్చు
- బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను విసర్జితాలపై చల్లటం అనే సహజ సిద్ధమైన ప్రక్రియ వల్ల.. కోళ్లకు, పనివారికి, చుట్టపక్కల నివసించే ప్రజలకు ఇబ్బందులు తప్పటమే కాకుండా, పర్యావరణానికి కూడా ఎంతో మేలు జరుగుతుంది.
- చనిపోయిన కోళ్లను, పగిలిపోయిన గుడ్లను త్వరగా కుళ్ళబెట్టడానికి, దుర్వాసన, బాక్టీరియా తగ్గడానికి కూడా బిఎస్ఎఫ్ లార్వా ఉపయోగపడుతుంది
- కోళ్ల ఫారం పరిసర ప్రాంతాలు ఆరోగ్యకరంగా, కాలుష్యరహితంగా తయారై కోళ్ల ఆరోగ్యం బాగుంటుంది. ఉత్పాదకత 1-2 శాతం పెరుగుతుంది
- బిఎస్ఎఫ్ గుడ్డు నుంచి ఈగ వరకు జీవితకాలం మొత్తం 45 రోజులు. గుడ్డు నుంచి పిల్లలను ఉత్పత్తి చేయటం అనేది తక్కువ ఉష్ణోగ్రత, అధిక తేమ గల వాతావరణంలో జరగాల్సి ఉంటుంది.

మరోన్నో ఉపయోగాలు...

- 20 రోజుల వయసులో గోధుమ రంగులో ఉండే బిఎస్ఎఫ్ పురుగులు బతికి ఉండగానే లేయర్ కోళ్లకు, బ్రాయిలర్ కోళ్లకు, నాటు కోళ్లకు 10-20% మేరకు సాధారణ మేత తగ్గించి మేపవచ్చు
- వంటింటి వ్యర్థాలు, ఆహార వ్యర్థాలపై ఈ బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను వేసి పెంచవచ్చు. 15 రోజుల తర్వాత ఆ లార్వాను పెంపుడు కుక్కలకు /పిల్లులకు /పక్షులకు మేతగా వేయొచ్చు.
- బతికి ఉన్న పురుగులు మేపవచ్చు. లేదా ఎండబెట్టి లేదా పొడిగా మార్చి కూడా వాడుకోవచ్చు
- ఆక్వా చెరువుల్లో రోజుకు మూడు సార్లు మేత వేస్తూ ఉంటారు. ఒక మేతను బిఎస్ఎఫ్ లార్వాను మేపవచ్చని రమేష్ చెబుతున్నారు. **వివరాలకు: 91541 60959**

కత్తిరిస్తుంది.. కట్టలు కడుతుంది!

- మల్బరీ తోటలో కొమ్మలు కత్తిరించి, మూట కట్టే పరికరాన్ని రూపొందించిన యువకుడు
- పట్టు పురుగులు పెంచే రైతులకు 90% కూలి ఖర్చులు ఆదా అవుతాయంటున్న ఆవిష్కర్త
- పత్తి, కంది కట్టెలను కత్తిరించి, కట్టలు కట్టడానికి కూడా పనికివస్తుందని ఆశాభావం
- త్వరగా, సులువుగా పని పూర్తవటంతో పాటు ఖర్చు తక్కువ



వ్యవసాయ పనుల్లో శారీరక శ్రమ తగ్గించే యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చిన కొద్దీ రైతులకు పని సులువు కావటంతో పాటు ఖర్చు కూడా తగ్గుతూ ఉంటుంది. పట్టు పురుగుల పెంపకంలో భాగంగా జరిగే మల్బరీ తోటలు సాగు చేసే రైతులు సాధారణంగా 28 రోజుల్లో ఒక విడత పట్టు గూళ్ల పెంపకం పని పూర్తి చేస్తూ ఉంటారు. ఈ క్రమంలో మల్బరీ మొక్కల్ని పెంచి, కొమ్మల్ని కత్తిరించి వాటిని షెడ్‌లో పెరిగే పట్టు పురుగులకు ఆహారంగా వేస్తూ ఉంటారు. ఇప్పటి వరకు బ్రష్ కట్టర్‌తో వ్యవసాయ కార్మికుడు కొమ్మ కత్తిరిస్తే, ఆ కొమ్మలను మరో కార్మికుడు కట్టకట్టి షెడ్డుకు చేరుస్తూ ఉంటారు. ఈ ప్రక్రియలో మూడు దశల్లో కార్మికుల అవసరం ఉంటుంది. కూలీల కొరతతో కూలి పెరిగిపోవటం వల్ల ఖర్చు పెరిగింది. కొడవళ్లతో కొమ్మ కత్తిరింపు, సేకరణ అధిక శారీరక శ్రమతో కూడిన పని కావటంతో పెరిగిన దశలో పట్టు పురుగులు అధిక మొత్తంలో మల్బరీ ఆకులు మేపాల్సి ఉంటుంది.

ట్రాక్టరుకు జోడించి వాడే పరికరం

అయితే, గ్రామీణ ఆవిష్కర్త, రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం జిల్లెళ్ల గ్రామానికి చెందిన యువకుడు కొడిముంజ ప్రవీణ్ రూపొందించిన పరికరం ద్వారా సులువుగా, త్వరగా, తక్కువ మంది కూలీలతోనే ఏ రోజు కత్తిరించిన ఆకులను ఆ రోజు పురుగులకు మేపటం ద్వారా మంచి ఫలితాలు సాధిస్తున్నామని రైతులు చెబుతున్నారు. ప్రవీణ్ గత 12 ఏళ్లుగా రైతులకు ఉపయోగపడే పవర్ వీడర్లు, ట్రాక్టర్‌కు జోడించి ఉపయోగించే వ్యవసాయ పరికరాలను తయారు చేసి విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక పట్టుపురుగుల పెంపకందారుల సూచన మేరకు 2023 ఆగస్టులో మల్బరీ కొమ్మలు కత్తిరించే ట్రాక్టర్ అటాచ్‌మెంట్‌ను తయారు చేశారు. 3 అడుగుల దూరంలో వరుసలుగా నాటిన మల్బరీ మొక్కలను నేల నుంచి 5 అంగుళాల ఎత్తులో కత్తిరించి పక్కకు పడేసేలా దీన్ని రూపొందించారు. సిరిసిల్ల, సిద్ధిపేట జిల్లాల్లోని నలుగురు రైతులకు ఈ పరికరాలను విక్రయించారు.

పలమనేరు రైతుల సూచనలతో..

ప్రవీణ్ ఈ పరికరం గురించి పల్లె సృజన సంస్థకు తెలియజేయగా, మల్బరీ సాగు విస్తారంగా జరుగుతున్న చిత్తూరు జిల్లా పలమనేరు ప్రాంత రైతులకు ఈ పరికరాన్ని చూపించారు. కొమ్మ కత్తిరించటంతోపాటు కట్ట కట్టి పడేసేలా దీన్ని అభివృద్ధి చేస్తే కూలీల అవసరం బాగా తగ్గుతుందని రైతులు సూచించారు. ప్రవీణ్ రెండు నెలలు శ్రమించి ఈ పరికరాన్ని రైతుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయటంలో విజయం సాధించారు. నెల నెలా మల్బరీ కొమ్మ కత్తిరించడానికే కాకుండా.. ఏడాదికి, రెండేళ్లకోసారి మల్బరీ చెట్టు దుంప కొట్టడానికి కూడా ఈ పరికరం చక్కగా ఉపయోగపడుతోందని రైతులు సంతోషంగా చెబుతున్నారని ప్రవీణ్ తెలిపారు. బ్రష్ కట్టర్‌తో 8-9 గంటల్లో చేసిన పనిని తాను రూపొందించిన పరికరాన్ని ట్రాక్టర్‌కు జోడించి ఒక గంటలో పూర్తి చేయొచ్చని ప్రవీణ్ చెబుతున్నారు. 200 కిలోల బరువుండే ఈ పరికరాన్ని స్థానికంగా కొనుగోలు చేసిన ఇనుముతో తయారు చేయడానికి రూ. 1,65,000 వరకు ఖర్చయ్యింది. పెద్ద సంఖ్యలో తయారు చేస్తే 10-15% ఖర్చు తగ్గుతుందంటున్నారు ప్రవీణ్.

పత్తి రైతులకూ ఉపయోగమే!

మల్బరీ కొమ్మల కత్తిరింపు, సేకరణకు సంబంధించి 5-6గురు కూలీలు చేసే పనిని 2-3గురు కూలీలతోనే సులువుగా చేసుకోవడానికి ఈ పరికరం ఉపయోగపడుతోందని రైతులు సంతోషంగా చెబుతున్నారు. మల్బరీకే కాకుండా పత్తి తీత పూర్తయిన తర్వాత పత్తి కట్టె కొట్టడానికి, కంది కట్టె కొట్టడానికి, పశుగ్రాసం కోయడానికి కూడా ఈ పరికరం ఉపయోగపడుతుందని రైతులు చెబుతుంటే సంతోషంగా ఉంది.
- కొడిముంజ ప్రవీణ్
(88863 81657),
మల్బరీ కత్తిరింపు పరికరం రూపకర్త, జిల్లెళ్ల గ్రామం, తంగళ్లపల్లి మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా



ప్రకృతి సేద్యానికి ప్రమాణాలు!

- ముసాయిదా విడుదల చేసిన బిఐఎస్
- డిసెంబర్ 26లోగా సవరణలు సూచించవచ్చు

మన దేశంలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో, రైతులు చాలా సంవత్సరాలుగా విస్తృతంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నప్పటికీ నిర్దుష్ట ప్రమాణాలు లేవు. భారతీయ నమూనా ప్రకృతి సేద్యం అంతకంతకూ విస్తరించటం.. ఎఫ్.ఎ.ఓ. వంటి అనేక అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. ప్రకృతి వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్‌కు సహకార వ్యవస్థ ఏర్పాటవుతున్నది. ఈ నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయానికి, ఉత్పత్తుల లేబులింగ్‌కు భారతీయ ప్రమాణాలను నిర్వచించుకోవాల్సిన అవసరం వచ్చింది. కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణీ మంత్రిత్వ శాఖకు చెందిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్) ఒక ముసాయిదా పత్రాన్ని వెలువరించింది. 27 పేజీల డ్రాఫ్ట్ స్టాండర్డ్స్‌ను వెబ్‌సైట్‌లో పెట్టింది. ప్రకృతి సాగు పద్ధతులు, ద్రావణాలు, కషాయాలు, అంతర పంటలు, మిశ్రమ పంటలు, ఆగ్రోఫారెస్ట్రీ.. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల బ్రాండింగ్, నిల్వ, ప్యాకేజింగ్‌తో పాటు.. సేంద్రియ-ప్రకృతి వ్యవసాయాల మధ్య వ్యత్యాసాలు ఇందులో ఉన్నాయి. శాస్త్రవేత్తలు, స్వచ్ఛంద కార్యకర్తలు, రైతు శాస్త్రవేత్తలు, ఆహార నిపుణులు, సంస్థలు, ప్రజల నుంచి సలహాలు, సూచనలు కోరుతున్నది. తుది గడువు 2023 డిసెంబర్ 26 .

www.services.bis.gov.in ఈ వెబ్‌సైట్‌లోని ముసాయిదా ప్రమాణాల పీడీఎఫ్ కోసం ఈ క్యూ.ఆర్. కోడ్ స్కాన్ చేయండి.

14 నుంచి విశాఖ ఆర్గానిక్ మేళా

విశాఖపట్నంలో ఈ నెల 8-10 తేదీల్లో జరగాల్సిన ఆర్గానిక్ మేళా మిచౌంగ్ తుపాను కారణంగా ఈ నెల 14-17 తేదీలకు వాయిదా పడింది. గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం, ఏపీ ప్రభుత్వ రైతు సాధికార సంస్థ, సుస్థిర వ్యవసాయ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌లో సేంద్రియ/ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం మేళా జరగనుంది. విశాఖలో జరుగుతున్న నాలుగో వార్షిక ఆర్గానిక్ మేళా ఇది. 14న ఉ. 10 గంటలకు సేంద్రియ/ప్రకృతి రైతులు– రైతు శ్రేయోభిలాషుల సమ్మేళనం, 15న గ్రాడ్యుయేట్ ప్రకృతి వ్యవసాయదారులు, విద్యార్థుల సదస్సు, 16న ఏపీ ఛాంబర్ ఆఫ్ ఆర్గానిక్స్ సమావేశం, 17న ఇంటిపంటలు/మిద్దెతోటలపై సదస్సు జరుగుతుందని నిర్వాహకులు కుమారస్వామి తెలిపారు. ప్రవేశం ఉచితం. వివరాలకు.. 78934 56163, 86862 24466.

నిర్వహణ: పంతంగి రాంబాబు
సాగుబడి డెస్క్



శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ జట్టుకు ఆరో గెలుపు

ఐ-లీగ్ జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) ఆరో విజయం సాధించింది. హైదరాబాద్‌లో సోమవారం జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి జట్టు 1-0తో ఢిల్లీ ఎఫ్‌సీపై గెలిచింది. ఆట 65వ నిమిషంలో ఢిల్లీ ప్లేయర్ గగన్‌దీప్ బాలి 'సెల్ఫ్ గోల్' చేశాడు. 13 జట్లు పోటీపడుతున్న ఐ-లీగ్‌లో ప్రస్తుతం 10 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న శ్రీనిధి జట్టు 20 పాయింట్లతో మొహమ్మదాన్ స్పోర్టింగ్ క్లబ్‌తో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉంది.

నేడు క్వార్టర్ ఫైనల్లో నెదర్లాండ్స్‌తో భారత్ 'ఢీ'



జూనియర్ పురుషుల అండర్-21 ప్రపంచకప్ హాకీ టోర్నీలో నేడు భారత జట్టుకు కఠిన పరీక్ష ఎదురుకానుంది. కౌలాలంపూర్‌లో ఈరోజు జరిగే క్వార్టర్ ఫైనల్లో పటిష్టమైన నెదర్లాండ్స్‌తో భారత జట్టు తలపడనుంది. భారత కాలమానం ప్రకారం ఉదయం గం. 8:45 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. జూనియర్‌స్థాయిలో చివరిసారి 2005లో నెదర్లాండ్స్ జట్టుపై భారత్ గెలిచింది.

జైపూర్ గెలుపు బోణీ



బెంగళూరు: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్ జట్టు తొలి విజయం సాధించింది. గుజరాత్ జెయింట్స్‌తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 35-32తో గెలిచింది. విరామ సమయానికి 12-20తో వెనుకబడి ఉన్న జైపూర్ జట్టు రెండో అర్ధభాగంలో పుంజుకుంది. రెయిడర్ అర్జున్ దేశ్వాల్ అత్యధికంగా 15 పాయింట్లు స్కోరు చేసి జైపూర్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. మరో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 38-36తో యూపీ యోధాస్‌ను ఓడించి ఈ సీజన్‌లో ఐదో మ్యాచ్‌లో తొలి విజయాన్ని అందుకుంది. బెంగళూరు తరఫున వికాశ్, భరత్ 11 పాయింట్ల చొప్పున స్కోరు చేశారు. నేడు జరిగే మ్యాచ్‌లో పట్నా పైరేట్స్‌తో బెంగాల్ వారియర్స్ తలపడుతుంది.

ప్రొ కబడ్డీ లీగ్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
గుజరాత్ జెయింట్స్	5	3	2	0	17
బెంగాల్ వారియర్స్	3	2	0	1	13
యూపీ యోధాస్	4	2	2	0	12
పట్నా పైరేట్స్	2	2	0	0	10
పుణేరి పల్టన్	2	2	0	0	10
హరియాణా స్టీలర్స్	3	2	1	0	10
జైపూర్ పింక్ పాంథర్స్	3	1	1	1	9
బెంగళూరు బుల్స్	5	1	4	0	9
దబంగ్ ఢిల్లీ	3	1	2	0	6
యు ముంబా	3	1	2	0	6
తమిళ్ తలైవాస్	2	1	1	0	5
తెలుగు టైటాన్స్	3	0	3	0	1

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

తొలి రోజు ఆట రద్దు

పాచెఫ్‌స్ట్రూమ్: భారత్ 'ఎ', దక్షిణాఫ్రికా 'ఎ' జట్ల మధ్య నాలుగు రోజుల తొలి అనధికారిక టెస్టు తొలి రోజు ఆట రద్దయింది. భారత 'ఎ' జట్టు కెప్టెన్ కోన శ్రీకర్ భరత్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. టాస్ ముగిశాక వర్షం మొదలై ఎంతకూ తగ్గకపోవడంతో సోమవారం ఒక్క బంతి ఆట కూడా సాధ్యపడలేదు.

వరుణుడు కరుణిస్తేనే...

- నేడు భారత్, దక్షిణాఫ్రికాల మధ్య రెండో టి20 మ్యాచ్
- పొంచి ఉన్న వానముప్పు
- రాత్రి గం.8:30 నుంచి 'స్టార్ స్పోర్ట్స్-1'లో ప్రత్యక్ష ప్రసారం



తిలక్, ఇషాన్, సూర్య, యశస్వి

పోర్ట్ ఎలిజబెత్: వచ్చే ఏడాది టి20 ప్రపంచకప్‌కు ముందు అందుబాటులో ఉన్న ఈ కొన్ని అంతర్జాతీయ మ్యాచ్‌లతో జట్టును సిద్ధం చేసుకోవాలని ఇటు భారత్, అటు దక్షిణాఫ్రికాలు చూస్తుంటే ప్రతికూల వాతావరణం పెను సమస్యగా మారింది. తొలి మ్యాచ్ వర్షంలో కొట్టుకుపోగా... ఇప్పుడు రెండో టి20కి కూడా వానముప్పు ఉండటం ఇరు జట్లకు ఇబ్బందిగా మారింది. జట్లకే కాదు... మ్యాచ్‌ల్ని ఆస్వాదించాలనుకున్న అభిమానులకు, రూ.కోట్లు గడించాలనుకున్న దక్షిణాఫ్రికా బోర్డు (సీఎస్ఏ)కు కూడా ఈ వాతావరణ పరిస్థితులు కొత్త సమస్యలు తెచ్చిపెడతాయి. కాబట్టి ఆలస్యంగా మొదలవనున్న రెండో మ్యాచ్‌కు వర్షం తెరిపినివ్వాలని అంతా కోరుకుంటున్నారు. కనీసం కుదించిన ఓవర్ల మ్యాచ్ జరిగినా మెరుపుల టి20ని చూడొచ్చని ఆశిస్తున్నారు.

టాస్ పడితే...


డర్బన్‌లో కనీసం టాస్ కూడా పడలేదు. ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగబోయే జట్లు టాస్ పడి ఆటకు బాట పడాలని గట్టిగా కోరుకుంటున్నారు. ఆసీస్‌తో సొంతగడ్డపై యువభారత్‌ను నడిపించిన సూర్యకుమార్‌కు ఈ సిరీస్‌లో ఇటు బ్యాటింగ్, అటు బౌలింగ్‌లో పలువురు అనుభవజ్ఞులు శుబ్‌మన్ గిల్, రవీంద్ర జడేజా, సిరాజ్‌లు జతవడంతో టీమిండియా క్లీన్‌స్వీప్ లక్ష్యంగా బరిలోకి దిగింది. ఆస్ట్రేలియాపై అదరగొట్టిన రింకూ సింగ్, జితేశ్ శర్మ, రవి బిష్ణోయ్‌లు కూడా తమ ప్రదర్శన కొనసాగించాలనుకుంటున్నారు. కానీ వరుణుడు మాత్రం కరుణించడం లేదు. మరోవైపు దక్షిణాఫ్రికా జట్టు కొత్త ముఖాలు మాథ్యూ బ్రీట్జ్‌కె, బర్గర్‌లను పరీక్షించాలనుకుంటే కుదరడం లేదు. దీంతో బవుమా లేని జట్టులో మార్క్‌రమ్ తన మార్క్ చూపించేందుకు అవకాశం చిక్కడం లేదు. మ్యాచ్ రోజు వానపడినా... మ్యాచ్ సమయానికల్లా తెరిపినిస్తే బాగుంటుంది. ఇదే జరిగితే ఇరుజట్లలోని యువ ఆటగాళ్లంతా కొండంత ఊరట పొంది ఆటపై దృష్టిపెడతారు. తమ సత్తా చాటుకునేందుకు వారంతా సిద్ధంగా ఉన్నారు.

జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), శుబ్‌మన్ గిల్, రుతురాజ్, శ్రేయస్ అయ్యర్, రింకూ సింగ్, జితేశ్ శర్మ, జడేజా, ముకేశ్ కుమార్, కుల్దీప్ యాదవ్/రవి బిష్ణోయ్, సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్. **దక్షిణాఫ్రికా:** మార్క్‌రమ్ (కెప్టెన్), హెండ్రిక్స్, బ్రీట్జ్‌కె, స్టబ్స్/క్లాసెన్, మిల్లర్, ఫెరీరా, జాన్సెన్/ఫెలుక్‌వాయో, కేశవ్ మహరాజ్, కొయెట్జీ, బర్గర్, షమ్సీ.

ముగ్గురు కొత్తవారికి చోటు

భారత్‌తో టెస్టు సిరీస్‌కు ఇంగ్లండ్ జట్టు ప్రకటన



అట్కిన్సన్

లండన్: వచ్చే నెలలో భారత్‌లో ఐదు టెస్టుల సిరీస్ కోసం పర్యటించే ఇంగ్లండ్ జట్టును సోమవారం ప్రకటించారు. 16 మంది సభ్యులతో కూడిన ఇంగ్లండ్ టెస్ట్ జట్టులో ముగ్గురు కొత్త ప్లేయర్లు గస్ అట్కిన్సన్, టామ్ హార్ట్‌లే, షోయబ్ బషీర్‌లకు తొలిసారి చోటు లభించింది. కౌంటీ క్రికెట్‌లో సర్రే క్లబ్‌కు ప్రాతినిధ్యం వహించే 25 ఏళ్ల పేస్ బౌలర్ అట్కిన్సన్ ఇప్పటికే ఇంగ్లండ్ తరఫున తొమ్మిది వన్డేలు, రెండు టి20 మ్యాచ్‌లు ఆడాడు. ఇంగ్లండ్ బృందంలో నలుగురు స్పెషలిస్ట్ స్పిన్నర్లు రేహాన్ అహ్మద్, జాక్ లీచ్, హార్ట్‌లే, షోయబ్ బషీర్ ఉండటం విశేషం. భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య ఐదు టెస్టుల సిరీస్ జనవరి 25 నుంచి 29 వరకు హైదరాబాద్‌లో జరిగే తొలి మ్యాచ్‌తో మొదలవుతుంది. రెండో టెస్ట్ (ఫిబ్రవరి 2-6) విశాఖపట్నంలో, మూడో టెస్ట్ (ఫిబ్రవరి 15-19) రాజ్‌కోట్‌లో, నాలుగో టెస్ట్ (ఫిబ్రవరి 23-27) రాంచీలో, ఐదో టెస్ట్ (మార్చి 7-11) ధర్మశాలలో జరుగుతాయి.

ఇంగ్లండ్ టెస్ట్ జట్టు: బెన్ స్టోక్స్ (కెప్టెన్), జో రూట్, బెయిర్‌స్టో, హ్యారీ బ్రూక్, జాక్ క్రాలీ, ఒలీ పోప్, జేమ్స్ అండర్సన్, బెన్ డకెట్, బెన్ ఫోక్స్, జాక్ లీచ్, ఒలీ రాబిన్సన్, మార్క్ వుడ్, రేహాన్ అహ్మద్, షోయబ్ బషీర్, టామ్ హార్ట్‌లే, జాక్ లీచ్, అట్కిన్సన్.

సెమీఫైనల్లో హరియాణా

రాజ్‌కోట్: లెగ్ స్పిన్నర్ యుజువేంద్ర చహల్ (4/37) మాయాజాలం... అంకిత్ కుమార్ (102; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు) శతకం... వెరసి విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీలో 12 ఏళ్ల తర్వాత హరియాణా జట్టు మళ్లీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. బెంగాల్ జట్టుతో సోమవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో హరియాణా నాలుగు వికెట్ల తేడాతో గెలిచింది. ముందుగా బెంగాల్ 50 ఓవర్లలో 225 పరుగులకు ఆలౌటైంది. షహబాజ్ అహ్మద్ (100; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీతో రాణించాడు. అనంతరం హరియాణా 45.1 ఓవర్లలో 6 వికెట్లకు 226 పరుగులు సాధించి విజయం సాధించింది. ఇతర క్వార్టర్ ఫైనల్స్‌లో రాజస్తాన్ 200 పరుగుల తేడాతో కేరళపై, కర్ణాటక ఏడు వికెట్ల తేడాతో విదర్భపై, తమిళనాడు ఏడు వికెట్ల తేడాతో ముంబైపై గెలుపొంది సెమీఫైనల్ చేరుకున్నాయి.

అండర్-16 టోర్నీలో ద్రవిడ్ X సెహ్వాగ్

విజయ్ మర్చంట్ టోర్నీ బరిలో దిగ్గజాల కుమారులు



అన్వయ్



ఆర్యవీర్

సాక్షి, మంగళగిరి: సడెన్‌గా చూస్తే అండర్-16 టోర్నీ ఏంటి? ద్రవిడ్, సెహ్వాగ్‌లు ముఖాముఖిగా తలపడటం ఏంటనే సందేహాలు రావడం ఖాయం. కానీ ఇది దిగ్గజాల మధ్య సమరం కాదు. వారి తర్వాతి తరం పోటీపడుతున్న టోర్నీ సంగతి! టీమిండియాకు ఏళ్ల తరబడి రాహుల్ ద్రవిడ్, వీరేంద్ర సెహ్వాగ్ కలిసి టాపార్డర్‌ను నడిపించారు. గెలిపించారు. ఇప్పుడు బీసీసీఐ దేశవాళీ జూనియర్ టోర్నీ అయిన విజయ్ మర్చంట్ ట్రోఫీలో కర్ణాటక అండర్-16 జట్టు కెప్టెన్‌గా అన్వయ్ ద్రవిడ్ (ద్రవిడ్ రెండో కుమారుడు), ఢిల్లీ అండర్-16 జట్టు ఓపెనర్‌గా ఆర్యవీర్ సెహ్వాగ్ (సెహ్వాగ్ పెద్ద కుమారుడు) బరిలోకి దిగారు. దీంతో మంగళగిరిలోని ఏసీఏ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్ వార్తల్లో విశేషంగా నిలిచింది. మూడు రోజుల ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక తొలి ఇన్నింగ్స్‌లో 56.3 ఓవర్లలో 144 పరుగుల వద్ద ఆలౌటైంది. అయితే వికెట్ కీపర్, కెప్టెన్ అన్వయ్ (0) డకౌటయ్యాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఢిల్లీ 30 ఓవర్లలో వికెట్ నష్టానికి 107 పరుగులు చేసింది. ఆర్యవీర్ సెహ్వాగ్ (98 బంతుల్లో 50 బ్యాటింగ్; 7 ఫోర్లు, 1 సిక్స్) అజేయ అర్ధసెంచరీ చేశాడు. తొలిరోజు ఆటను పరిశీలిస్తే... ఒక విధంగా టీనేజ్ ద్రవిడ్ టీమ్‌పై కుర్ర సెహ్వాగ్ పైచేయి సాధించాడు.

77 స్థానాలు... 333 ఆటగాళ్లు

19న దుబాయ్‌లో ఐపీఎల్ వేలం



న్యూఢిల్లీ: దుబాయ్‌లో ఐపీఎల్-2024 సీజన్ కోసం ఆటగాళ్ల వేలానికి సర్వం సిద్ధమైంది. ఈనెల 19న వేలం కార్యక్రమం జరుగుతుంది. మొత్తం 1166 మంది ఆటగాళ్లు నమోదు చేసుకోగా... ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఫ్రాంచైజీలతో సంప్రదించాక 333 మందితో సోమవారం తుది జాబితాను ప్రకటించింది. ఇందులో 119 మంది విదేశీ ఆటగాళ్లు ఉన్నారు. వన్డే వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియాను విజేతగా నిలపడంలో కీలకపాత్ర పోషించిన ట్రావిస్ హెడ్‌పై ఫ్రాంచైజీలన్నీ కన్నేశాయి. కమిన్స్, మిచెల్ స్టార్క్‌లు కూడా ఆసీస్ తరఫున హాట్ కేక్‌లు కానున్నారు. ప్రపంచకప్‌లో సెమీఫైనలిస్టుగా నిలిచిన న్యూజిలాండ్ తరఫున మెరిసిన రచిన్ రవీంద్రపై కూడా కోట్లు కురిసే అవకాశాలున్నాయి. ఇక ఫ్రాంచైజీల విషయానికొస్తే మొత్తం 10 జట్లకు కావాల్సింది 77 మంది ఆటగాళ్లయితే ఇందులో 30 విదేశీ బెర్తులున్నాయి. ఇందుకోసం రూ. 262.95 కోట్లు వెచ్చించాల్సి ఉంది. ఖాళీల పరంగా చూస్తే అత్యధికంగా కోల్‌కతా నైట్‌రైడర్స్ 12 మందిని కొనుక్కోవాల్సి ఉండగా... ఆ జట్టు చేతిలో రూ. 32.70 కోట్లు అందుబాటులో ఉన్నాయి. ఇక అత్యధికమొత్తం రూ.38.15 కోట్లు గుజరాత్ వద్ద ఉంటే వారికి 8 మంది ఆటగాళ్లు కావాలి. కనిష్ట మొత్తం రూ. 13.15 కోట్లు లక్నో సూపర్ జెయింట్స్ ఖాతాలో ఉండగా... వారు ఆరు బెర్తుల్ని భర్తీ చేసుకోవాల్సి ఉంటుంది. ధోని టీమ్ చెన్నై ఖాతాలో రూ. 31.40 కోట్లు, కోహ్లీ జట్టు బెంగళూరు ఖాతాలో రూ. 23.25 కోట్లు అందుబాటులో ఉండగా ఇరుజట్లకు ఆరుగురు చొప్పున ఖాళీలున్నాయి. హైదరాబాద్ నుంచి అభిషేక్ మురుగన్, రాహుల్ బుద్ధి, రోహిత్ రాయుడు, అనికేత్ రెడ్డి, రవితేజ, తనయ్ త్యాగరాజన్, అరవెల్లి అవినాశ్‌రావు, రక్షణ్ రెడ్డి, మనీశ్ రెడ్డి... ఆంధ్ర నుంచి కోన శ్రీకర్ భరత్, రికీ భుయ్, హనుమ విహారి, పృథ్వీరాజ్ వేలంలో ఉన్నారు.

జట్టు	ఖాళీల సంఖ్య	మిగిలిన మొత్తం
చెన్నై	6	రూ. 31.4 కోట్లు
ఢిల్లీ	9	రూ. 28.95 కోట్లు
గుజరాత్	8	రూ. 38.15 కోట్లు
కోల్‌కతా	12	రూ. 32.7 కోట్లు
లక్నో	6	రూ. 13.15 కోట్లు
ముంబై	8	రూ. 17.75 కోట్లు
పంజాబ్	8	రూ. 29.1 కోట్లు
బెంగళూరు	6	రూ. 23.25 కోట్లు
రాజస్తాన్	8	రూ. 14.5 కోట్లు
హైదరాబాద్	6	రూ. 34 కోట్లు
మొత్తం	77	రూ. 262.95 కోట్లు

సినిమా

2023 రౌండప్

వెబ్‌లోకి వచ్చేశారు



'దూత'లో నాగచైతన్య




'రానా నాయుడు'లో రానా, వెంకటేశ్

సినిమా అంటే కొన్ని పరిమితులుంటాయి. వెబ్ సిరీస్‌లకు హద్దులు లేవు. రొమాన్స్, వయొలెన్స్, సెంటిమెంట్.. ఏదైనా కొంచెం ఓవర్‌గా చూపించొచ్చు. ఈ నేపథ్యంలో సినిమా స్టార్స్ తమ ఇమేజ్‌కి భిన్నమైన క్యారెక్టర్లు, కథలు ఒప్పుకుని వెబ్ వరల్డ్‌లోకి అడుగు పెడుతున్నారు. ఈ ఏడాది వెబ్ వరల్డ్‌లోకి వెంచేసిన స్టార్స్ గురించి తెలుసుకుందాం.

- ఫ్యామిలీ ఆడియన్స్ ఫేవరెట్ హీరోలలో ఒకరైన వెంకటేశ్ ఓటీటీ వరల్డ్ కోసం కొత్త ట్రాక్‌లోకి వచ్చారు. కాస్త అడల్ట్ కంటెంట్ ఉన్న 'రానా నాయుడు' వెబ్ సిరీస్ చేశారు. అమెరికన్ క్రైమ్ డ్రామా 'రే డోనోవన్' ఆధారంగా 'రానా నాయుడు' వెబ్ సిరీస్ తీశారు దర్శక ద్వయం సుపర్ణ్ వర్మ, కరణ్ అన్షుమాన్. వెంకటేశ్‌తో పాటు రానా, సుశాంత్ సింగ్, అభిషేక్ బెనర్జీ, సుచిత్రా పిళ్లై కీలక పాత్రలు చేశారు. కథ విషయానికొస్తే.. సెలబ్రిటీల సమస్యలను పరిష్కరించే రానా నాయుడు (రానా)కు అతని తండ్రి నాగ నాయుడు (వెంకటేశ్) అంటే ద్వేషం. పదిహేనేళ్ల జైలు జీవితం తర్వాత తిరిగొచ్చిన నాగ నాయుడుతో రానా నాయుడు తిరిగి కలుస్తాడా? నాగ నాయుడు ఎందుకు జైలుకు వెళ్లాల్సి వచ్చింది? అనే అంశాలతో ఈ సిరీస్ సాగుతుంది. పది ఎపిసోడ్ల ఈ సిరీస్‌కి డైలాగ్స్ పరంగా విమర్శలు వచ్చినప్పటికీ సక్సెస్‌ఫుల్‌గా ఈ ఏడాది మార్చి 10 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. 'రానా నాయుడు' సెకండ్ సీజన్ కూడా ఉంటుంది.
- 'దూత'గా ఓటీటీలోకి ఎంట్రీ ఇచ్చారు నాగచైతన్య. ఆయన హీరోగా 'మనం', 'థ్యాంక్యూ' సినిమాలను తెరకెక్కించిన దర్శకుడు విక్రమ్ కె. కుమార్ క్రైమ్ థ్రిల్లర్ జానర్ 'దూత'కు దర్శకుడు. ఎనిమిది ఎపిసోడ్స్‌గా సాగే ఈ సిరీస్‌లో పార్వతి తిరువోతు, ప్రియాభవానీ శంకర్, పశుపతి కీలక పాత్రలు పోషించారు. పాత్రికేయ విలువల కన్నా ధనమే ముఖ్యమని భావించే ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ సాగర్ వర్మ (నాగచైతన్య పాత్ర) 'సమాచార పత్రిక'కు చీఫ్ ఎడిటర్‌గా బాధ్యతలు స్వీకరిస్తాడు. సాగర్‌కు దొరికే పేపర్ క్లిప్పింగ్‌లో ఉన్నవారు చనిపోతుంటారు. ఇలా ఎందుకు జరుగుతుంది? సాగర్ ఏం చేశాడు? అన్నది 'దూత' సిరీస్‌లో చూడొచ్చు. డిసెంబరు 1 నుంచి ఈ సిరీస్ స్ట్రీమింగ్ అవుతోంది.
- 'హనుమాన్ జంక్షన్', 'స్వయంవరం', 'చిరునవ్వుతో..', 'చెప్పవే చిరుగాలి', 'గోపీ గోపిక గోదావరి' వంటి సినిమాల్లో నటించిన వేణు తొట్టెంపూడి తెలుగు ప్రేక్షకులకు సుపరిచితులే. వెండితెరపై కాస్త స్లో అయిన వేణు డిజిటల్ తెరపై సత్తా చాటాలని హారర్ థ్రిల్లర్ జానర్‌లో సాగే 'అతిథి' వెబ్ సిరీస్‌లో నటించారు. అవంతికా మిశ్రా, అదితీ గౌతమ్ కీలక పాత్రలు పోషించారు. వైజీ భరత్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్ ఆరు ఎపిసోడ్స్‌గా సాగుతోంది. దెయ్యాలు ఉన్నాయని ప్రచారం సాగే దెయ్యాల మిట్ట అనే ప్రాంతానికి సమీపాన సంధ్య నిలయం అనే పెద్ద భవంతిలో రచయిత రవివర్మ (వేణు తొట్టెంపూడి), అతని భార్య సంధ్య (అదితీ గౌతమ్) నివసిస్తుంటారు. అయితే దెయ్యాలు లేవని నమ్మే యూట్యూబర్ సవారి (వెంకటేశ్ కాకుమాను) అక్కడికి వెళ్తాడు. అక్కడ జరిగిన కొన్ని ఘటనలకు భయపడి సంధ్య నిలయంకు వెళ్తాడు. తన కంటే ముందే సంధ్య నిలయంకు వచ్చిన మాయ (అవంతిక మిశ్రా) చనిపోతుందని తెలుసుకుంటాడు సవారి. మరి.. ప్రచారంలో ఉన్నట్లుగా దెయ్యాల మిట్టలో దెయ్యాల సంచారం ఉందా? మాయ చావుకు కారణం ఎవరు? ఫైనల్‌గా సవారి ఏం తెలుసుకుంటాడు? అన్నది క్లుప్తంగా 'అతిథి' సిరీస్ కథ. ఈ ఏడాది సెప్టెంబరు 10 నుంచి ఈ సిరీస్ స్ట్రీమింగ్ అవుతోంది.



'అతిథి'లో వేణు



'పులి మేక'లో ఆది



'దయా'లో జేడీ చక్రవర్తి

- నటుడు, దర్శకుడు జేడీ చక్రవర్తి గురించి ప్రత్యేకించి పరిచయం అక్కర్లేదు. ఈ ఏడాది వెబ్ వరల్డ్‌లో డబుల్ ధమాకా ఇచ్చారు జేడీ. ఆయన టైటిల్ రోల్ చేసిన వెబ్ సిరీస్ 'దయా'. ఈ సిరీస్‌కు పవన్ సాధినేని దర్శకుడు. ఈషా రెబ్బా, పృథ్వీరాజ్, రమ్యా నంబీసన్, కమల్ కామరాజు కీలక పాత్రలు పోషించారు. చేపలు ట్రాన్స్‌పోర్ట్ చేసే ఫ్రీజర్ వ్యాన్ డ్రైవర్ దయా (జేడీ చక్రవర్తి). అతని భార్య అలివేలు (ఈషా రెబ్బా) నిండు గర్భిణి. ఓ రోజు దయా పని మీద కాకినాడకు బయలుదేరతాడు. అయితే తన వ్యాన్‌లో శవం ఉందని తెలుసుకుని షాక్ అవుతాడు. ఆ శవం దయా బండిలోకి ఎందుకు వచ్చింది. ఈ ఘటనకు, జర్నలిస్ట్ కవిత (రమ్యా నంబీసన్)కు సంబంధం ఏంటి? అనేది సిరీస్‌లో చూడాలి. ఎనిమిది ఎపిసోడ్స్‌గా ఈ సిరీస్ ఆగస్టు 4 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. అలాగే జేడీ చక్రవర్తి ఓ ముఖ్య పాత్రలో నటించిన మరో వెబ్ సిరీస్ 'తాజా ఖబర్' జనవరి 5 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది.
- ఆది సాయికుమార్ నటించిన వెబ్ సిరీస్ 'పులిమేక'. ఈ సిరీస్‌కు కె. చక్రవర్తి రెడ్డి దర్శకుడు. లావణ్యా త్రిపాఠి ఓ లీడ్ రోల్ చేశారు. కథ విషయానికొస్తే...హైదరాబాద్‌లో జరుగుతున్న పోలీసుల వరుస హత్యల మిస్టరీని ఛేదించేందుకు రంగంలోకి దిగుతారు కిరణ్ ప్రభ (లావణ్యా త్రిపాఠి). ఫోరెన్సిక్ హెడ్ ప్రభాకర్ శర్మగా పోలీసులకు హెల్ప్ చేస్తుంటాడు ఆది సాయికుమార్. మరి.. కిల్లర్‌ను కిరణ్ ప్రభ పట్టుకున్నారా? అతను పోలీసులనే ఎందుకు టార్గెట్ చేస్తున్నాడు? అనేది 'పులి మేక' సిరీస్ కథాంశం. ఎనిమిది ఎపిసోడ్స్‌గా ఈ సిరీస్ ఫిబ్రవరి 24 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది.

ఆపరేషన్ వాలెంటైన్ డేట్ ఫిక్స్



వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ ఇండియన్ ఎయిర్ పైలట్‌గా నటిస్తున్న చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. రాడార్ ఆఫీసర్ పాత్రలో మానుషీ చిల్లర్ నటిస్తున్నారు. శక్తీ ప్రతాప్ సింగ్ హడాని దర్శకునిగా పరిచయం చేస్తూ సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, రినైసన్స్ పిక్చర్స్ పై సందీప్ ముద్దా నిర్మిస్తున్న ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. తెలుగు, హిందీ భాషల్లో 2024 ఫిబ్రవరి 16న చిత్రాన్ని, త్వరలో టీజర్‌ను విడుదల చేయనున్నట్లు సోమవారం యూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా వరుణ్ తేజ్, మానుషీ చిల్లర్ ఒక అతి పెద్ద వైమానిక దాడిని ఎదుర్కోడానికి సిద్ధం అయ్యే విజువల్స్‌ని గ్లింప్స్‌గా విడుదల చేశారు. ''దేశభక్తి నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో మన వైమానిక దళ వీరుల అసమానమైన ధైర్య సాహసాలను, దేశాన్ని రక్షించడానికి వారు ఎదుర్కొంటున్న సవాళ్లను చూపిస్తున్నాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహనిర్మాతలు: నందకుమార్ అబ్బినేని, వకీల్ ఖాన్.

టీజర్ బాగుంది.. సినిమా హిట్టవ్వాలి

\- డైరెక్టర్ అనిల్ రావిపూడి



మేఘా లేఖ, అనిల్ రావిపూడి, సోహైల్

''బిగ్ బాస్' షో నుంచి సోహైల్ నాకు తెలుసు. తను ప్రతి సినిమాకి చాలా కష్టపడుతున్నాడు. 'బూట్ కట్ బాలరాజు'తో తనకి మంచి విజయం రావాలి. ఈ మూవీ టీజర్ చాలా వినోదాత్మకంగా ఉంది.. సినిమా పెద్ద హిట్ కావాలి'' అని డైరెక్టర్ అనిల్ రావిపూడి అన్నారు. సోహైల్ హీరోగా శ్రీ కోనేటి దర్శకత్వం వహించిన చిత్రం 'బూట్ కట్ బాలరాజు'. మేఘా లేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ కీలక పాత్రలు పోషించారు. గ్లోబల్ ఫిలిమ్స్-కథ వేరుంటాది బ్యానర్స్‌పై ఎండీ పాషా నిర్మించారు. ఈ మూవీ టీజర్‌ని అనిల్ రావిపూడి లాంచ్ చేశారు. సోహైల్ మాట్లాడుతూ–''శ్రీ కోనేటిగారు అన్ని జాగ్రత్తలు తీసుకొని ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. పాషాగారు ఎక్కడా రాజీపడకుండా క్యాలిటీతో ఈ సినిమాని తీశారు'' అన్నారు. ''వినోదాత్మకంగా రూపొందిన చిత్రమిది. కుటుంబమంతా కలసి చూడదగ్గ సినిమా'' అన్నారు నిర్మాత బెక్కం వేణుగోపాల్. ''అందరూ ఎంజాయ్ చేసే సినిమా ఇది'' అన్నారు శ్రీ కోనేటి. ''ఇది నా తొలి చిత్రం. ప్రేక్షకులు సపోర్ట్ చేసి మరిన్ని సినిమాలు నిర్మించే అవకాశం కల్పించాలి'' అన్నారు ఎండీ పాషా. ''మంచి కథ ఉన్న చిత్రమిది'' అన్నారు నటి ఇంద్రజ.

గాజు భవంతిలో స్పై



అడివి శేష్

అడివి శేష్ గూఢచారిగా మారిపోయారు. దేశం కోసం పోరాడడానికి దేశం వెలుపల ఒక మిషన్ మీద ఉన్నారు. ప్రధానంగా ఓ ఐదంతస్తుల గాజు భవంతి నుంచి తన కార్యకలాపాలను నిర్వర్తిస్తుంటారు ఈ గూఢచారి. అడివి శేష్ హీరోగా నటించిన సంచలన విజయం 'గూఢచారి' ఫ్రాంచైజీలోని 'జీ 2' ప్రస్తుతం నిర్మాణంలో ఉంది. ఈ యాక్షన్ థ్రిల్లర్ కోసం హైదరాబాద్‌లో ఐదంతస్తుల గాజు భవంతి సెట్‌ని తయారు చేయించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వం వహిస్తున్నారు. బనితా సంధు హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది.


భయపెట్టే పిండం



శ్రీరామ్, ఖుషీ రవి

''పిండం' సినిమా ఏంటి అనేది ఈ నెల 15న తెలుస్తుంది. ఈ చిత్రాన్ని థియేటర్‌లో చూడటానికి నేను కూడా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. ఈ మూవీ ప్రేక్షకులకు నచ్చుతుంది'' అని హీరో శ్రీరామ్ అన్నారు. సాయికిరణ్ దైదా దర్శకత్వంలో శ్రీరామ్, ఖుషీ రవి జంటగా అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'పిండం'. యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 15న విడుదల కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో యశ్వంత్ దగ్గుమాటి మాట్లాడుతూ– ''మా సినిమా టీజర్, ట్రైలర్‌లకు మంచి స్పందన వస్తోంది. సినిమాకి కూడా అదే స్పందన వస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ''నేనెప్పుడూ మంచి యూనిట్‌తో పని చేయాలని కోరుకుంటాను. 'పిండం'తో అది నెరవేరింది'' అన్నారు ఖుషీ రవి. ''మా సినిమా చూసి ప్రేక్షకులు కచ్చితంగా భయపడతారు'' అన్నారు సాయికిరణ్ దైదా. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు కృష్ణ సౌరభ్ సూరంపల్లి, రచయిత కవి సిద్ధార్థ, కెమెరామేన్ సతీష్ మనోహర్ మాట్లాడారు.

వినోదాల ఆలంబన



వైభవ్, పార్వతీ నాయర్

దర్శకుడు కోదండ రామిరెడ్డి తనయుడు వైభవ్ హీరోగా నటించిన చిత్రం 'ఆలంబన'. పారి కె. విజయ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో పార్వతీ నాయర్ కథానాయికగా, మురళీ శర్మ ప్రధాన పాత్రలో నటించారు. తమిళంలో రూపొందిన ఈ చిత్రాన్ని గంగ ఎంటర్‌టైన్మెంట్స్‌పై మహేశ్వర్ రెడ్డి తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ నెల 15న తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది. సోమవారం 'ఆలంబన' తెలుగు ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. అనంతరం వైభవ్ మాట్లాడుతూ– ''ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం ఇది. ఆ కామెడీని థియేటర్లలో బాగా ఎంజాయ్ చేస్తారు. తెలుగులో నేను గ్యాప్ తీసుకోలేదు.. గ్యాప్ వచ్చిందంతే. తెలుగులో మంచి పాత్రలు వచ్చినా చేయలేకపోయాను'' అన్నారు. ''ఈ సినిమాని యూనివర్సల్ కాన్సెప్ట్‌తో చేశాను'' అన్నారు పారి కె. విజయ్. ''శివ కార్తికేయన్ 'వరుణ్ డాక్టర్' తర్వాత తెలుగులో మేం రిలీజ్ చేస్తున్న చిత్రం 'ఆలంబన'. ఈ మూవీ ప్రేక్షకులందర్నీ నవ్విస్తుంది'' అన్నారు మహేశ్వర్ రెడ్డి.

సాక్షి బిజినెస్

మంగళవారం
12-12-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲ 103	69,929	
నిఫ్టీ ▲ 28	20,997	

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తారీ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్డాక్	14,387	▽ 17
డోజోన్స్	36,333	▲ 85
ఎఫ్టీఎస్ఈ 100	7,545	▽ 10
డాక్స్	16,794	▲ 35
షాంఘై	2,991	▲ 22
నికాయ్	32,791	▲ 484

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	61,452
బంగారం (99.5 స్వచ్ఛత)	61,206
వెండి (కేజీ)	71,402

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		82.98	84.00
£	బ్రిటన్ పౌండ్		103.45	106.00
€	యూరో		88.71	91.06
¥	జపాన్ ఎన్ (100)		56.81	58.11
AUS	ఆస్ట్రేలియా డాలర్		53.83	55.75
S$	సింగపూర్ డాలర్		61.38	63.37
SAR	సౌదీ రియాల్		21.28	22.91
UAE D	యూఏఈ దిర్హామ్		21.81	23.60
¥	చైనా యువాన్		10.50	12.57

టాటా పవర్, ఐవోసీ జట్టు

దేశవ్యాప్తంగా 500 ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 500 ఫాస్ట్, అల్ట్రా ఫాస్ట్ ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేసే దిశగా టాటా పవర్ ఈవీ చార్జింగ్ సొల్యూషన్స్, ప్రభుత్వ రంగ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) చేతులు కలిపాయి. ఇందుకు సంబంధించి కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం ప్రకారం (ఎంవోయూ) ఐవోసీ రిటైల్ అవుట్లెట్స్‌లో టాటా పవర్ చార్జింగ్ పాయింట్లను ఇన్‌స్టాల్ చేస్తుంది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు వంటి పెద్ద నగరాలతో పాటు గుంటూరు-చెన్నై హైవే, సేలం-కొచ్చి హైవే వంటి జాతీయ రహదారుల వెంట వీటిని నెలకొల్పుతుంది. దీనితో సుదూర ప్రయాణాలు చేసే ఎలక్ట్రిక్ వాహనదారులు రేంజి (మైలేజి)పరంగా ఆందోళన చెందాల్సిన అవసరం తప్పుతుందని టాటా పవర్ హెడ్ (బిజినెస్ డెవలప్‌మెంట్ – ఈవీ చార్జింగ్) వీరేంద్ర గోయల్ తెలిపారు. చార్జర్ల లభ్యత గురించి టాటా పవర్ ఈజెడ్ చార్జ్, ఇండియన్ ఆయిల్ ఈ-చార్జ్ మొబైల్ యాప్‌ల ద్వారా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. 2024 నాటికి 10,000 పైచిలుకు ఈవీ చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నట్లు ఐవోసీ ఈడీ సౌమిత్ర శ్రీవాస్తవ పేర్కొన్నారు.

70,000 వాలా!

కొత్త శిఖరంపై సెన్సెక్స్

- కొనసాగిన రికార్డుల ర్యాలీ..
- 21 వేల చేరువలో నిఫ్టీ ముగింపు
- రాణించిన మెటల్, ఐటీ షేర్లు



ముంబై: స్టాక్ మార్కెట్ రికార్డు ర్యాలీలో భాగంగా సెన్సెక్స్ సరికొత్త మైలురాయిని తాకింది. 44 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో తొలిసారి 70,000 పాయింట్లను తాకింది. మరో సూచీ నిఫ్టీ 21,000 శిఖరానికి కేవలం 3 పాయింట్ల దూరంలో నిలిచింది. కొంతకాలంగా విదేశీ పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోంది., ఆర్‌బీఐ వరుసగా అయిదోసారి వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచడంతో పాటు దేశీయ వృద్ధి అవుట్‌లుక్‌ను పెంచింది. అయిదు రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 3 రాష్ట్రాల్లో గెలుపుతో రాజకీయ స్థిరత్వం రావొచ్చనే ఆశావహ అంచనాలు నెలకొన్నాయి. ప్రాథమిక మార్కెట్లు ఐపీఓలతో కళకళలాడుతున్నాయి. దీంతో కొన్ని వారాలుగా దలాల్ స్ట్రీట్‌లో కొనుగోళ్ల పర్వం కొనసాగుతోంది. ఈ క్రమంలో సెన్సెక్స్ నిఫ్టీలు కొత్త రికార్డుల దిశగా సాగుతున్నాయి. యూఎస్ ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ(ఎఫ్ఓఎంసీ) నిర్ణయాలు బుధవారం వెలువడనున్న నేపథ్యంలో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు స్తబ్దుగా ట్రేడవుతున్నాయి.

ఒడిదుడుకులున్నా.., సరికొత్త శిఖరాలకు ....

ఆసియా మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం స్వల్ప లాభాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్ 100 పాయింట్లు పెరిగి 69,926 వద్ద, నిఫ్టీ నాలుగు పాయింట్లు నష్టపోయి 20,965 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. బ్యాంకింగ్, ఐటీ, మెటల్ షేర్లకు రాణించడంతో ప్రథమార్ధంలోనే 232 పాయింట్లు పెరిగి 70,000 స్థాయిపై 70,058 వద్ద, నిఫ్టీ 57 పాయింట్లు బలపడి 21,026 వద్ద కొత్త జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి. అయితే ద్వితీయార్ధంలో రికార్డు స్థాయిల వద్ద లాభాల స్వీకరణతో సూచీలు కొంతమేర లాభాలు కోల్పోయాయి. చివరికి సెన్సెక్స్ 103 పాయింట్ల లాభంతో 69,929 వద్ద, నిఫ్టీ 28 పాయింట్లు బలపడి 21,000 శిఖరానికి కేవలం 3 పాయింట్ల దూరంలో 20,997 నిలిచింది.

''కొత్త ఏడాదికి సరిగ్గా 20 రోజుల ముందు సెన్సెక్స్ 70 వేల పాయింట్ల ధమాకా ఇచ్చింది. అయితే నేడు(మంగళవారం) అమెరికా, భారత్‌ల నవంబర్ ద్రవ్యోల్బణ, పారిశ్రామికోత్పత్తి(ఐపీ)డేటా వెల్లడి నేపథ్యంలో అప్రమత్తత వహిస్తూ లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. మరో ఏడాది కాలంలో సెన్సెక్స్ 80 వేల స్థాయిని అందుకునేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ముఖ్యంగా మౌలిక, ప్రభుత్వ రంగాల షేర్లు ర్యాలీకి ప్రాతినిధ్యం వహించవచ్చు. వచ్చే ఏడాది సాధారణ ఎన్నికల ప్రభావంతో ఈక్విటీ మార్కెట్లో కొంత అస్థిరతర ఉండొచ్చు.'' అని మార్కెట్ నిపుణుడు విజయ్ కేడియా తెలిపారు.

సెన్సెక్స్ జర్నీ..

మైలురాయి	అందుకున్న తేది
50,000	ఫిబ్రవరి 3, 2021
55,000	ఆగస్టు 13, 2021
60,000	సెప్టెంబర్ 24, 2021
65,000	జూలై 3, 2023
70,000	డిసెంబర్ 11, 2023

- సెన్సెక్స్ 65,000 స్థాయి నుంచి 70,000 పాయింట్లకు చేరేందుకు కేవలం 110 రోజుల సమయం పట్టింది.
- 1979లో 100 పాయింట్ల వద్ద తన ప్రయాణాన్ని ప్రారంభించిన సెన్సెక్స్ ఈ ఏడాది డిసెంబర్ నాటికి 70 వేల స్థాయికి చేరుకుంది. అంటే 44 ఏళ్లలో సెన్సెక్స్ ఇన్వెస్టర్లకు 700 రెట్ల లాభాలు పంచింది.
- సెన్సెక్స్ కొత్త రికార్డు స్థాయి నెలకొల్పడంతో సోమవారం రూ.1.85 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.351.09 లక్షల కోట్లకు చేరింది.



మార్కెట్లో మరిన్ని సంగతులు

- నిధుల సమీకరణ, ఎన్ఎస్ఈ ఎక్స్ఛేంజీలో లిస్టింగ్ ప్రణాళికల నేపథ్యంలో స్పైస్‌జెట్ షేరు. బీఎస్ఈలో 10%పైగా లాభపడి రూ.60.57 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 16% ఎగసి రూ.63.69 వద్ద ఏడాది గరిష్టాన్ని అందుకుంది.
- అమెరికా నియంత్రణ సంస్థ హైదరాబాద్ రీసెర్చ్ ఫ్యాకల్టీ యూనిట్‌కు 3 అభ్యంతరాలు జారీ చేయడంతో డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ 5% నష్టపోయి రూ.5,473 వద్ద స్థిరపడింది.
- ఓఎన్‌జీసీ నుంచి రూ.1,145 కోట్ల ఆర్డరు దక్కించుకోవడంతో మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ షేరు 3% పెరిగి రూ.2118 వద్ద నిలిచింది.

ఎలక్ట్రానిక్ విడిభాగాల తయారీకి ఊతం

- కొత్త పథకాలపై కేంద్రం కసరత్తు
- ఎలక్ట్రానిక్స్ శాఖ కార్యదర్శి కృష్ణన్

న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీని దేశీయంగా పెంచేందుకు ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకాలను (పీఎల్ఐ) ప్రకటించిన కేంద్ర సర్కారు.. ఇప్పుడు ఎలక్ట్రానిక్ విడిభాగాల స్థానిక తయారీని సైతం ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇందుకు సంబంధించి కొత్త పథకాలపై కసరత్తు చేస్తున్నట్టు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సెక్రటరీ ఎస్.కృష్ణన్ వెల్లడించారు. సీఐఐ నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం దేశ మొబైల్ ఫోన్ల మార్కెట్లో 99% స్థానికంగానే తయారవుతున్నట్టు చెప్పారు. ''అసెంబ్లీ



యూనిట్లకు అదనంగా 10-15 శాతం విలువ జోడింపుపైనే ఆధారపడకూడదు. మనం ఇంకా ఏమి చేయగలమో, విలువ ఆధారిత సరఫరాలో మరింత ముందుకు ఎలా వెళ్లగలమో ఆలోచించాలి''అని సూచించారు. ఏ దేశం కూడా మొత్తం వ్యాల్యూచైన్‌లో ఆధిపత్యం చూపించలేదన్నారు. చైనా విషయానికొస్తే వ్యాల్యూచైన్‌లో 40-45% వాటా కలిగి ఉన్నట్టు చెప్పారు. భారత్ 35-40% సొంతం చేసుకోవడంపై దృష్టి పెట్టాలని పరిశ్రమకు సూచించారు. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల విడిభాగాలకు సంబంధించి రెండో విడత పీఎల్ఐ పథకాన్ని ప్రకటించనున్నట్టు తెలిపారు.

ఇంధనంపై ఎక్సైజ్ సుంకాలు తగ్గవు..!

న్యూఢిల్లీ: పెట్రోల్, డీజిల్‌పై పన్నుల్లో కోత విధించే అవకాశం లేదని ఆర్థికశాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధరలు ఇప్పటికే తగ్గాయని, ఈ నేపథ్యంలో ఇంధనంపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించే పరిస్థితి లేదని చెప్పారు. భారత్ తన చమురు అవసరాలలో దాదాపు 85 శాతానికి దిగుమతులపై ఆధారపడి ఉన్న సంగతి తెలిసిందే. ''ముడి చమురు ధరలు ఎక్కువగా ఉన్నప్పుడు, కేంద్రం ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించింది. ధరలు ఇప్పటికే తగ్గినప్పుడు, ఇక పన్ను తగ్గింపు ప్రశ్న ఉత్పన్నం కాదు. మీరు పెట్రోల్, డీజిల్ ధర తగ్గింపు కోసం అడగవచ్చు, కానీ పన్నుల తగ్గింపు గురించి ఇప్పుడు



ప్రశ్నించడం సరికాదు'' అని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ద్రవ్యోల్బణాన్ని తగ్గించడానికి ఇంధనంపై ఎక్సైజ్ సుంకాన్ని చివరిసారిగా మే 2022లో తగ్గించారు. ఈ నిర్ణయం మేరకు పెట్రోల్‌పై సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ లీటర్‌కు రూ.8 తగ్గింది. డీజిల్‌పై రూ.6 తగ్గించడం జరిగింది.

రూ.33.61 లక్షల కోట్ల పన్ను వసూళ్లే లక్ష్యం!

బడ్జెట్ సవరిత అంచనాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) రూ. 33.61 లక్షల కోట్ల పన్ను వసూళ్ల లక్ష్యానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని శాఖ సీనియర్ అధికారి తెలిపారు.

బీఎండబ్ల్యూ కార్లు ప్రియం

న్యూఢిల్లీ: బీఎండబ్ల్యూ అన్ని మోడళ్ల ధరలను 2% వరకు పెంచుతోంది.



జనవరి 1 నుంచి సవరించిన ధరలు అమలులోకి రానున్నాయని కంపెనీ సోమవారం ప్రకటించింది. విదేశీ మారకపు రేట్లు, పెరుగుతున్న తయారీ ఖర్చులలో హెచ్చుతగ్గుల ప్రతికూల ప్రభావాలను పాక్షికంగా భర్తీ చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్టు బీఎండబ్ల్యూ వెల్లడించింది. ఇప్పటికే మారుతీ, హ్యుందాయ్, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, హోండా, ఆడి తదితర కంపెనీలు ధరలను పెంచుతున్నట్టు ప్రకటించాయి.

'రుణమాఫీ' ఆఫర్లపై.. తస్మాత్ జాగ్రత్త: ఆర్‌బీఐ

న్యూఢిల్లీ: ప్రింట్ మీడియాతో పాటు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో 'రుణమాఫీ' ఆఫర్లకు సంబంధించిన తప్పుదోవ పట్టించే ప్రకటనల బారిన పడవద్దని రిజర్వ్ బ్యాంక్ ప్రజలను హెచ్చరించింది. రుణమాఫీని ఆఫర్ చేస్తూ రుణగ్రహీతలను ప్రలోభపెట్టే కొన్ని తప్పుదోవ పట్టించే ప్రకటనలను గమనించినట్లు బ్యాంకింగ్ రెగ్యులేటర్ ఒక ప్రకటనలో తెలిపింది. కొన్ని సంస్థలు, ప్రింట్ మీడియాతో పాటు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో ఇలాంటి పలు ప్రచారాలు చురుకుగా చేస్తున్నట్లు కనిపిస్తోందని పేర్కొంది. అటువంటి సంస్థలు ఎలాంటి అధికారం లేకుండా 'రుణ మాఫీ



సర్టిఫికెట్లు' జారీ చేయడానికి సేవా/చట్టపరమైన రుసుము వసూలు చేస్తున్నాయని కూడా వార్తలు వస్తున్నట్లు ఆర్‌బీఐ పేర్కొంది. కొంతమంది వ్యక్తులు రుణ గ్రహీతలను తప్పుదారిపట్టించే విధంగా ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొంది. అలాంటి సంస్థలతో లావాదేవీలు నెరపితే ఆర్థిక నష్టాలు తప్పవని వినియోగదారులకు హెచ్చరించింది.

''బ్యాంకులతోసహా ఆర్థిక సంస్థలకు చెల్లించాల్సిన బకాయిలను తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదని అటువంటి సంస్థలు లేదా వ్యక్తులు తప్పుగా సూచిస్తున్నారు. తద్వారా బ్యాంకింగ్ ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారు. ఇటువంటి కార్యకలాపాలు ఆర్థిక సంస్థల స్థిరత్వాన్ని ముఖ్యంగా డిపాజిటర్ల ప్రయోజనాలను దెబ్బతీస్తాయి' అని ఆర్‌బీఐ ప్రకటన వివరించింది. ఇటువంటి తప్పుడు ప్రచారాలను నమ్మి నష్టపోవద్దని, ఈ తరహా తప్పుడు ప్రచారం తమ దృష్టికి వస్తే, విచారణా సంస్థల దృష్టికి ఈ విషయాన్ని తీసుకురావాలని వినియోగదారులకు విజ్ఞప్తి చేసింది.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీలో 897 గ్రూప్-2 పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. వివిధ ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-2 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 897
» **పోస్టుల వివరాలు:** ఎగ్జిక్యూటివ్ పోస్టులు-331, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు-566.
» **పరీక్ష విధానం:** పరీక్ష ప్రిలిమ్స్, మెయిన్స్ పద్ధతుల్లో జరుగుతుంది. ప్రిలిమ్స్ ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. జనరల్ స్టడీస్, మెంటల్ ఎబిలిటీలో 150 ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు 2.30 గంటల్లో ఓఎంఆర్ షీట్‌పై సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. మెయిన్స్‌లో పేపర్-1, పేపర్-2లో 150 మార్కుల చొప్పున ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు జవాబులు గుర్తించాలి.
» **ఎంపిక విధానం:** స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్ ఎగ్జామినేషన్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా అభ్యర్థులను ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 21.12.2023
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**10.01.2024
» **స్క్రీనింగ్ టెస్ట్ తేది(ప్రిలిమినరీ ఎగ్జామ్):** 25.02.2024.
» **వెబ్‌సైట్:** psc.ap.gov.in

సీయూఆర్ఈసీ-2023 పరీక్ష

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ).. దేశవ్యాప్తంగా కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో రెగ్యులర్/పర్మనెంట్ ప్రాతిపదికన సెంట్రల్ యూనివర్సిటీ రిక్రూట్‌మెంట్ ఎగ్జామినేషన్-2023 నోటిఫికేషన్‌ను విడుదలచేసింది. దీని ద్వారా నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేస్తారు.

యూనివర్సిటీల వారీగా ఖాళీలు

» ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో), న్యూఢిల్లీ: జూనియర్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్-50, స్టెనోగ్రాఫర్-52.
» మహాత్మా గాంధీ సెంట్రల్ యూనివర్సిటీ, మోతిహారి(బీహార్)-48.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, 10+2, డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది(ఎంజీసీయూ/ఇగ్నో):** 21.12.2023.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 22.12.2023 నుంచి 25.12.2023 వరకు
» **వెబ్‌సైట్:** exams.nta.ac.in

నిఫ్ట్‌లో యూజీ, పీజీ, పీహెచ్‌డీ ప్రవేశాలు

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్).. దేశవ్యాప్తంగా ఉన్న 18 క్యాంపస్‌లలో అకడమిక్ సెషన్ 2024-25కు సంబంధించి బ్యాచిలర్, మాస్టర్ డిగ్రీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ఎన్‌టీఏ పరీక్ష నిర్వహిస్తోంది.

» **నిఫ్ట్ క్యాంపస్‌లు:** బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, చెన్నై, దమణ్, గాంధీనగర్, హైదరాబాద్, జోధ్‌పూర్, కాంగ్రా, కన్నూర్, ముంబై, న్యూఢిల్లీ, పాట్నా, పంచకుల, రాయ్‌బరేలి, షిల్లాంగ్, శ్రీనగర్.

కోర్సుల వివరాలు

» **బ్యాచిలర్ ప్రోగ్రామ్:** నాలుగేళ్ల వ్యవధి; బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్ (బీడీఈఎస్): ఫ్యాషన్ డిజైన్/లెదర్ డిజైన్/యాక్సెసరీ డిజైన్/టెక్స్‌టైల్ డిజైన్/నిట్‌వేర్ డిజైన్/ఫ్యాషన్ కమ్యూనికేషన్. బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(బీఎఫ్‌టెక్) ప్రోగ్రామ్.
» **మాస్టర్ ప్రోగ్రామ్:** రెండేళ్ల వ్యవధి; మాస్టర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్(ఎండీఈఎస్), మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్(ఎంఎఫ్ఎం),మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(ఎంఎఫ్‌టెక్).
» పీహెచ్‌డీ ప్రోగ్రామ్(డిజైన్, మేనేజ్‌మెంట్, టెక్నాలజీ).
» **అర్హత:** యూజీ ప్రోగ్రామ్‌కు 10+2 పరీక్షలో ఉత్తీర్ణులవ్వాలి. పీజీ ప్రోగ్రామ్‌కు ఏదైనా డిగ్రీ లేదా బీఎఫ్‌టెక్, బీఈ/బీటెక్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌కు సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** యూజీకి 24 ఏళ్లు మించకూడదు. పీజీ, పీహెచ్‌డీ కోర్సులకు వయోపరిమితి లేదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్యమైన తేదీలు

» **యూజీ, పీజీ ప్రోగ్రామ్:** ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది: 03.01.2024.
» **దరఖాస్తు సవరణతేదీలు:** 10.01.2024 నుంచి 12.01.2024 వరకు
» **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ తేది:** జనవరి మూడో వారం, 2024.
» **డిగ్రీ, పీజీ ప్రవేశ పరీక్ష తేది:** 05.02.2024.
» **వెబ్‌సైట్:** www.nift.ac.in

ఐబీలో ఆఫీసర్ కొలువు

దేశ భద్రతలో పాల్పంచుకోవాలని కోరుకునే వారికి చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. ఇంటెలిజెన్స్ బ్యూరోలో 995 అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్-2/ఎగ్జిక్యూటివ్ (ఏసీఐఓ గ్రేడ్-2) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.ఈ పోస్టులకు ఎంపికైతే కేంద్ర హోంశాఖ పరిధిలో కీలక విధుల నిర్వహణకు అవకాశం లభిస్తుంది. బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో ఈ పోస్టులకు పోటీ పడొచ్చు. ఈ నేపథ్యంలో.. ఐబీలో ఏసీఐఓ గ్రేడ్-2 ఉద్యోగాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ తదితర వివరాలు..

» ఇంటెలిజెన్స్ బ్యూరోలో ఏసీఐఓ ఉద్యోగాలు
» 995 పోస్టులతో ఏసీఐఓ-గ్రేడ్ 2 నోటిఫికేషన్
» వేతనం: పే లెవల్-7 (రూ.44,900-రూ.1,42,400)
» మూడు దశల ఎంపిక ప్రక్రియ ద్వారా నియామకం

ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ).. కేంద్ర హోంమంత్రిత్వ శాఖలో ఎంతో కీలకమైన విభాగం. ఈ విభాగం ఇచ్చే నివేదికల ఆధారంగానే శాంతి భద్రతలు, ఇతర భద్రతా అంశాలపై హోంశాఖ చర్యలు తీసుకుంటుంది. ఇందుకోసం ఇంటెలిజెన్స్ బ్యూరోలో.. పలు స్థాయిల్లో అధికారులు విధులు నిర్వర్తిస్తుంటారు. ఎంట్రీ లెవల్‌లో కీలకమైన హోదా.. అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్-2. తాజాగా ఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

మొత్తం 995 పోస్టులు

తాజా నోటిఫికేషన్ ద్వారా ఐబీలో 995 అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్-2/ఎగ్జిక్యూటివ్ పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిలో 377 పోస్టులను ఓపెన్ కేటగిరీలో, 129 పోస్టులు ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో, 222 పోస్టులను ఓబీసీ కేటగిరీలో, 134 పోస్టులను ఎస్సీ కేటగిరీలో, 133 పోస్టులను ఎస్టీ కేటగిరీలో రిజర్వ్ చేశారు.

అర్హతలు

- డిసెంబర్ 15, 2023 నాటికి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.కంప్యూటర్ పరిజ్ఞానం అభిలషణీయం.
- **వయసు:** డిసెంబర్ 15, 2023 నాటికి 18-27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

ప్రారంభ వేతనం

నియామకం ఖరారు చేసుకున్న వారికి గ్రూప్-సి (నాన్-గెజిటెడ్) ర్యాంకుతో పే లెవల్-7తో ప్రారంభ వేతన శ్రేణి ఉంటుంది. రూ.44,900-రూ.1,42,400 వేతన శ్రేణి లభిస్తుంది. మూల వేతనాన్ని రూ.44,900గా నిర్ధారించగా.. వీటికి అదనంగా డీఏ, ఎస్ఎస్ఏ, హెచ్ఆర్ఏ, టీఏ, ఎస్‌పీఎస్ వంటి భత్యాలు కూడా అందిస్తారు. దీంతో నికరంగా నెలకు రూ.లక్ష వరకు వేతనం అందుకునే అవకాశం ఉంది.



ఎంపిక ప్రక్రియ

ఏసీఐఓ గ్రేడ్-2 పోస్టుల నియామకానికి మూడు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నారు. అవి.. టైర్-1 రాత పరీక్ష, టైర్-2 రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ. ఈ మూడింటిలో చూపిన ప్రతిభ ఆధారంగా తుది నియామకాలు ఖరారు చేస్తారు.

టైర్-1 రాత పరీక్ష

ఎంపిక ప్రక్రియలో తొలిదశ (టైర్-1) రాత పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం అయిదు విభాగాల(కరెంట్ అఫైర్స్,జనరల్ స్టడీస్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్, రీజనింగ్/లాజికల్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్) నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రతి విభాగం నుంచి 20 ప్రశ్నలు చొప్పున మొత్తం 100 ప్రశ్నలతో 100 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్షకు కేటాయించిన సమయం ఒక గంట. ప్రతి తప్పు సమాధానానికి 1/4వ వంతు మార్కును తగ్గిస్తారు.

టైర్-2.. డిస్క్రిప్టివ్ టెస్ట్

టైర్-1 పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్టుకు పది మందిని చొప్పున (1:10 నిష్పత్తిలో) టైర్-2 పరీక్షకు ఎంపిక చేస్తారు. ఈ పరీక్ష పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటుంది. 30 మార్కులకు ఎస్సే రైటింగ్, మరో 20 మార్కులకు ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ అండ్ ప్రెసిస్ రైటింగ్ విభాగాలు ఉంటాయి. ఇలా మొత్తం 50 మార్కులకు ఒక గంట వ్యవధిలో టైర్-2 డిస్క్రిప్టివ్ టెస్ట్‌ను నిర్వహిస్తారు.

పర్సనల్ ఇంటర్వ్యూ

రెండు దశల రాత పరీక్ష(టైర్-1, టైర్-2)ల్లో చూపిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్టుకు అయిదుగురిని చొప్పున (1:5 నిష్పత్తి) చివరి దశ పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూ వంద మార్కులకు ఉంటుంది. ఇందులో అభ్యర్థుల సునిశిత పరిశీలన, విశ్లేషణ నైపుణ్యాలను పరీక్షిస్తారు. కొన్ని సందర్భాల్లో సైకోమెట్రిక్/ఆప్టిట్యూట్ టెస్ట్‌లను కూడా నిర్వహిస్తారు.

జేడీడీ స్థాయికి చేరుకోవచ్చు

అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్-2 హోదాలో కొలువు సొంతం చేసుకున్న వారు భవిష్యత్తులో జాయింట్ డైరెక్టర్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. తొలుత ఏసీఐఓ-1గా, ఆ తర్వాత డిప్యూటీ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్, అసిస్టెంట్ డైరెక్టర్, జాయింట్ డిప్యూటీ డైరెక్టర్, అడిషనల్ డిప్యూటీ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ వంటి హోదాలు ఉంటాయి. సర్వీస్ నియమావళి ప్రకారం-కనీసం నాలుగు,గరిష్టంగా ఆరు పదోన్నతులు పొందొచ్చు. ఏసీఐఓ-గ్రేడ్ 2 హోదాలో నియమితులైన వారు జాయింట్ డిప్యూటీ డైరెక్టర్ హోదాకు చేరుకోవచ్చు.

రాత పరీక్షలో రాణించేలా

కరెంట్ అఫైర్స్

సమకాలీన అంశాలపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. ముఖ్యంగా ఇటీవల కాలంలో చోటు చేసుకున్న సంఘ విద్రోహ ఘటనలు, సైనిక చర్యలు, శాస్త్ర సాంకేతిక అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా.. అంతర్గత భద్రతకు సంబంధించి తీసుకుంటున్న చర్యల గురించి తెలుసుకోవాలి. దీంతోపాటు.. ఇతర దేశాలతో ద్వైపాక్షిక భద్రత ఒప్పందాలపై అవగాహన కూడా ఉపయుక్తంగా ఉంటుంది. వీటితోపాటు సాధారణ సమకాలీన అంశాలపై దృష్టి సారించాలి.

జనరల్ స్టడీస్

భారతదేశ చరిత్ర, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, రాజ్యాంగం, శాస్త్రీయ పరిశోధనలు వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకుంటున్న సమకాలీన పరిణామాలపైనా అవగాహన పెంచుకోవాలి.

న్యూమరికల్ ఆప్టిట్యూడ్

ప్యూర్ మ్యాథ్స్‌తోపాటు అర్థ గణిత అంశాలపై పట్టు పెంచుకోవాలి. డెసిమల్స్,ఫ్రాక్షన్స్, నంబర్స్, పర్సంటేజెస్, రేషియోస్, ప్రపోర్షన్స్, స్క్వేర్ రూట్స్, యావరేజస్, ప్రాఫిట్ అండ్ లాస్, అల్జీబ్రా, లీనియర్ ఈక్వేషన్స్, ట్రయాంగిల్స్, సర్కిల్స్, టాంజెంట్స్, ట్రిగ్నోమెట్రీలపై పట్టు సాధించాలి.

రీజనింగ్/లాజికల్ ఆప్టిట్యూడ్

ఇందులో రాణించేందుకు వెర్బల్, నాన్-వెర్బల్ రీజనింగ్ అంశాలపై అవగాహన పెంచుకోవాలి. స్పేస్ విజువలైజేషన్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, అనాలజీస్, ప్రాబ్లమ్ సాల్వింగ్ అనాలిసిస్, విజువల్ మెమొరీ, అబ్జర్వేషన్, క్లాసిఫికేషన్స్, నంబర్ సిరిస్, కోడింగ్-డీకోడింగ్, నంబర్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వర్డ్ బిల్డింగ్, వెన్ డయాగ్రమ్స్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఇంగ్లిష్ విభాగంలో స్కోర్ కోసం బేసిక్ గ్రామర్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా యాంటానిమ్స్, సినానిమ్స్, మిస్-స్పెల్ట్ వర్డ్స్, ఇడియమ్స్, ఫ్రేజెస్, యాక్టివ్/ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూటషన్స్, ప్యాసేజ్ కాంప్రహెన్షన్‌లను ప్రాక్టీస్ చేయాలి.

డిస్క్రిప్టివ్ టెస్ట్‌కు ప్రత్యేకంగా

ఇంగ్లిష్ డిస్క్రిప్టివ్ టెస్ట్ కోసం వొకాబ్యులరీ పెంచుకోవాలి. అదే విధంగా సెంటెన్స్ ఫార్మేషన్, సెంటెన్స్ కరెక్షన్‌లను ప్రాక్టీస్ చేయాలి. ఇందుకోసం దినపత్రికల్లోని ఎడిటోరియల్స్, అదే విధంగా ఆయా పోటీ పరీక్షలకు సంబంధించి డిస్క్రిప్టివ్ ఆన్సర్స్‌ను ప్రాక్టీస్ చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** డిసెంబర్ 15, 2023
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://www.mha.gov.in/en, www.ncs.gov.in

క్లుప్తంగా...

కార్డియోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా పీసీ రథ్



సాక్షి, హైదరాబాద్: అపోలో ఆస్పత్రుల సీనియర్ కార్డియాలజిస్ట్ పీసీ రథ్‌కు అరుదైన గౌరవం లభించింది. కార్డియోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కోల్‌కతాలో జరిగిన కార్డియోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్లాటినం జూబ్లీ వార్షిక కాన్ఫరెన్స్‌లో రథ్‌కు ఈ గౌరవం దక్కింది. ఈ సమావేశానికి దేశవ్యాప్తంగా 4 వేల మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. సొసైటీ అధ్యక్షుడిగా పీసీ రథ్ వివిధ రాష్ట్ర శాఖలు, ఇతర దేశాల్లోని వివిధ కార్డియోలాజికల్ సొసైటీలతో సమన్వయం చేసుకుంటారు. ఆయన ప్రభుత్వంతో కూడా సమన్వయం చేసుకుంటారు.

సీఎం సెక్యూరిటీ గ్రూప్ ఎస్పీగా గుమ్మి చక్రవర్తి

ఉత్తర్వులు జారీ చేసిన డీజీపీ రవిగుప్తా

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి భద్రతా విధులు నిర్వహించే సీఎంఎస్జీ(చీఫ్ మినిస్టర్ సెక్యూరిటీ గ్రూప్) ఎస్పీగా గుమ్మి చక్రవర్తి నియమితులయ్యారు. ఈ మేరకు డీజీపీ రవిగుప్తా సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం టీఎస్ నార్కోటిక్స్ బ్యూరోలో ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న చక్రవర్తిని సీఎంఎస్జీ ఎస్పీగా తాత్కాలికంగా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వెనువెంటనే నూతన విధుల్లో చేరాలని చక్రవర్తిని డీజీపీ ఆదేశించారు.

ఏబీవీపీ జాతీయ కార్యదర్శిగా హెచ్‌సీయూ నేత శ్రావణ్



శ్రావణ్ బిరాజ్ | షేక్ ఆయేషా | కర్ణిసింగ్

రాయదుర్గం: అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జాతీయ కమిటీలో గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నాయకులకు అవకాశం కల్పించారు. తాజాగా జాతీయ ఏబీవీపీ కమిటీని ఏర్పాటు చేయగా అందులో హెచ్‌సీయూ ఏబీవీపీ నాయకులు ముగ్గురికి అవకాశం ఇచ్చారు. ఏబీవీపీ జాతీయ కార్యదర్శిగా శ్రావణ్ బిరాజ్‌ను నియమించారు. ఏబీవీపీ సెంట్రల్ యూనివర్సిటీ వర్క్స్ నేషనల్ కో కన్వీనర్‌గా కర్ణిసింగ్, జాతీయ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలిగా షేక్ ఆయేషాను నియమించారు. జాతీయ కమిటీలో ముగ్గురికి అవకాశం కల్పించడం పట్ల ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు అక్షయ్ అంగుల్‌వార్, ఉపాధ్యక్షుడు తరుణ్‌శర్మ, కార్యదర్శి ఆకాశ్ భాటి హర్షం వ్యక్తంచేశారు. ఏబీవీపీ రాష్ట్ర కమిటీలో కూడా వర్కింగ్ కమిటీ సభ్యులుగా ఎం.సందీప్‌రావు, ఛత్రపతిచౌహాన్, మహేశ్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఆర్.ఫణిందర్, పావన, దేబేంద్ర నియమితులైనట్లు తెలిపారు.

ఆ ఎండీవో, పీఎస్‌పై.. వారెంట్ ఎత్తివేత

సాక్షి, హైదరాబాద్: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట్ మండల పరిషత్ డెవలప్‌మెంట్ అధికారి (ఎండీవో), మజీద్‌పూర్ పంచాయతీ సెక్రటరీ (పీఎస్)పై గతంలో జారీ చేసిన నాన్ బెయిలబుల్ వారెంట్‌ను హైకోర్టు వెనక్కు తీసుకుంది. విచారణ డిసెంబర్ 1న ఉండగా.. తమకు నోటీసులు 5న అందాయని వారిద్దరూ కోర్టుకు హాజరై వివరణ ఇవ్వడంతో న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు మజీద్‌పూర్‌లోని ఆక్రమణలపై స్థాయి నివేదిక అందజేయాలని ఆదేశించింది. తదుపరి విచారణకు హాజరు నుంచి ఇద్దరికీ మినహాయింపు ఇస్తూ.. విచారణను ఈనెల 27కు వాయిదా వేసింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట్ మండలం మజీద్‌పూర్‌లోని అక్రమ కట్టడాలపై పంచాయతీ సెక్రటరీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై తాను జనవరి 23న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని.. అయినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట్ మండలం మజీద్‌పూర్‌కు చెందిన అశోక్‌రెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ చేపట్టింది.

ముందస్తు బెయిల్ కోసం తలసాని ఓఎస్డీ పిటిషన్

సాక్షి, హైదరాబాద్: పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఫైళ్ల చోరీ ఉదంతంలో తనపై నమోదైన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఓఎస్డీ కల్యాణ్ కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మూడురోజుల క్రితం పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఫైళ్లు మాయమైన విషయం తెలిసిందే. దీనిపై వాచ్‌మెన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కల్యాణ్‌తోపాటు మరో నలుగురిపై కూడా కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ కోరుతూ కల్యాణ్ హైకోర్టును ఆశ్రయించారు. నేడు(మంగళవారం) ఈ పిటిషన్‌పై విచారణ జరిగే అవకాశం ఉంది.

• మహాలక్ష్మి భళా..



ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఎఫెక్ట్ ఓ వైపు..: కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ఆలయానికి పోటెత్తిన మహిళా భక్తులు వీరు. కాళేశ్వరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చారు. తిరిగి వెళ్లే సమయంలో అంతా బస్సుల కోసం ఎగబడ్డారు. బస్సులు బస్టాండ్‌లోకి కూడా రాకముందే వెళ్లి.. డ్రైవర్ వైపు ఉండే తలుపు, కిటికీల నుంచీ బస్సుల్లోకి ఎక్కారు.

• ఆటోవాలా డీలా



ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఎఫెక్ట్ ఇంకోవైపు..: మహిళలంతా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణానికే మొగ్గుచూపుతుండటంతో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఖాళీగా ఉన్న ఆటోలు ఇవి. అటు బస్సులు కిక్కిరిసిపోతుంటే.. ఇటు ఆటో వాలాలు మాత్రం గిరాకీ లేక డీలా పడ్డారు. 'మహాలక్ష్మి' పథకం ప్రారంభానికి ముందు రోజూ రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు సంపాదించేవాళ్లమని.. ఇప్పుడు రూ.200– రూ.300 కూడా గిట్టుబాటు కావడం లేదని ఆటోవాలాలు వాపోతున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

టీఎస్‌పీఎస్సీ చైర్మన్... జనార్దన్‌రెడ్డి రాజీనామా

అంతకు ముందు సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ

- ఆ తర్వాత కొద్దిసేపటికే రాజీనామా..ఆమోదించిన గవర్నర్
- ప్రశ్నపత్రాల లీకేజీలతో దెబ్బతిన్న కమిషన్ పరపతి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) చైర్మన్ బి.జనార్దన్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. సోమవారం సాయంత్రం గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌కు రాజీనామా పత్రం సమర్పించారు. ఆయన రాజీనామాను ఆమోదించిన గవర్నర్ తదుపరి చర్యలు తీసుకోవాలని సీఎస్ శాంతికుమారిని ఆదేశించారు. రాజీనామాకు ముందు సీఎం రేవంత్‌రెడ్డిని జనార్దన్‌రెడ్డి కలిశారు. కమిషన్‌కు సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించినట్లు తెలిసింది. ఈ భేటీ ముగిసిన వెంటనే జనార్దన్‌రెడ్డి రాజీనామా చేయడం గమనార్హం.

దిగజారిన ప్రతిష్ట

ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ నియామకాల విషయంలో టీఎస్‌పీఎస్సీ జాతీయ స్థాయిలో ఘనత సాధించింది. పలు రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచింది. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తుల స్వీకరణ, పరీక్షల నిర్వహణ, ఫలితాల ప్రకటన తదితర ప్రక్రియలన్నీ సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో పూర్తి చేస్తూ విజయవంతంగా దూసుకెళ్లింది. 2021 మే 21వ తేదీన టీఎస్‌పీఎస్సీ చైర్మన్ బాధ్యతలు జనార్దన్‌రెడ్డి స్వీకరించారు. ఆ తర్వాత నూతన జోనల్ విధానం అమలు నేపథ్యంలో ఉద్యోగ ప్రకటనల జారీలో జాప్యం జరిగింది. అయితే గతేడాది ఏప్రిల్ నుంచి క్రమంగా ఆ ప్రక్రియ ఊపందుకుంది. అత్యంత ఎక్కువ సంఖ్యలో 503 ఉద్యోగాలతో గ్రూప్–1 నియామకాల ప్రకటన జారీ చేసి రికార్డు సృష్టించింది. ఆ తర్వాత వరుసగా దాదాపు 30 వేల ఉద్యోగాలకు నెలల వ్యవధిలోనే ప్రకటలు జారీ చేస్తూ వచ్చింది. పెద్ద సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి పూనుకోవడంతో ఇంటిదొంగలు తయారయ్యారు. గ్రూప్–1 సహా పలు ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంతో టీఎస్‌పీఎస్సీ పరపతి ఒక్కసారిగా దిగజారింది. పోలీసుల కేసులు, పలువురు ఉద్యోగులు జైలుపాలు కావడం, అప్పటికే నిర్వహించిన పరీక్షల రద్దు తదితరాలన్నీ కమిషన్ స్థాయిని పూర్తిగా దిగజార్చాయి. ఈ నేపథ్యంలోనే చైర్మన్‌ను, సభ్యులను మార్చాలంటూ నిరుద్యోగులు ఒత్తిడి తెచ్చారు. క్రమంగా పరిస్థితులు కాస్త సద్దుమణగడం, పరీక్షల పునర్ నిర్వహణ తేదీలు ప్రకటించడంతో నిరుద్యోగులు సన్నద్ధతపై దృష్టి పెట్టారు.

జనార్దన్‌రెడ్డి వెటర్నరీ సైన్స్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1990లో గ్రూప్–1 అధికారిగా నియమితులయ్యారు. 1996లో కన్ఫర్డ్ ఐఏఎస్‌గా పదోన్నతి పొందారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, పురపాలన, పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ, వ్యవసాయ శాఖల్లో కీలక హోదాల్లో పనిచేశారు. వాటర్ బోర్డు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కమిషనర్‌గా సేవలందించారు. అత్యంత నిజాయితీ గల అధికారిగా పేరుంది. ఈ నేపథ్యంలోనే గత ప్రభుత్వం ఆయన్ను టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా నియమించింది. ప్రస్తుతం ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఆయన రాజీనామా చేశారని అంటున్నారు. టీఎస్‌పీఎస్సీ బోర్డులో ప్రస్తుతం ఐదురుగు సభ్యులున్నారు. వారు కూడా ఒకట్రెండు రోజుల్లో రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు సమాచారం.

ఎవరికి బాధ్యతలు అప్పగించాలి?

గందరగోళంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్, వైస్ చైర్మన్

- ఎలాంటి స్పష్టత ఇవ్వని విద్యాశాఖ కార్యదర్శి
- కార్యదర్శి, వైస్ చైర్మన్–2ను కూడా తప్పిస్తారనే ప్రచారం
- చైర్మన్‌గా వెంకటరమణకు చాన్స్!



సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, వైస్ చైర్మన్ వి.వెంకటరమణలను ప్రభుత్వం పదవుల నుంచి తప్పించగా, వారు ఎవరికి బాధ్యతలు అప్పగించాలనే విషయమై స్పష్టత లేకపోవడంతో గందరగోళం నెలకొంది. ప్రభుత్వం ఆదివారం జీవో విడుదల చేయగా, ఆ మేరకు లింబాద్రి, వెంకటరమణ తక్షణమే బాధ్యతలు అప్పగించేందుకు సిద్ధమయ్యారు. అయితే ఎవరికి అప్పగించాలనే దానిపై విద్యా శాఖ కార్యదర్శి వాకాటి కరుణను వివరణ కోరారు. పలు సమావేశాల బిజీలో ఉన్న ఆమె, దీనిపై పెద్దగా దృష్టి సారించలేదని, ఈ కారణంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిసింది. దీంతో వారు విద్యాశాఖ కార్యదర్శికే బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించుకున్నారని, ఒకవేళ ఆమె ఏవైనా ఆదేశాలిస్తే ఇంకెవరికైనా అప్పగించే వీలుందని తెలిపారు. అయితే మండలి కార్యదర్శి, వైస్ చైర్మన్–2 కూడా గత ప్రభుత్వ హయాంలో నియమితులైన వారే కావడంతో, వీరిని కూడా తప్పించే అవకాశం ఉందనే ప్రచారం మండలి వర్గాల్లో జరుగుతోంది.

సమావేశాలన్నీ రద్దు

తాజా పరిణామాల నేపథ్యంలో మండలి పరిధిలో జరగాల్సిన పలు సమావేశాలు రద్దయ్యాయి. ఈ వారం మొదట్లోనే 2024 ఉమ్మడి ప్రవేశ పరీక్షలపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ మేరకు విశ్వవిద్యాలయాల ఉప కులపతులతో సమావేశం ఏర్పాటు చేయాలని భావించారు. సెట్ కన్వీనర్ల పేర్లు పరిశీలన నిమిత్తం వర్సిటీల వీసీలకు అధికారికంగా లేఖ రాయాల్సి ఉంది. రాష్ట్రంలో కీలకమైన ఎంసెట్‌పైనా స్పష్టత ఇచ్చేందుకు, కన్వీనర్ ఎంపిక కోసం ఈ వారం ఉన్నతాధికారులు భేటీ కావాల్సి ఉంది. అయితే ప్రస్తుతం రద్దయ్యాయి. వీటిపై స్పష్టత వచ్చే వరకు ముందుగా నిర్ణయించిన విధంగా ఎవరూ హైదరాబాద్‌కు రావాల్సిన అవసరం లేదంటూ అధికారులు సమాచారం ఇచ్చారు.

బాసర ఇన్‌చార్జి వీసీ మాటేమిటి?

వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వి.వెంకటరమణను ఆ పదవి నుంచి తప్పించిన ప్రభుత్వం.. బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీగా కొనసాగాలా? వద్దా? అనేదానిపై జీవోలో స్పష్టత ఇవ్వలేదు. దీంతో తాను ఇంకా ట్రిపుల్ ఐటీ వీసీనే అని ఆయన చెబుతున్నారు. ప్రొఫెసర్ లింబాద్రిని మండలి చైర్మన్‌గా తీసుకునే వరకూ వీసీ–2గా ఉన్న వెంకటరమణ ఆ తర్వాత వీసీ–1గా మారారు. అయితే ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన ఉత్తర్వుల్లో ఆయనను వీసీ–2గా పేర్కొంది. ప్రభుత్వ ఉత్తర్వుల్లో స్పష్టత లేక పోవడంతో దీనిపై ఆయన చట్టపరమైన పోరాటం చేసే అవకాశం ఉందని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. మరోవైపు ఉత్తర తెలంగాణకు చెందిన ఓ కీలక మంత్రి ఆశీస్సులు వెంకటరమణకు ఉన్నాయని, ఆయనను మండలి చైర్మన్‌గా నియమించే వీలుందని మండలి వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

దేశాభివృద్ధిలో యువత కీలకపాత్ర

వికసిత్ భారత్ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై



సాక్షి, హైదరాబాద్: దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం కీలకమని, సరికొత్త ఆలోచన విధానం అందించే శక్తి వారికి ఉందని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తెలిపారు. ఈ దిశగా విద్యార్థులు ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. నీతి ఆయోగ్, భారత ప్రభుత్వం నేతృత్వంలో వికసిత్ భారత్ పోర్టల్‌ను సోమవారం నరేంద్ర మోదీ ఢిల్లీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజ్‌భవన్‌లో గవర్నర్ వివిధ యూనివర్సిటీల వీసీలు, ప్రొఫెసర్లు, విద్యావేత్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వికసిత్ భారత్ విద్యార్థులకు ఒక వరమని, ఈ గొప్ప అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, తమ ఆలోచనలు పంచుకోవాలని సూచించారు. 2047 నాటికి దేశం అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధించేందుకు విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలను ప్రధానికి అందించవచ్చని తెలిపారు. వికసిత్ భారత్‌లో విద్యార్థుల భాగస్వామ్యం కోసం అన్ని విశ్వవిద్యాలయాల వీసీలు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా పలు విశ్వవిద్యాలయాల వీసీలు భారత్ పురోభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై తమ ఆలోచనలను పంచుకున్నారు.

ప్రార్థనా మందిరాల్లోకి షియా మహిళలను అనుమతించండి

వక్ఫ్ బోర్డును ఆదేశించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: 'స్త్రీ పురుషుడి కంటే తక్కువ కాదు.. జన్మనిచ్చిన తల్లి మనకంటే ఎలా తక్కువ అవుతుంది. ఇబ్బందులున్న రోజులు తప్ప నిరభ్యంతరంగా మహిళలు ప్రార్థన చేసుకోవచ్చు. దేవుడి పూజకు తరతమ భేదాలు ఉండవన్న విషయాన్ని పవిత్ర గ్రంథాలు చెబుతున్నాయి. అయినా మనం వివక్ష పాటించడం సరికాదు'అని హైకోర్టు ఓ పిటిషన్ విచారణ సందర్భంగా వ్యాఖ్యానించింది. మసీదులతో పాటు జషన్స్‌లోకి షియా మహిళలను కూడా అనుమతించాలని, ఆ మేరకు చర్యలు చేపట్టాలని వక్ఫ్‌బోర్డును ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ప్రార్థనలకు షియా మహిళలను అనుమతించపోవడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో అంజుమన్ ఎ అలవి, షియా ఇమామియా ఇతాఆశారీ అక్బరి సొసైటీ కార్యదర్శి ఫాతిమా పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ నగేశ్ భీమపాక సోమవారం విచారణ చేపట్టారు. ముతవల్లీల కమిటీ షియా మహిళలను మాత్రమే లోనికి అనుమతించకడం లేదని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. వక్ఫ్ బోర్డుకు వినతిపత్రం సమర్పించినా, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. రాజ్యాంగం అందరికీ సమానత్వ హక్కులను కల్పించిందని, ఆ హక్కులను హరించే అధికారం ఎవరికీ లేదన్నారు. భగవద్గీత, ఖురాన్, బైబిల్ తదితర గ్రంథాల్లో మహిళల గురించి పేర్కొన్న అంశాలను ఈ సందర్భంగా న్యాయమూర్తి చదివి వినిపించారు. కౌంటర్ దాఖలు చేయాలని వక్ఫ్ బోర్డును ఆదేశిస్తూ విచారణ వాయిదా వేశారు.

'ప్రసాద్' పథకంలో పనుల జాప్యం

- రామప్ప, భద్రాచలం, సింహాచలం ఆలయాలకు నిధుల కేటాయింపు... పనులు జీరో
- 52% పూర్తయిన 'జోగుళాంబ' అభివృద్ధి పనులు
- ప్రసాద్ పథకంలో కొత్తగా అన్నవరం, వేదగిరి ఆలయాలు
- లోక్‌సభలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: ప్రసాద్ పథకంలో భాగంగా దేవాలయాల అభివృద్ధికి 2022–23లో తెలంగాణలోని రామప్ప, భద్రాచలం దేవాలయాలను ఎంపిక చేశామని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. అయితే రామప్ప దేవాలయానికి రూ.62 కోట్లు, భద్రాచలం దేవాలయానికి రూ.41.38 కోట్ల నిధులకు ఆమోదం తెలిపినప్పటికీ, ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని బీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావు అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి బదులిచ్చారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని సింహాచలం ఆలయ అభివృద్ధికి రూ.54.04 కోట్లు ఆమోదం తెలిపినప్పటికీ అక్కడా పనులు ప్రారంభం కాలేదని వెల్లడించారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా వచ్చిన ప్రతిపాదనల్లో ప్రసాద్ పథకంలో భాగంగా 46 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపి నిధులు మంజూరు చేసినట్లు కిషన్‌రెడ్డి చెప్పారు. ఇందులో తెలంగాణలో 3, ఆంధ్రప్రదేశ్‌లో 3 ప్రాజెక్టులు ఉన్నాయి. ఏపీలో అమరావతి పట్టణ అభివృద్ధి, శ్రీశైలం ఆలయ అభివృద్ధి ప్రాజెక్టులు పూర్తి కాగా... తెలంగాణలో అలంపూర్ జోగుళాంబ దేవస్థాన పనులు 50 శాతం పూర్తయ్యాయని పేర్కొన్నారు. జోగుళాంబ దేవస్థాన ప్రాజెక్టుకు రూ.36.73 కోట్లతో ఆమోదం తెలిపామన్నారు. కాగా ప్రసాద్ పథకంలో అభివృద్ధి చేసేందుకు కొత్తగా 33 ప్రాజెక్టులను గుర్తించామని కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లోని అన్నవరం దేవస్థానంతో పాటు నెల్లూరులోని వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానాన్ని గుర్తించినట్లు కేంద్రమంత్రి పేర్కొన్నారు.

బాధ్యులపై ఏం చర్యలు తీసుకున్నారు?

బజార్‌ఘాట్ అగ్నిప్రమాద ఘటనపై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: నాంపల్లిలోని బజార్‌ఘాట్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో బాధ్యులపై ఏం చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ.. విచారణను వాయిదా వేసింది. బజార్‌ఘాట్‌లో బాలాజీ రెసిడెన్సీలో నవంబర్ 13న ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించి తొమ్మిది మంది మృతి చెందారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ ఘటనలో యాజమాని రమేశ్ జైస్వాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అయితే ఈ ఘటనపై పూర్తి దర్యాప్తు జరిపి.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ హైకోర్టుకు లేఖ అందింది. దీన్ని సుమోటో పిల్‌గా విచారణకు స్వీకరించి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతివాదులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీ, అగ్నిమాపక డీజీ, జీహెచ్ఎంసీ, హైదరాబాద్ సీపీ, కలెక్టర్, జోనల్ కమిషనర్, నాంపల్లి ఎస్‌హెచ్‌ఓకు నోటీసులు జారీ చేసింది.

ఆల్‌నైన్ @ రూ.17.35 లక్షలు

ఆర్టీఏ ఫ్యాన్సీ నంబర్లకు అనూహ్య స్పందన


సాక్షి, హైదరాబాద్: ఆర్టీఏ ప్రత్యేక నంబర్లపై వాహనదారులు మరోసారి తమ క్రేజ్‌ను చాటుకున్నారు. సోమవారం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో 'టీఎస్ 09 జీఈ 9999'నంబర్‌ను కీ స్టోన్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సంస్థ ఏకంగా రూ.17,35,000 చెల్లించి సొంతం చేసుకుంది. అలాగే 'టీఎస్ 09 జీఎఫ్ 0005'నంబర్‌కు లలిత జ్యువెలర్స్‌మార్ట్ రూ.3,75,000 చెల్లించింది. 'టీఎస్ 09 జీఎఫ్ 0001'నంబర్ కోసం ఎన్‌బీకే టాలెంట్ స్టూడియో అనే సంస్థ బిడ్డింగ్‌లో రూ.3,50,000 చెల్లించి సొంతం చేసుకుంది. అలాగే 'టీఎస్ 09 జీఎఫ్ 0099'నంబర్‌కు ద్యాప విరూధినిరెడ్డి అనే వాహనదారు రూ.2,31,999 'టీఎస్ 09 జీఎఫ్ 0111'నంబర్‌కు



99 వెంచర్స్ సంస్థ రూ.2,09,999 'టీఎస్ 09 జీఈ 0027'నంబర్ కోసం న్యూలాండ్ లేబొరేటరీస్ సంస్థ రూ.1,36,500 చెల్లించింది. 'టీఎస్ 09 జీఎఫ్ 0007'నంబర్‌ను హిల్ థియరీ ఐటీ సొల్యూషన్స్ రూ.1,01,999తో సొంతం చేసుకుంది. సోమవారం నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో ప్రత్యేక నంబర్లపై రూ.45,98,490 ఆదాయం లభించినట్లు జేటీసీ పాండురంగ నాయక్ తెలిపారు.

నీళ్లలో కింగ్.. షార్క్‌లైనా హాంఫట్





డైనోసార్లలో కింగ్ లాంటి టీ–రెక్స్ ఓ వైపు.. శాస్త్రవేత్తలు జన్యుమార్పిడి చేసి సృష్టించిన భయంకరమైన ఇండోమినస్–రెక్స్ మరోవైపు.. అత్యంత ఘోరంగా తలపడుతుంటాయి. పోట్లాడుతూ.. పోట్లాడుతూ.. పక్కనే ఉన్న కొలను సమీపంలోకి వెళ్తాయి. టీ–రెక్స్ ఓడిపోయే దశలో ఉంటుంది. అంతలోనే కొలనులోంచి ఓ అతి భారీ డైనోసార్ బయటికొచ్చి ఇండోమినస్–రెక్స్ నోట కరుచుకుని లాక్కెళ్లిపోతుంది. 2015లో వచ్చిన జురాసిక్ వరల్డ్ సినిమాలో క్లైమాక్స్ సీన్ ఇది. చాలా మంది చూసే ఉంటారు. అదిగో ఆ చివరిలో నీటిలోంచి బయటికి వచ్చిన భారీ డైనోసార్ పేరే.. ప్లియోసార్. భూమ్మీది జీవుల్లో టీ–రెక్స్ కింగ్ అయితే.. నీటిలో రాజ్యమంతా ప్లియోసార్‌దే.

ఈ భయంకరమైన ప్లియోసార్ పుర్రె శిలాజాన్ని శాస్త్రవేత్తలు ఇంగ్లండ్ సముద్ర తీరంలోని కిమ్మరిడ్జ్ బే ప్రాంతంలో గుర్తించారు. ఏడు అడుగులకుపైగా పొడవున్న ఈ పుర్రెకు.. 130 పదునైన దంతాలు ఉండటం గమనార్హం. ఒక్కో పన్ను ఏడెనిమిది అంగుళాలకన్నా పొడవు ఉన్నాయి. ఈ ప్లియోసార్‌లు మొసళ్ల ఆకృతిలో మొత్తంగా 32 అడుగుల నుంచి 39 అడుగుల వరకు (10 నుంచి 12 మీటర్లు) పొడవు ఉంటాయని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ ప్లియోసార్ సుమారు 15 కోట్ల ఏళ్ల కింద జీవించి నదిగా అంచనా వేసినట్టు వివరించారు. సముద్రాల్లో జీవించిన వాటిలో ఇది అత్యంత భయంకరమైనదని.. పెద్ద పెద్ద షార్క్‌ల వంటి వాటిని కూడా జస్ట్ అలా నమిలి మింగేసేదని పేర్కొన్నారు.

– సాక్షి సెంట్రల్ డెస్క్

ఐపీఓ స్కాంలో రూ.12.11 కోట్ల ఆస్తులు జప్తు

నిర్మల కొటేచ, పవన్ కుచన, కిశోర్ తపాడియా ఆస్తులు సీజ్ చేసిన ఈడీ

సాక్షి, హైదరాబాద్: ఐపీఓ (ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్)ల పేరిట మనీలాండరింగ్‌కు పాల్పడిన తక్షీల్ సొల్యూషన్స్ లిమిటెడ్ కంపెనీ కేసులో ఈడీ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసులో కీలకంగా ఉన్న నిర్మల కొటేచ, పవన్ కుచన, కిశోర్ తపాడియాలకు చెందిన రూ.12.11 కోట్ల విలువైన స్థిర, చర ఆస్తులను ఈడీ అధికారులు సోమవారం జప్తు చేశారు. ఈ మేరకు ఈడీ అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. తక్షీల్ సొల్యూషన్స్ లిమిటెడ్ కంపెనీ ప్రమోటర్లు, డైరెక్టర్లు, ఇతరులు కలిసి ఐపీఓల పేరిట మోసాలకు పాల్పడినట్టు సెబీ (సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా) ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈడీ అధికారులు కేసు నమోదు చేశారు.

విదేశీ కంపెనీల్లోకి అక్రమంగా నిధుల మళ్లింపు

పవన్, నిర్మల, కిశోర్‌లు ముందస్తు పథకం ప్రకారం ఐపీఓ జారీ చేయడం కోసం తక్షీల్ సొల్యూషన్స్ లిమిటెడ్ ఆదాయాన్ని పెంచి చూపి, ఆ తర్వాత ఐపీఓ ద్వారా వచ్చిన రూ.80.50 కోట్ల ఆదాయాన్ని పలు విదేశీ కంపెనీల్లోకి అక్రమంగా మళ్లించినట్టు ఈడీ అధికారులు తమ దర్యాప్తులో గుర్తించారు. అమెరికా, సింగపూర్, హాంకాంగ్ తదితర దేశాల్లోని తమ సంస్థల్లోకి కోట్ల రూపాయల సొమ్మును నిందితులు మళ్లించినట్టు పేర్కొన్నారు. మనీలాండరింగ్‌కు సంబంధించి కీలక ఆధారాలు లభించడంతో ఆ ముగ్గురు నిందితులను ఈడీ గతంలోనే అరెస్టు చేసింది. వీరిలో నిర్మల కొటేచ, కిషోర్ తపాడియాకు తెలంగాణ హైకోర్టు ఈనెల 6న బెయిల్ మంజూరు చేయగా, పవన్ కుచన ఇప్పటికీ జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నట్టు ఈడీ అధికారులు తెలిపారు.

డీఆర్‌డీఎల్ శాస్త్రవేత్త జైతీర్థ్ జోషికి ఐఎన్ఏఈ ఫెలోషిప్

సాక్షి, హైదరాబాద్: నగరంలోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లేబొరేటరీ (డీఆర్‌డీఎల్) ప్రోగ్రాం డైరెక్టర్, ప్రఖ్యాత శాస్త్రవేత్త జైతీర్థ్ ఆర్ జోషికి ఇండియన్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఇంజనీరింగ్ (ఐఎన్ఏఈ) ఫెలోషిప్ దక్కింది. ఇంజనీరింగ్, టెక్నాలజీలో అగ్రశ్రేణి సంస్థల్లో ఇండియన్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఇంజనీరింగ్ ఒకటి. జైతీర్థ్ దేశ క్షిపణి వ్యవస్థల ఉత్పత్తి, నాణ్యత మెరుగుపరచడంలో, ఎంఎస్ఎంఈ రంగానికి అపారమైన వ్యాపార సామర్థ్యాన్ని సృష్టించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడంలో విశేష కృషి చేశారు. ఈ మేరకు సోమవారం భువనేశ్వర్‌లో శిక్షా అనుసంధాన్ విశ్వవిద్యాలయంలో జరిగిన ఐఎన్ఏఈ వార్షిక కన్వెన్షన్–2023లో ఐఎన్ఏఈ అధ్యక్షుడు ఇంద్రనీల్ మన్నా చేతుల మీదుగా ఫెలోషిప్ అందుకున్నట్లు ఐఎన్ఏఈ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. దేశ భద్రత, ఆర్థిక వృద్ధికి స్థిరమైన వ్యూహాత్మక వస్తు సరఫరాను నిర్ధారించడంలో 'నేషనల్ మెటీరియల్ పాలసీ' రూపొందించడంలో జైతీర్థ్ కీలకపాత్ర పోషించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.